
మంగళవారం 8 సెప్టెంబరు 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# ప్రజల ఓటే మనకు గీటురాయి

- 2029లో మెరుగైన ఫలితాలు రావాలి
- కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకే పార్టీలో పూర్తి గౌరవం
- పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యమిస్తూ పాలనలో ముందుకు
- ప్రతి ఎకరాకూ నీటితో తెలుగు తల్లికి జల హారతి
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు... ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి
- ఉగ్రవాదుల్లా హిట్-రన్-హైడ్ విధానంతో గొడ్డలి పార్టీ రాజకీయం
- టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి సీఎంకు పార్టీ నేతల స్టాండింగ్ ఒవేషన్

2



*"ప్రజల ఓటే గీటురాయిగా భావించి ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి, నాయకుడు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. 2024 కంటే 2029 ఎన్నికల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించడమే మన లక్ష్యం కావాలి" అని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాంక్లేవ్' ప్రారంభోత్సవంలో ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రతి ఎకరానికీ నీరందిస్తామని, తెలుగుతల్లికి జలహారతి సమర్పిస్తామని చెప్పారు. కష్టకాలంలో పార్టీ జెండాను భుజాన మోసి నిలబడిన ప్రతి కార్యకర్తకూ పూర్తి గౌరవం ఇస్తామన్నారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యమిస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ పాలనలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గొడ్డలి పార్టీ ఉగ్రవాదుల మాదిరిగా 'హిట్-రన్-హైడ్' విధానాన్ని అవలంబిస్తోంది. వైసీపీ చేసే ఫేక్ ప్రచారాన్ని ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. సోషల్ మీడియా ద్వారా వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి కౌంటర్ ఇవ్వాలని కోరారు. కాగా సాగునీటిరంగ పునరుద్ధరణకు, జల సంరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న భగీరథ ప్రయత్నాలను కొనియాడుతూ నేతలంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.*








## ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత దగ్గర చేయాలి

3

ఆర్టీజీఎస్‌పై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష

ఎన్నిసార్లు వివరణ ఇచ్చినా...

## మెగా డీఎస్సీపై అదే దుష్ప్రచారం

- టెట్ అర్హతలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవం
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ వివరణ



10

సమిష్టి కృషితో 'స్థానిక' ఎన్నికల్లో

## విజయం సాధించాలి

- ప్రజలు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలి
- కూటమి నేతలు సఖ్యతగా ఉండాలి
- నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి రూ.కోటి కేటాయింపు
- 25 ప్రాధాన్యతాంశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడి

3



ప్రజలు, కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ సమిష్టి కృషితో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో ప్రారంభమైన 'లీడర్షిప్ కాంక్లేవ్‌లో ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజక వర్గంలో సమస్యల తక్షణ పరిష్కారానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తున్నామని, అత్యంత కీలకమైన 25 ప్రాధాన్యతాంశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు. కూటమి నాయకులు సఖ్యతగా ఉండాలని, ప్రజలతో మమేకం కావాలని సూచించారు. నాయకులకు దిశానిర్దేశం చేయడానికి ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.

## 'లీడర్‌షిప్ కాంక్లేవ్'లో ఎవరేమన్నారంటే...



### కేడర్ అనుసంధానానికే

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 5 లో..

చంద్రబాబు తెలుగుదేశం ఆస్తి కాదు...

### తెలుగు జాతి ఆస్తి



- ఆయన దూరదృష్టితో రూపొందించిన పాలసీలు దేశానికే ఆదర్శం
- వాట్ చంద్రబాబు థింక్స్ టుడే... నేషన్ థింక్స్ టుమారో
- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

- వివరాలు 5 లో..

### ప్రజలకు సేవ చేసేందుకే అధికారం



- వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యం
- టీడీపీకి కార్యకర్తలే బలమని గుర్తించుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

- వివరాలు 5లో..

### ఉత్తమ పనితీరుతోనే నాయకత్వానికి బలం



- అహంకారం దగ్గరకు రానివ్వకూడదు
- ప్రజా జీవితంలో జాగ్రత్తగా మసలుకోవాలి
- జెన్‌జీలకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి
- శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు

- వివరాలు 7 లో..

చైతన్యరథం




# ప్రజల ఓటే మనకు గీటురాయి

- 2029లో మెరుగైన ఫలితాలు రావాలి
- కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకే పార్టీలో పూర్తి గౌరవం
- పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యమిస్తూ పాలనలో ముందుకు
- ప్రతి ఎకరాకూ నీటితో తెలుగు తల్లికి జల హారతి
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు... ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి
- ఉగ్రవాదుల్లా హిట్-రన్-హైడ్ విధానంతో గొడ్డలి పార్టీ రాజకీయం
- టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి సీఎంకు పార్టీ నేతల స్టాండింగ్ ఒవేషన్

అమరావతి (చైతన్యరథం): పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చి తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. వాటర్ మెన్‌గా ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొనటం సంతోషంగా ఉందని... జల సంరక్షణపై చేస్తున్న కష్టానికి దక్కిన గుర్తింపని ఆయన అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రెండు రోజులు జరిగే లీడర్షిప్ కాన్ క్లేవ్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం నేతలనుద్దేశించి ప్రసంగిస్తూ పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు వెళు‍న్నామన్నారు. కష్టకాలంలో నిలిచిన కార్యకర్తకు పూర్తి గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన సామాన్య కార్యకర్త దళవాయి రమాదేవి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ప్రజల ఓటే గీటు రాయిగా పనిచేద్దామని నేతలకు పిలుపునిచ్చారు. 2029లో మరింత మెరుగ్గా ఫలితాలు సాధిద్దామని నేతల్లో ఉత్సాహం నింపారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో తన జన్మ ధన్యమైందని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాలను చూసి అక్కడి ప్రజల కళ్లల్లో ఆనందభాష్పాలు వచ్చాయని తెలిపారు. ఎల్ నినో విపత్తుపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ ప్రజల్ని భాగస్వాములు చేయాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, వెలిగొండ, పోలవరం ఎడమ కాల్వ ప్రారంభోత్సవాల్లో ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్ ఇచ్చామని పరిపాలనా వెసులుబాటు కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు సమర్థ నాయకత్వం వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తున్నామని పొలిట్‌బ్యూరో, చట్టసభల్లోకి తీసుకు వచ్చామన్నారు. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్త బలంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ బలపడటం ఎంత ముఖ్యమూ కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని సీఎం దిశానిర్దేశం చేశారు. ఫొటోలు, ఫ్లెక్సీల గురించి వివాదాలు వద్దని కూటమిగా కలిసి క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. 2024 కంటే ఎక్కువ ఓట్లు వచ్చేలా పనిచేయాలని కోరారు. పనిచేయడంతో పాటు చేసిన పనిని సమర్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా ముఖ్యమన్నారు.

## వాటర్ మ్యాన్‌కు లీడర్షిప్ కాన్‌క్లేవ్ అభినందన

అంతకు ముందు కాన్ క్లేవ్‌లో... 'సీఈవో టు వాటర్‌మ్యాన్ అంటూ ఎకనామిక్ టైమ్స్ రాసిన కథనంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీకి ప్రాధాన్యం ఇచ్చి తెలుగు యువతను ఐటీ నిపుణులుగా మార్చిన చంద్రబాబు ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణతో వాటర్ మ్యాన్ గా మారారన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా వివిధ ప్రాంతాలకు జలవనరులు అందించేలా డ్రిప్ ఇరిగేషన్ సహా వివిధ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొందని మంత్రి వెల్లడించారు. జలం ఉంటేనే జనం, జలం ఉంటేనే అభివృద్ధి, ప్రగతి అన్న నినాదంతో 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో పోలవరం, వెలిగొండ లాంటి ప్రాజెక్టులు చేపట్టిన సీఎంకు ఎకనామిక్ టైమ్స్ ప్రశంసలు తెలిపిందని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు నీరు తేవడంతో పాటు రాయలసీమ ప్రాంతానికి హంద్రీ-నీవా ద్వారా నీరిచ్చారని ఎకనామిక్ టైమ్స్ కథనం తెలిపిందన్నారు. ఏపీలో ఉన్న 4కోట్ల ఎకరాల భూమిలో 2కోట్ల ఎకరాలు మాత్రమే సాగు చేసేందుకు ఆస్కారం ఉందని గుర్తించి నీరిచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారని ఆ కథనం వెల్లడించిందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో భూమి సాగుకిందకు రావాలంటే ప్రాజెక్టులు పూర్తి చేయడం ఒక్కటే మార్గమని సీఎం పాలసీగా పెట్టుకున్నట్టు ఎకనామిక్ టైమ్స్ రాసిందని మంత్రి తెలిపారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలను వేగంగా పూర్తి చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లటంలో సీఎం కృషిని కథనంలో ప్రస్తావించిందన్నారు. 2027 పుష్కరాలకంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తారన్న లక్ష్యాన్ని కూడా ఈటీ తన కథనంలో పేర్కొంది. వచ్చే మూడేళ్లలో రూ.35వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసే అంశాన్ని కూడా ప్రతిష్టాత్మక ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో ప్రశంసించిందన్నారు. జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచడంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారని ఆ కథనంలో వెల్లడించినట్టు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏపీకి సీఈవోగా మారిన సీఎం.. ప్రస్తుతం నీటి విలువను గుర్తించి వాటర్ మ్యాన్‌గా రూపాంతరం చెందారని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొందని మంత్రి రామానాయుడు వివరించారు. సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి తెలుగుదేశం పార్టీ నేతలంతా స్టాండింగ్ ఒవేషన్‌తో ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

## నాయకత్వానికి చిరునామా టీడీపీ

నాయకత్వానికి కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి అన్నారు. పార్టీలో తొలిసారిగా లీడర్షిప్ కాన్‌క్లేవ్‌ను నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ... సమర్థ నాయకత్వంతోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తును అంచనా వేయాలి. గత పాలకులు రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై నిలబెట్టారు. వ్యవస్థలను విధ్వంసం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల మద్దతు దక్కించుకున్నాం. పాలకుడు ఏ విధంగా ఉండకూడదో అనే దానికి గత పాలకుడే ఓ కేస్ స్టడీ. కేంద్ర సహకారంతో ఇచ్చిన హామీల అమలుకు అనునిత్యం పని చేస్తున్నాం. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ పాలన చేపట్టాం. నెలకు నాలుగు రోజులు తక్కువ కాకుండా క్షేత్రస్థాయిలో ఉంటున్నాను. పేదల సేవలో,మీ భూమి-మీ హక్కు, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, సంజీవని కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం అవుతున్నాను. విద్య-వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం... ప్రైవేట్ స్కూళ్లకు గుడ్‌బై చెప్పి ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నారు. 63 లక్షల మందికి రూ.73వేల కోట్ల మేర ఫించన్ ఇప్పటికే పంపిణీ చేశాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు, ఆటో డ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో, దీపం, మత్స్యకారుల సేవలో వంటి చాలా సంక్షేమ పథకాలు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేశాం. ఒక్క డీఎస్సీ కూడా పెట్టని వ్యక్తి మనపై విమర్శలు చేస్తున్నారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. నిర్దేశిత గడువులోగా పోలవరం, అమరావతి పూర్తవుతాయి. 28 పాలసీలతో 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమలు గ్రౌండ్ అవుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. గుగుల్, ఆర్సెలార్ లాంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర ఇప్పుడు అభివృద్ధికి కేంద్రం. అమరావతి క్వాంటం టెక్నాలజీతో పాటు నాలెడ్జి హబ్‌గా మారుతుంది. రాయలసీమ రైజింగ్ నినాదంతో గోల్డ్ ఫీల్డ్, ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ వచ్చాయి. త్వరలో హార్టికల్చర్ హబ్‌గా మారుతుంది. డేటా ఇంటిగ్రేషన్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేశాం. రెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. క్యూఆర్ కోడ్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తున్నాం. 22-ఎ భూముల వివాదాన్ని పరిష్కరిస్తున్నాం. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తే ప్రజా ప్రతినిధులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు.' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## ఫేక్ ప్రచారానికి ఫ్యాక్ట్‌తో గట్టిగా కౌంటర్

వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దని ఫ్యాక్ట్‌తో గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నేతలకు దిశానిర్దేశం చేశారు. గొడ్డలి పార్టీ ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ విధానాన్ని అనుసరిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఓ మంచి పనిపై విమర్శలు చేసేందుకు గొడ్డలి పార్టీ సిద్ధంగా ఉంటోందన్నారు. గతంలో టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంగా ఉన్నప్పటికీ.. పనులు పూర్తి కాకపోయినా వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం అంటూ డ్రామాలాడారన్నారు.

ఆ ప్రాజెక్టును ఇప్పుడు పూర్తి చేసి ప్రారంభిస్తే దానిని ఎప్పుడో పూర్తి చేసేశామని మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరిస్తే గోదావరి జలాలు కావు పురుషోత్తపట్నం నుంచి వచ్చాయంటున్నారని... కానీ ఆ ప్రాజెక్టుకు గొడ్డలి పార్టీ ఆనాడు అడ్డు పడిందని గుర్తు చేశారు. ఆ పార్టీ చేస్తున్న వక్రీకరణ లకు దిమ్మతిరిగేలా సమాధానం చెప్పాలన్నారు. ఏపీపీఎస్సీలో అడ్డగోలుగా అక్రమాలు చేశారని, అడుగడుగునా అవకతవకలకు పాల్పడ్డారన్నారు. అసెంబ్లీలో చర్చిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రజలు చూస్తారనే భయం వారిలో ఉందన్నారు. బయట కూర్చుని అసత్యాలు అదే పనిగా చెప్తారని ఎద్దేవా చేశారు. సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టా గ్రామ్‌లో యాక్టివ్‌గా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కోరారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు మరింతగా ఎదిగేందుకు పూర్తిగా సహకరిస్తామని, వారు కూడా అదేస్థాయిలో పనిచేయాలన్నారు. నాయకత్వాన్ని పెంచుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని, పార్టీకి బలం చేకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.







## సమిష్టి కృషితో 'స్థానిక' ఎన్నికల్లో

# విజయం సాధించాలి

- ప్రజలు, కేడర్‌ను సమన్వయం చేసుకోవాలి
- కూటమి నేతలు సఖ్యతగా ఉండాలి
- నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి రూ.కోటి కేటాయింపు
- 25 ప్రాధాన్యతాంశాలను నియోజకవర్గంలో గుర్తించాలి
- లీడర్షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడి

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక ఎన్నికల్లో ఓట్లుగా మారేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని తెలుగుదేశంపార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోకుండా కూటమి నేతలంతా సఖ్యతగా పనిచేస్తూ ఎలాంటిగ్యాప్‌లు లేకుండా చూసుకోవాలని సూచించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై చంద్రబాబు కీలక సూచనలు చేశారు.

### నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున కేటాయింపు

డబ్బు ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదని, ప్రజలు, కేడర్‌తో బలమైన అనుబంధమే విజయానికి పునాది అని సీఎం పేర్కొన్నారు. కేడర్‌ను నిర్లక్ష్యంచేయకుండా వారిని ఒప్పించి, కలుపుకుని పనిచేస్తేనే ప్రజా ప్రతినిధుల బలం వందరెట్లు పెరుగుతుందన్నారు. నియోజకవర్గాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సమావేశంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన కోరగా... ప్రతి నియోజకవర్గానికీ రూ.కోటి చొప్పున నిధులు అందించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ప్రభుత్వం సమకూర్చే నిధులతో పాటు ఎంపీ ల్యాడ్స్ నిధులను కూడా సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. తమ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులకు ఎంపీలు నిధులు కేటాయించాలని స్పష్టం చేశారు.

### ప్రతి నియోజకవర్గానికి 25 ప్రాధాన్యతాంశాలు

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవా లని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రాధాన్యతా అంశాలపై లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయని చెప్పారు. ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం లక్ష్యాలతో ముందుకెళ్తోందని తెలిపారు. ప్రజల్లో నిత్యం ఉంటూ, కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సీఎం సూచించారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగేవాడినని, అపాయింట్‌మెంట్ కోసం గంటల తరబడి వేచి చూసేవాడినని గుర్తు చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు వదిలిపెట్టకుండా పనిచేశామని చెప్పారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, నాయకత్వాన్ని బలోపేతం చేసుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నామని వివరించారు. ప్రతి పదేళ్లకోసారి జనరేషన్‌లో మార్పు వస్తుందని, ఆ మార్పులకు అనుగుణంగా నాయకుల పనితీరు కూడా మారాలన్నారు. ఈ తరానికి తగినట్టుగా వ్యవహరించినప్పుడే రాజకీయాల్లో విజయాన్ని సాధించగలమని చెప్పారు. నాయకుల నడవడికను ప్రజలు నిరంతరం గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

### 2029పై ఇప్పటి నుంచే గురి

2029 ఎన్నికల్లో 2024 కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి కోరారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడంపైనే తన ధ్యాస, ఆలోచన ఉందన్నారు. పరిపాలనతో పాటు పార్టీకి కూడా ప్రతిరోజూ సమయం కేటాయిస్తున్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సొంతం చేసుకుని, ఆ తర్వాతి ఎన్నికలకు మరింత బలమైన పునాది వేసుకోవాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల ద్వారా పోటీచేసే అభ్యర్థుల్లో సమర్ధవంతమైన మహిళా నాయకులను గుర్తించాలని చంద్రబాబు సూచించారు. ప్రజలను గెలిపించేలా... కేడర్ తమ కోసం పనిచేసేలా నాయకత్వాన్ని పెంచుకోవాలని నేతలకు స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తామని సీఎం తెలిపారు. ఎమ్మెల్యేలు అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తదుపరి సమావేశాల్లో ప్రదర్శించాలని సూచించారు.

# ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత దగ్గర చేయాలి

## ఆర్టీజీఎస్‌పై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు, వివిధ శాఖల సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. సోమవారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) సేవలు, వివిధ కీలక శాఖల పనితీరుపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా సెర్ప్, దేవదాయ, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, రవాణా, అగ్నిమాపక శాఖల పనితీరు, సేవల్లో నమోదవుతున్న పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుని, దానికనుగుణంగా శాఖల సేవల ప్రమాణాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు నేరుగా ప్రజలకు చేరి, వారిలో పూర్తి సంతృప్తి కలిగినప్పుడే పాలనకు ప్రాధాన్యత దక్కుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం చూపేలా, పాలనలో జవాబుదారీతనం పెంచేలా విధాన రూపకల్పన ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్టీజీఎస్ ద్వారా అందుతున్న డేటాను క్షేత్ర స్థాయి పరిశీలనకు అనుసంధానించాలని సూచించారు. సమావేశంలో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు, ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



చైతన్యరథం













### క్యాడర్ అనుసంధానానికే

# లీడర్ షిప్ కాంక్లేవ్

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో దిశానిర్దేశం

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండురోజుల పాటు జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని పలు సూచనలు చేశారు.



నాయకులకు, కార్యకర్తలను మరింత అనుసంధానం చేసేందుకు ఈ లీడర్ షిప్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ కాంక్లేవ్ జరుగుతుందని వెల్లడించారు. మొత్తం 10 సెషన్లలో ఈ శిక్షణ తరగతులు ఉంటాయ ని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికలపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తారని వివరించారు. స్థానిక ఎన్నికలు వెంటనే నిర్వహించాల్సి ఉందని.. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉండదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నా యని వెల్లడించారు. పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కూడా ఈ సమావేశా లకు పిలిచామని.. వారు కూడా ఈ కాంక్లేవ్‌లో పాల్గొం టారని పేర్కొన్నారు. లీడర్‌షిప్ కాంక్లేవ్‌పై అసెంబ్లీ వ్యవహారాలపై ఎమ్మె ల్యేలకు అవగాహన కల్పిస్తారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేస్తారు.

## కార్యకర్తలకు అండగా ఉండాలి

- ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి
- నాడు కష్టకాలంలో లోకేష్ నూతనోత్సాహాన్ని నింపారు
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- నాయకత్వ అభివృద్ధి, స్థిరమైన స్థానంపై ప్రసంగం

మంగళగిరి(చైతన్యరథం): ప్రతి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి, ప్రతి నాయకుడు కార్యకర్తలకు సమయం కేటాయించాలి.. ప్రతి కార్యకర్తను ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనేలా భాగస్వా ములను చేయా



లని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో నాయకత్వ అభివృద్ధి, తీర్చిదిద్దడం, స్థిర మైన స్థానం కల్పించడం అంశంపై దిశానిర్దేశం చేశారు. దాదాపు 8,500 మందికి పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిం చాం.. వారితో కలిసి సమన్వ యంతో పనిచేయాలి.. నియోజకవర్గంలో పనిచేసే ప్రతి ఎమ్మెల్యే ఆరు రకాల వ్యక్తులతో పనిచేయాలి..ప్రజలతో వినయంగా వ్యవహరించాలి.. మేం ఎన్నుకున్న ప్రభు త్వం ప్రజలకు ఇంత అభివృద్ధి చేస్తుందనే భావన వారిలో కల్పించాలని సూచించారు. నా ఎమ్మెల్యే ఉండటం వల్లే నాకు ఈ గౌరవం దక్కిందనే విధంగా కార్యకర్తలకు అండగా ఉండాలని పేర్కొన్నారు.అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు నిర్వహించుకోవాలని సూచించారు.

**ఆధారాలతో మాట్లాడితే మరింత కనెక్ట్ అవుతారు**

1999లో చంద్రబాబు సీఎంగా ఉండి కూడా కేంద్రంలో ఉన్న అధి కారులతో నిరంతరం గౌరవిస్తూ, మాట్లాడుతూ సమయం కేటాయించే వారు. ఆయన కృషి ఫలితంగానే మన రాష్ట్రానికి అప్పట్లో అత్యధిక గ్యాస్ కనెక్షన్లు వచ్చాయి. ప్రజాప్రతినిధులు మీడియా సమావేశాల్లో బూతులు, విమర్శలతో కాకుండా సరైన ఆధారాలు, వాస్తవాలతో మాట్లాడితే ప్రజలకు మరింత కనెక్ట్ అవుతారు. హుద్ హుద్, విజయ వాడ వరదల సమయంలో సీఎం చంద్రబాబు చూపిన చొరవే మనకు ఆదర్శం. 2004 వైఎస్ఆర్ అధికారంలోకి వచ్చాక అనంతపురంలో 56 మంది టీడీపీ కార్యకర్తలను,నాయకులను, పరిటాల రవితో సహా హత్య చేశారు. ఆనాడు తొమ్మిదేళ్ల సీఎంగా పనిచేసిన వ్యక్తి ఒక ఎస్పీ ఇంటి ముందు ధర్నా చేశారు.కార్యకర్తల కోసం రోడ్డుపైకి వచ్చి ముందు నిల బడ్డారు. ప్రతి రెండు, మూడురోజులకు ఒకసారి అనంతపురం జిల్లా నాయకులతో మాట్లాడుతూ వారిలో ఆత్మస్థైర్యాన్నినింపారు. పార్టీకష్టంలో ఉన్న సమయంలో మంత్రి లోకేష్ యువగళం ద్వారా పార్టీకి నూతనో త్సాహాన్ని నింపారు. కార్యకర్తలకు అండగా నిలిచారు. 90వేల ఓట్లతో మంగళగిరిలో అఖండ విజయం సాధించారు. మన నియోజకవర్గాల్లో కూడా మన కార్యకర్తలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

# ప్రజలకు సేవ చేసేందుకే అధికారం

- వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యం
- టీడీపీకి కార్యకర్తలే బలమని గుర్తించుకోవాలి
- ప్రజాసేవకు దానిని వినియోగించుకోవాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రి అచ్చెన్నాయుడు

మంగళగిరి(చైతన్యరథం): దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ గ్రామస్థాయి నుంచి అత్యంత బలమైన క్యాడర్, కార్యకర్తలు, నాయకత్వ వ్యవస్థ కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొ న్నారు. ఇంత బలమైన కార్యకర్తల వ్యవస్థ కలిగిన తెలుగు దేశం పార్టీలో పనిచేసే అవకాశం లభించడం ప్రతిఒక్కరి అదృష్టమని పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాల యంలో సోమవారం తెలుగుదేశం లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. రాజకీ యాల్లో లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.



భగవంతుడు ప్రతిఒక్కరికీ జీవితంలో ఏదో ఒక రంగంలో అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ఐదు కోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో కేవలం 175 మందికి మాత్రమే ఎమ్మెల్యేలుగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని, అలాంటి అరుదైన అవకాశాన్ని పొందిన ప్రతిఒక్కరూ దాని విలువను గుర్తించాలని సూచించారు. ఈ అవకాశం శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుని దాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలి. అలా పనిచేస్తే తప్పకుండా విజయాన్ని సాధించగలమని తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, ప్రజలతో ఎమ్మెల్యేలు నిరంతరం మమేకమై ఉండాలని సూచించారు. ప్రతి సమస్యను పరిష్కరించగలగడం సాధ్యం కాకపోయినా కనీసం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా నిలవాలని తెలిపారు. ప్రజలకు ఏమీ చేయలేక పోయినా పర్వాలేదు.. కానీ వారిని ఇబ్బంది పెట్టడం, వేధించడం మాత్రం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నాయకులకు రాజకీయంగా భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ప్రజలే రాజకీయ నాయకులకు అధికారం ఇస్తారని, అదే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే ఎలాంటి పదవిలో ఉన్నా తిరిగి గెలవడం కష్టమవుతుందని వ్యాఖ్యానించారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని సూచించారు. టీడీపీకి గ్రామస్థాయి నుంచి బలమైన కార్యకర్తల బలం ఉందని, ఆ బలాన్ని ప్రజాసేవకు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. పదవులు ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన అవకాశాలే తప్ప.. అధికారాన్ని చెలాయించ డానికి కాదనే విషయాన్ని ప్రతి ప్రజాప్రతినిధి గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, కార్యకర్తలను గౌరవించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడమే నాయకత్వా నికి అసలైన కొలమానమని పేర్కొన్నారు.

### చంద్రబాబు తెలుగుదేశం ఆస్తి కాదు..

# తెలుగుజాతి ఆస్తి

- దూరదృష్టితో రూపొందించిన పాలసీలు దేశానికి ఆదర్శం
- వాట్ చంద్రబాబు థింక్స్ టుడే... నేషన్ థింక్స్ టుమారో
- పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల గోదావరి జలాలతో 200 సార్లు ప్రకాశం బ్యారేజీని నింపిన వాటర్‌మ్యాన్
- నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అంటూ జాతీయ స్థాయిలోనే ప్రశంసలు దక్కాయి
- విజన్ 2020ని అవహేళన చేశారు... నేడు అదే దిక్సూచి
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- స్వర్ణాంధ్ర విజన్‌పై ప్రజెంటేషన్‌లో అధినేతకు అభినందనలు

మంగళగిరి(చైతన్యరథం): చంద్రబాబు తెలుగుదేశం ఆస్తి కాదు... తెలుగు జాతి ఆస్తి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని చంద్రబాబు ముందు..తర్వాత అని విశ్లేషించుకోవాలి అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండురోజుల పాటు జరిగే లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో తొలిరోజు ఆయన క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటేషన్‌పై ప్రజంటేషన్ ఇస్తూ అధినేత దూరదృష్టి, పాలసీలతో రాష్ట్రానికి, దేశానికి కలుగుతున్న ప్రయోజనాలపై వివరిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు. సీఎం చంద్రబాబు ఉమ్మడి ఏపీకి



రూపొందించిన విజన్-2020 డాక్యుమెంటే దేశంలో తొలి విజన్ డాక్యుమెంట్. నాడు విజన్-2020 డాక్యుమెంట్ రూపకల్పన తర్వాతే అనేక రాష్ట్రాలు కూడా విజన్ డాక్యుమెంట్లు తయారు చేసుకున్నాయి. విజన్ 2020ని అవహే ళన చేశారు... కానీ అదే దిక్సూచిగా మారింది. వాట్ సీబీఎన్ థింక్స్ టుడే...నేషన్ థింక్స్ టుమారో అనేది అక్షర సత్యమని వివరించారు.

**నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేసిన ఏకైక రాష్ట్రం**

ప్రస్తుతం విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేసిన ఏకైక రాష్ట్రం ఏపీనే. హైటెక్ సిటీ ఏర్పాటు చేయ డానికి ముందుగానే పదుల సంఖ్యలో ఉన్న ఇంజ నీర్ కాలేజీలను వందల సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల నుంచి యువత బయటకు రాగానే ఐటీ ఉద్యోగాలు వాళ్ల కోసం ఎదురు చూశాయి. నాటి ఉమ్మడి ఏపీలో ఐటీ అభివృద్ధికి అనేక పెద్ద పెద్ద ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు వచ్చేలా చేశారు. ఓ ప్రణాళిక ను వాస్తవంలోకి తీసుకువచ్చి ఫలితాలు సాధించేలా సీఎం వివిధ పాలసీలు రూపొందించారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారు ఐటీ నిపుణులుగా గరిష్ఠంగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని వివరించారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారు**

2024లో విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెట్టి ఇప్పుడు వికాసం వైపు నడిపిస్తున్నారు. గతంలో రాష్ట్రంలోనే నీటి కోసం కొట్లాడు కునే పరిస్థితి.. ప్రాంతాల మధ్య యుద్ధాలు జరిగిన దుస్థితి. ఇప్పుడు పరిస్థితి మారింది... పోలవరం, వెలిగొండ, ప్రాజెక్టులు వరుసగా పూర్తి అవుతున్నాయి. పట్టిసీమ నుంచి 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు నీరందించిన వాటర్ మాన్ సీఎం చంద్ర బాబు. 200 వందల సార్లు ప్రకాశం బ్యారేజీని నింపి డెల్టా ప్రాంతంలో పంటలు పండించిన విజనరీ సీబీఎన్. నియోజక వర్గాల వారీ విజన్ ప్లాన్లు రూపొందించిన ఏపీకి, సీఎం చంద్రబా బుకు జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కాయి. పీపీపీ పద్ధతిలో నిర్మించిన జేగురుపాడు విద్యుత్ కేంద్రం... ఇప్పుడు ప్రభుత్వ ఆస్తి అయింది..విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావాలనే దిశగా నేతలంతా పనిచేయాలి. పీజీఆర్ఎస్ వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకెళ్లాలి. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ఆవిష్కరణను ముందుకు తీసుకువస్తే సమష్టిగా విజయం సాధించ గలం. ఏ యూనివర్సిటీలు చెప్పని పాఠాలు, విజ్ఞానాన్ని సీబీఎన్ అందిస్తున్నారని అభినందనలు తెలిపారు.

చైతన్యరథం

# ఐటీ వెలుగుల నుంచి.. జలసిరుల వరకు!

- 'సీఈఓ సీఎం' టూ 'వాటర్‌మ్యాన్' చంద్రబాబు.. చెరగని ముద్ర
- తొలి నుంచీ నీటిపొదుపు, ప్రతి బొట్టునూ ఒడిసిపట్టడంపైనే దృష్టి
- భూగర్భాన్నే జలాశయంగా మార్చే సంకల్పం
- డ్రిప్ ఇరిగేషన్‌కు ఆద్యుడు
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ప్రత్యేక శ్రద్ధ
- ఆయన కృషితో రాయలసీమ పొలాలకు కృష్ణాజలాలు
- పట్టిసీమతో కృష్ణా డెల్టాకు గోదావరి నీరు
- నదుల అనుసంధానానికి నాంది
- ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకూ ప్రాధాన్యత
- వాటర్‌మ్యాన్‌గా సీఎం చంద్రబాబును ప్రశంసిస్తూ జాతీయ మీడియా కథనం
- టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్‌లో అభినందన తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి నిమ్మల
- స్టాండింగ్ ఓవేషన్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు అభినందనలు




అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అవసరాలకు అనుగుణంగా తనను తాను మార్చుకునే గొప్ప దార్శనిక నేత చంద్రబాబు నాయుడు అని జాతీయ మీడియా సైతం గుర్తించడం మన అందరితోపాటు, రాష్ట్ర ప్రజలకు కూడా గర్వకారణమని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నాటి అవసరాలకు అనుగుణంగా సీఈఓ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చారని, ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ కు జల వనరులను అభివృద్ధి చేస్తూ వాటర్ మ్యాన్‌గా మారిన వైనాన్ని జాతీయ మీడియా ప్రస్తావించి ప్రశంసించడం గొప్ప విషయమని రామానాయుడు అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మొదలైన టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్షిప్ కాంక్లేవ్‌లో ఎకనామిక్ టైమ్స్ పత్రిక రాసిన సీఈఓ సీఎం టూ వాటర్ మాన్ ఆర్టికల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందన తీర్మానాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ విప్లవాన్ని యువతకు అందించి తెలుగు వారికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చిన సీఎం చంద్రబాబు ఆ తర్వాత సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తూ వాటర్ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్నారని తీర్మానంలో మంత్రి పేర్కొన్నారు. 3 దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు కలను సాకారం చేయటంలో సీఎం చేసిన కృషిని ఎకనామిక్ టైమ్స్ ప్రస్తుతించింది. ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చేలా పోలవరం ఎడమ కాలువను ఎడాదిన్నర కాలంలోనే పూర్తి చేసి గోదావరి జలాలను అనకాపల్లి వరకూ తీసుకెళ్లటంలో చేసిన కృషిని ప్రస్తావించింది. 2027 పుష్కరాలకంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తారన్న లక్ష్యాన్ని కూడా కథనంలో పేర్కొందన్నారు.

## ఏపీకి ఏమి కావాలో చంద్రబాబుకు బాగా తెలుసు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవసరాలు, బాగోగులు చంద్రబాబుకు మాత్రమే తెలుసు.. రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆయనకున్న అవగాహన మరెవ్వరికీ లేదు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన రామానాయుడు, రాష్ట్రంలో జల వనరుల అభివృద్ధికి చంద్రబాబు చేసిన కృషిని సమగ్రంగా వివరించారు. భారతదేశంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అగ్ర భాగంలో నిలపాలని నిరంతరం కలలు గంటున్న గొప్పస్వాప్నికుడు మన ముఖ్యమంత్రి అని కొనియాడారు. చంద్రబాబు నాయుడు జల వనరుల శాఖలో సాధించిన ప్రగతిని, స్థాపించిన మైలురాళ్లను.. దృష్టిలో ఉంచుకొని ఆయనను వాటర్ మ్యాన్ గా కీర్తించడం.. మనకు ఎంతో గర్వకారణం అన్నారు. తోటి తెలుగు రాష్ట్రమైన తెలంగాణ ఆదాయంలో 62శాతం హైదరాబాద్‌దే అంటే ఆ క్రెడిట్ మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అలాగే ఈనాడు నవ్యాంధ్ర.. అభివృద్ధికి.. నడుం కట్టిన మహానీయుడుఅని అన్నారు..

## డ్రిప్ ఇరిగేషన్‌కు ఆద్యుడు

విభజిత ఆంధ్రప్రదేశ్ పునః నిర్మాణంలో భాగంగా చంద్రబాబు వాటర్ మ్యాన్‌గా మారటం అక్షర సత్యం అన్నారు. ఆయన ముఖ్యమంత్రి కాక ముందే 90వ దశంలో వ్యవసాయ ప్రాధాన్యాన్ని, నీటి పొదుపు ఆవశ్యకతను గుర్తించి కుప్పం నియోజకవర్గంలో డ్రిప్ ఇరిగేషన్ ప్రయోగాత్మ కంగా ప్రవేశ పెట్టారు.. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించారు.. ఇజ్రాయిల్ తరహా వ్యవసాయ విధానంతో 30 నుంచి 50శాతం అధికంగా పంట దిగుబడి సాధించి తన ప్రత్యేకత ను చాటారని గుర్తు చేశారు. కాల క్రమంలో రాష్ట్రంలోని మెట్ట ప్రాంత భూములన్నిటికీ డ్రిప్ ఇరిగేషన్ ని అలవాటు చేసి.. నీటి పొదుపు ఆవశ్యకతను తెలియజెప్పారన్నారు.

## బీడు భూములకు జలసిరులు

1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలను, వెనుకబాటుతనాన్ని గుర్తించారు. గోదావరి కృష్ణా డెల్టాల పరివాహక ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా ముందుండటానికి, రాయలసీమ, ఉత్తరాంధ్రాలు వెనుకబాటుతనానికి కేవలం నీటి వనరులు లేకపోవడమేనని ఆయన గుర్తించారని మంత్రి కీర్తించారు. అందులో భాగంగానే.. పనికిరాని పర్రలుగా ఉన్న మెట్ట భూములు.. సిరులు పండాలంటే భూగర్భ జలాలు వెలికితీత ఒకటే మార్గమని యోచించి బోరు బావులకు సబ్సిడీ కరెంట్ ఇవ్వటం ప్రారంభించారని చెప్పారు. తరువాత కాలంలో దానిని ఉచితం చేశారన్నారు. దీంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.. మెట్ట ప్రాంతాల్లో కూడా సిరులు పండించటం ప్రారంభించారని అని చెప్పారు. ఆనాడే.. చంద్రన్న.. భూగర్భ జలాలు.. వెలికి తీసి అపర భగీరథుడయ్యారన్నారు. అలాగే 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి అయిన తరువాత.. వ్యవసాయానికి ప్రాణాధారమైన.. జల వనరులపై దృష్టి పెట్టారన్నారు. ప్రఖ్యాత ఇంజనీర్ కె.ఎల్.రావు ప్రతిపాదించిన నదుల అనుసంధానం పై దృష్టి పెట్టిన భారతదేశంలోని ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రతి నీటి బొట్టును.. ఒడిసి పట్టాలి.. నిల్వ చేయాలి.. అధికంగా ఉన్న చోట నుంచి అవసరం ఉన్న చోటకి జలాన్ని తరలించాలి. తద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలి.. సిరులు పండించాలి.. సంపద సృష్టించాలి.. కరవురహిత రాష్ట్రంగా మార్చాలి. ఇదే నా జీవితాశయం.. అంటూ బహిరంగంగా ప్రకటించిన ఏకైక నేత చంద్రబాబు అని రామానాయుడు ప్రశంసించారు. ఈ రకంగా.. ఆనాడే ఆయన.. వాటర్ మ్యాన్ గా రూపాంతరం చెందారన్నారు.

## మొత్తం సాగుభూములకు నీరివ్వటమే లక్ష్యం

ఆంధ్రుల మదిలో అపర భగీరథుడిగా, ప్రత్యేకించి రాయలసీమలో.. కృష్ణదేవరాయలను గుర్తుకు తెచ్చారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగు కోట్ల ఎకరాల భూమి ఉంది. అందులో సాగుకు పనికి వచ్చేది రెండు కోట్ల ఎకరాలు మాత్రమే. ఈ రెండు కోట్ల ఎకరాలలో.. ప్రస్తుతం సాగయ్యేది. ఒక కోటి లక్ష ఎకరాలు మాత్రమే. మిగిలిన 99 లక్షల ఎకరాలకు కూడా.. అందుబాటులో ఉన్న అన్ని జలవనరులను ఉపయోగించి నీరు ఇవ్వాలనేదే.. చంద్రన్న ఆశయంగా రామానాయుడు మరోసారి స్పష్టం చేశారు. ఈ ఆశయంలో భాగంగానే 2014 –19 మధ్యకాలంలో రాష్ట్రంలోని అనేక నీటిపారుదల ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి.. అయిన ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తి చేశారు. రాయలసీమలోని పలు ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు వెచ్చించారు. అలాగే ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు కూడా ఒక రూపు తీసుకొచ్చారని చెప్పారు. అన్నింటికంటే మించి.. పోలవరం పూర్తి అయ్యేవరకు.. ఆగకుండా గోదారి వరద జలాలను పట్టిసీమ, పుష్కరా ఎత్తిపోతల ద్వారా అటు తడారిన కృష్ణ డెల్టాకు, ఇటు ఉత్తరాంధ్రకు.. నీరు ఇవ్వాలని.. ఆ రెండు కార్యక్రమాలను.. రికార్డ్ స్థాయి సమయంలో పూర్తి చేసిన ఘనత చంద్రబాబు నాయుడు దే అన్నారు. గోదారిని.. కృష్ణమ్మతో అనుసంధానించి.. దేశంలో మొట్టమొదటిసారిగా.. నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారన్నారు.

## ఐదేళ్లపాటు వైసీపీ గ్రహణం

ఈ దశలో ప్రభుత్వం మారి గొడ్డలి పార్టీ రావడం వల్ల..నీటిపారుదల రంగానికి గ్రహణం పట్టిందన్నారు. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయి.. రివర్స్ పాలన అంటూ.. ప్రాజెక్టుల నిర్మాణాలు శిథిల స్థితికి చేరేటట్టు చేసేశాడని. ఘోరమైన విధ్వంసం జరిగి పోయిందన్నారు. 18వేల కోట్లు అప్పు వారసత్వంగా ఇచ్చి అదోస్థితికి చేర్చాడని విమర్శించారు. ఐదేళ్లపాటు అమూల్యమైన సమయం.. కాలగర్భంలో కలిసిపోయిందన్నారు.

## ప్రాజెక్టుల పూర్తికి టైం షెడ్యూల్

ఈ నేపథ్యంలో 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రన్న నేతృత్వంలోని.. కూటమి ప్రభుత్వం.. మళ్లీ జలసిరిపై దృష్టి పెట్టింది. ఇరిగేషన్ క్యాలెండర్ తయారు చేసింది.. ప్రతి ప్రాజెక్టు పూర్తికి టైం షెడ్యూల్ నిర్ణయించిందన్నారు. రేయింబవళ్లు పనిచేస్తూ.. ముందుగా.. రాయలసీమ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది.. ఈ రెండేళ్లలో రూ.30 వేల కోట్లు ఇరిగేషన్ బడ్జెట్ కేటాయింపులు ఉంటే సగానికి సగం రాయలసీమ ప్రాజెక్టులకు వెచ్చించిందన్నారు . అందులో భాగంగానే హంద్రీనీవా సుజల స్రవంతి.. పూర్తి చేసి 700 కిలోమీటర్లు దూరాన ఉన్న కుప్పం నియోజకవర్గానికి కృష్ణమ్మ జలాలను తరలించారన్నారు . అలాగే మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కలను గత ఆగస్టు 31న సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దక్కించుకున్నారన్నారు. అలాగే ఈనెల 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లి వరకు పంపటం.. ఉత్తరాంధ్ర చరిత్రలో మరో సువర్ణాధ్యాయమన్నారు.

## అన్నింటికంటే మించి..

ఈ రాష్ట్ర దశదిశ మార్చే పోలవరం జాతీయ ప్రాజెక్టు 2027 మార్చికి అంటే వచ్చే ఏడాది పుష్కరాలకు ముందే ప్రారంభించబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించటం.. ఆయన సమర్థ నాయకత్వానికి, సత్తాకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్య క్రమంలో 36 ప్రాజెక్టులను.. ఎంపిక చేసాం.. రానున్న రెండేళ్లలో అంటే 2028 నాటికి పూర్తిచేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇందుకోసం రూ.36,555 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారని ఈ కారణాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని వాటర్ మ్యాన్ అని అనడం సమంజసమేనన్నారు.

## జలాశయంగా భూగర్భం

అలాగే భూగర్భాన్ని జలాశయంగా మార్చే అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాలన్నీ ఫలించి 2014 –19 మధ్యకాలంలో గ్రౌండ్ వాటర్ లెవల్ 2– 2.5 మీటర్లు పెరిగిందన్నారు. నీరు చెట్టు పథకం కింద 38,500 చెరువులు లోతు తవ్వడం, గట్లు పట్టిష్టపరచటం చేయడం ద్వారా చెరువులు జలకళను సంతరించుకున్నా యన్నారు. ఈ ఘనత అంతా ముఖ్యమంత్రి చంద్రన్నదే అని చెప్పారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ లో ప్రారంభించిన జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా 90 వేల పనులు పూర్తి చేశాం.. 80 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచగలిగాం అని రామానాయుడు చెప్పారు. ఇలా అందుబాటులో ఉన్న నీటి వనరులు అన్ని టిని అందిపుచ్చుకుని ప్రతి ఎకరానికి నీరు ఇవ్వాలనే విశ్వ ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యాంధ్రప్రదేశ్ అవసరాలు కను గుణంగా వాటర్ మ్యాన్‌గా అవతారం దాల్చార ని మంత్రిపేర్కొన్నారు. ఈ కారణాలన్నిటి కార ణం గానే ప్రతిష్టాత్మక ఎకనమిక్ టైమ్స్ పత్రిక చంద్రబాబు నాయుడిని వాటర్ మ్యాన్‌గా అభి వర్ణించటం తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు అభినందనలు తెలిపారు.

### ఉత్తమ పనితీరుతోనే
# నాయకత్వానికి బలం

- అహంకారం దగ్గరకు రానివ్వకూడదు
- ప్రజాజీవితంలో జాగ్రత్తగా మసలుకోవాలి
- జెన్‌జీలకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎంపీ రామ్మోహన్‌నాయుడు

మంగళగిరి(చైతన్యరథం): నాయకత్వం బలంగా ఉంటే పార్టీ బలంగా ఉంటుందని, అందుకు మన ముఖ్యమంత్రి చంద్రబాబే నిదర్శనమని కేంద్రమంత్రి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజాజీవితంలో ఉండేవారు వారి ప్రవర్తన విషయంలో చాలా జాగ్రత్త వహించాలని సూచించారు. అభ్యర్థి ప్రవర్తన తీరే ఎన్నికల్లో 68.9 శాతం వరకు ప్రభావితం చేస్తుందని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవ డంలో తెలుగుదేశం ఎప్పుడూ ముందు ఉంటుంది. జెన్‌జీ యువత ఆలోచనలను అర్థం చేసుకునే విధంగా మన కార్యాచరణ ఉండాలి. ఓటర్లు, క్యాడర్‌కు ప్రజాప్రతినిధులు నిరంతరం అందు బాటులో ఉండాలి. సమస్యలను గుర్తించడమే కాదు.. వాటిని వెంటనే పరిష్కరించే నైపుణ్యం సంపాదించుకోవాలి. నాయకులకు ప్రజా సమస్యలను ఓపికగా వినే సహనం ఉండాలి. నాయకుడిగా ఎంత ఎదిగినా అహంకారం దగ్గరకు రానివ్వకూడదని సూచించారు.



### కార్యకర్తే అధినేత సిద్ధాంతంతో
# నెక్స్ట్ జనరేషన్ లీడర్‌షిప్ నిర్మాణం

- రాజకీయ, ఆర్థిక సాధికారతే చంద్రబాబు లక్ష్యం
- లోకేష్ ఆలోచనతో వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ
- నా తెలుగుదేశం-నా బాధ్యతగా ముందుకుసాగాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మంగళగిరి(చైతన్యరథం): పార్టీ అధికారంలో ఉన్నా లేక పోయినా నిరంతరం ప్రజల్లో ఉండే కోటి మందికి పైగా సభ్యు లున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. కార్యకర్తలకు కేవలం గౌరవం ఇస్తే సరిపోదు.. రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించడమే చంద్రబా బు ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుంచి టాప్ లీడర్‌షిప్ వరకు దాదాపు 10 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికే సమర్థవంతమైన శిక్షణ పూర్తి అయింది. సిఫార్సులు లేకుండానే ప్రతిభ ఆధారంగా నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించారు. కార్యకర్త ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ మరింత బలోపేతం అవు తుంది. లోకేష్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అమలు అవుతుంది. తల్లిదండ్రులు కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా నాణ్యమైన ఉన్నత విద్య అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'స్మార్ట్ ఫుల్' యాప్, హెల్త్ రికార్డులతో క్యాడర్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. 2040 నాటికి సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలైతే, టీడీపీ కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలనేది అధినేత చంద్రబాబు లక్ష్యం. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం ఒక కార్డు మాత్రమే కాదు.. అది ఆ కుటుంబానికి పార్టీ ఇస్తున్న బీమా, విద్య, వైద్యం, ఉపాధి భరోసా. సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న నాకు రాజకీయ నేపథ్యం లేకపోయినా పర్చూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు అవకా శం కల్పించిన ఘనత చంద్రబాబుదే. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపోటములు వ్యక్తిగతం కాదు.. అవి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఆత్మగౌరవానికి సంబంధించినవి. నారా లోకేష్ నేతృ త్వంలో "కార్యకర్తే అధినేత" అనే సిద్ధాంతంతో నెక్స్ట్ జనరేషన్ లీడర్‌షిప్ నిర్మాణం జరుగుతోంది. నా దేశం - నా బాధ్యత తరహాలోనే ప్రతిఒక్కరూ "నా తెలుగుదేశం - నా బాధ్యత" అనే నినాదంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.



## కైకలూరు టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ నియామకం

అమరావతి (చైతన్యరథం): ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీని నియమించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కైకలూరు నియోజకవర్గానికి కోఆర్డినేషన్ కమిటీని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరు కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా కొత్త నాగేంద్ర కుమార్‌ను నియమించారు. మండలానికి ఒకరు చొప్పున నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు నలుగురిని కో-కన్వీనర్లుగా నియమించారు. పంది రాధాకృష్ణ (కైకలూరు మండలం), నరగాని వీర వెంకట నాగేశ్వరరావు (మండవల్లి మండలం), వల్లభనేని శ్రీనివాస్ చౌదరి (కలిదిండి మండలం), బొప్పన సుందర రామయ్య (ముదినేపల్లి మండలం) కో-కన్వీనర్లుగా నియమితులయ్యారు.

# ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

- పార్టీ కోసం స్వచ్ఛందంగా పనిచేయాలి
- టీడీపీ కాంక్లేవ్‌లో మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంగళగిరి(చైతన్యరథం): నాయకులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని మంత్రి గొట్టిపాటిరవికుమార్ సూచించారు. ప్రజల సమస్యలు వారిసమస్యలను నాయ కుల దృష్టికి తెచ్చినప్పుడు ఆసమస్య పరిష్కా రమయ్యేలా ఉంటే అవతుందని చెప్పాలి.. లేకుంటే లేదనాలి చెప్పాలి..అంతేకానీ వారి ని తమ చుట్టూ తిప్పుకోకూడదని తెలిపారు. అనేకమంది మనస్తత్వాలు అనేక రకాలుగా ఉంటాయి..వారిలా మనం మారలేము.. మన పద్ధతికి వారు అలవాటు పడేలా చేయాలని తెలిపారు.బ్యాక్ ఆఫీస్‌టీం చాలా స్ట్రాంగ్‌గా ఉండాలి..ప్రతి మండలం నుంచి 20 నుంచి 30 మంది ప్రజల కోసం, పార్టీ కోసం స్వచ్ఛందంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారం దరికీ అందేలా చూడాలి.. ఏ ఒక్కరూ నష్ట పోకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఐదేళ్లకు ప్రజల విధానాలు మారుతుంటాయి.. ఎన్నికలు వచ్చే నాటికి కొత్త జనరేషన్‌కి నాయకులు కూడా మార్పులు, చేర్పులతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.




# టీడీపీ అంటేనే సంక్షేమం

- జగన్ రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లారు
- వాటిని తీర్చుకుంటూ సంక్షేమం అందిస్తున్నాం
- రెండేళ్లలోనే 90 శాతం హామీలు అమలు చేశాం
- సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



మంగళగిరి(చైతన్యరథం): సంక్షేమం అంటే టీడీపీ, టీడీపీ అంటే సంక్షేమమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సోమవా రం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం లో లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఆయన ప్రసం గించారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లారు.. ఓ వైపు ఆ అప్పులు తీర్చుకుంటూ.. మరో వైపు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అంది స్తున్నాం. రెండేళ్లలోనే 90 శాతం హామీలు అమలు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నాం. సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం. పేద విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేశాం. రూ.143 కోట్లతో సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు, రూ.100 కోట్లతో నూతన హాస్టల్ భవనాల నిర్మాణం చేపట్టాం. బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, ఇజ్రాయెల్ భాషల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఆ దేశాలలో వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేశాం.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. వారి కోసం బాపట్లలో ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశాం. డీఎస్సీ ఉచిత శిక్షణతో 300 మందికి పైగా టీచర్ ఉద్యోగాలు వచ్చాయి. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సహాయం, ముస్లిం నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ పోటీ పరీక్షల శిక్షణ వంటివి కల్పిస్తున్నామని వివరించారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు.

# పార్టీ ఉంటేనే మనం

- తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి
- పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్లు పనులు చేసే చంద్రబాబుపైనే విమర్శలు
- గత ప్రభుత్వం మనకు అప్పులు వదిలివెళ్లింది
- కూటమి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- టీడీపీ జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసింది
- ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలు అమలు చేశాం
- తరాలకు అనుగుణంగా పార్టీ విధానాలు మారాలి
- ఏ కార్యకర్త పిలిచినా కార్యక్రమాలకు వెళ్లాలి
- వ్యతిరేక ఓటుతో కాదు పాజిటివ్ ఓటుతో నెగ్గాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి
- పార్టీ సంస్థాగత నిర్మాణం అంశంపై ప్రసంగం




మంగళగిరి(చైతన్యరథం): జాతీయ రాజకీయాలను ప్రభావి తం చేసే పార్టీ మన తెలుగుదేశం..ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు దేశం ప్రభుత్వం అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణం అంశంపై కీలక ప్రసంగం చేశారు. సీఎం చంద్రబాబు హైదరాబాద్, ఉమ్మడి రాష్ట్రాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమ లు చేశారు. దేశంలో ఏ పార్టీకి లేనంతగా కోటిమంది కార్యకర్తల పార్టీ సభ్యత్వం మన పార్టీకి ఉంది. 1982లో టీడీపీ పెట్టినప్పటి నుంచి నేటి వరకు తరం తరం మారుతూ వస్తోంది. తరాలకు అనుగు ణంగా మనం, మన పార్టీ విధానాలు మారాలి. ప్రతి నియోజక వర్గంలో 500 మంది క్రియాశీలకంగా పనిచేసే కార్యకర్తలను మనం తయారు చేసుకుంటే ప్రతి ఎన్నికల్లో విజయం మనదే. ప్రతి బూత్‌కు ఇద్దరు కష్టపడి పనిచేసినా చాలు విజయం మనదే అవుతుంది. సబ్జెక్టు టాలెంట్ ఉన్న వారికే అధిక ప్రాధాన్యత ఇవ్వండి. కులాల పరంగా రాజకీయాలు చేయకుండా అన్ని వర్గా ల ప్రజలతో మమేకమై ఉండాలి. పార్టీ కార్యకర్తల ద్వారానే సీఎం ఆర్‌ఎఫ్ నిధులకు సంబంధించిన చెక్కులు అందజేసేలా చూడం డి. పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వండి. పండ్లు ఉన్న చెట్టుకే రాళ్లు పడతాయన్నట్టు పనులు చేస్తున్న చంద్రబాబుపైనే ఎక్కువగా విమర్శలు వస్తుంటాయి. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి. గత ప్రభుత్వం మనకు అప్పులు తప్ప ఏం ఇవ్వలేదు. సీఎం చంద్రబా బు పాలనలో అభివృద్ధి, సంక్షేమం సక్రమంగా అమలు చేస్తు న్నాం. అన్ని వర్గాలను ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకోవా లి. గ్రామాల్లోకి వెళ్లి వాళ్ల వాళ్ల సమస్యలను పరిష్కరించాలి. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనంతగా సీఎంఆర్‌ఎఫ్ అమలు చేశాం. చిన్నచిన్న గ్రౌండ్ లెవల్ సమస్యలను పెద్దవి కాకుండా ముందు గానే పరిష్కరించుకోవాలి. పీ4లో జవాబుదారి తనాన్ని తీసుకోవాలి. మనం వ్యతిరేక ఓటుతో కాదు...పాజిటివ్ ఓటుతోనే గెలవాలి. నియోజకవర్గంలో ఏ చిన్న కార్యక్రమం అయినా కార్యకర్తల కోసం వెళ్లాలి. పార్టీ ఉంటేనే మనం ఉంటామనేది గుర్తుంచుకోవాలని సూచించారు.

చైతన్యరథం

# లోకేష్‌పై భయంతోనే డీఎస్సీపై జగన్ అసత్య ప్రచారం

- టీచర్లపై సాక్షి మీడియా దౌర్జన్యం దారుణం
- బాధ్యులపై కేసులు నమోదు చేయాలి
- అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ
- ఎమ్మెల్యే కూన రవికుమార్



అమరావతి (చైతన్యరథం): యువనేత నారా లోకేష్‌ను చూస్తే జగన్మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని అందుకే అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీపై సాక్షి మీడియాలో పదే పదే అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. తరగతి గదుల్లో విద్యార్థుల ముందే టీచర్లను బెదిరించి కించపరిచేలా వ్యవహరిస్తున్న సాక్షి మీడియాపై తక్షణమే కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని కోరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం ఇవ్వని జగన్.. నేడు డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారిని అవమానించడం దారుణమని విరుచుకుపడ్డారు.

## ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా నేడు విష ప్రచారం

జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 16000కు పైగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం. మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు 345 కేసులు వేసినప్పటికీ సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే రికార్డు సమయంలో 148 రోజుల్లోనే ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేశాం. జగన్మోహన్‌రెడ్డి భయంకరమైన ఫోబియాతో బాధపడుతున్నారు. యువ నాయకుడు నారా లోకేష్ నీడ చూసి కూడా భయపడే పరిస్థితి ఉంది. ఒక అబద్ధాన్ని వెయ్యి సార్లు చెప్పి నిజం అని భ్రమింపజేసేందుకు సాక్షి మీడియా ప్రయత్నిస్తోంది. నిరుద్యోగులు అహర్నిశలు కష్టపడి వాళ్ల ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే వారిని అవమానిస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి మీడియా ముందుకు వస్తే రాష్ట్ర ప్రజలకు ఫన్నీ టైమ్. ఏపీపీఎస్సీకి, డీఎస్సీ కి తేడా తెలియని ఏకైన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మాత్రమే. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారు. ఆఖరి సంవత్సరంలో 6,100 డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తానని భ్రమలు కల్పించారు. ఆ నోటిఫికేషన్ లోనే రెండు సంవత్సరాల పాటు అప్రెంటీస్‌గా పరిగణిస్తామని చెప్పిదగా చేశారు. జగన్ ఇచ్చిన నోటిఫికేషన్ ఎంత దగా అంటే 2009 తర్వాత ఆర్టీఈ చట్టం ప్రకారం. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానం అనేది తీసేశారు. అయనప్పటికీ కుట్రప ప్రకారం జగన్ రెడ్డి కావాలనే తప్పుల తడకగా నోటిఫికేషన్ ఇచ్చారని ఎమ్మెలే రవికుమార్ విమర్శించారు.

2023 సంవత్సరంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కదా హారిజంటల్ రిజర్వేషన్ తీసుకొచ్చారు. ఆ జీవోని ప్రస్తుతం మేము అమలు చేసి మెగా డీఎస్సీని నిర్వహించాం. ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని వ్యక్తి ఇవాళ సీబీఐ పేరుతో డ్రామాలు ఆడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకాన్ని పెట్టారు. ఆ డీఎస్సీని నిజం చేయడానికి అహర్నిశలు కష్టపడిన వ్యక్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్. ఈ రోజు కష్టపడి యువత ఉద్యోగాలు సాధిస్తే సాక్షి ఫేక్ ఛానల్‌తో అసత్య ప్రచారాలు చేస్తున్నారు.

స్పోర్ట్స్ కోటాలో ఇచ్చిన ఉద్యోగాలన్నీ 2024 సంవత్సరానికి ముందు ఇంటర్నేషనల్ అండ్ నేషనల్ గేమ్స్‌లో ఆడిన వారే. నేషనల్ గేమ్స్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నడుస్తాయి. అలాగే కేంద్రంలో ఉన్నటువంటి స్పోర్ట్స్ మినిస్ట్రీ నుంచి కూడా అధికారులు హాజరవుతారు. వాళ్ల ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ ఈవెంట్స్ జరుగుతాయి. అలాగే ఇంటర్నేషనల్ ఈవెంట్స్ నేషనల్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అధికారులు కూడా ఇంటర్నేషనల్ గేమ్స్ కి పర్యవేక్షకులుగా వెళతారు.

డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన వారు ఎక్కువ మంది 2024 ముందు పతకాలు సాధించిన వారే. ఆ నియామకాలు ఫేక్ అయితే నాటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి కూడా ఫేక్ అవుతాడు. అసత్యాలు ప్రచారం చేసే అధికారం సాక్షి మీడియాకు లేదు. ప్రతిభతో వాళ్ళు ఉద్యోగాలు సాధిస్తే... వాళ్ళు బోధిస్తున్న స్కూళ్లకు వెళ్లి, క్లాస్ రూమ్‌లకు వెళ్లి వాళ్లను బెదిరించి, చిన్న పిల్లల ముందు వాళ్లని చిన్నబుచ్చే విధంగా ఇంటర్వ్యూలు చేస్తున్నారు. సాక్షి పేపరు పైనా, సాక్షి ఛానల్ పైనా, ఉపాధ్యాయులను చిన్నబుచ్చే విధంగా ఇంటర్వ్యూలు చేసి రౌడీయిజాన్ని ప్రదర్శించిన వాళ్లపై కేసులు పెట్టాలని డీజీపీని రవికుమార్ కోరారు.

జగన్మోహన్ రెడ్డిలా నేను ఫేక్ కాదు. 10వ తరగతి పేపర్లు అమ్ముకున్న వాణ్ణి కాదు. జగన్ కుటుంబ సభ్యులలాగా 2006లో డీఎస్సీ జరిపి, కడప జిల్లాలో ఆ రోజు పేపర్లు మార్చి, లక్షలాది రూపాయలు దండుకునే బ్యాచ్ మాది కాదు. అధికారులను బలి పశువులు చేసే వ్యక్తులం మేము కాదు. గ్రూప్-1ని అపహాస్యం చేసి, రిక్షా వాళ్లు, ఆటో డ్రైవర్లతో, స్వీపర్లతో పరీక్ష పేపర్లు దిద్దించిన ఫేక్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని రవికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# ప్రజాసమస్యలపైనే దృష్టి ఉండాలి

- జనరేషన్స్‌తోపాటు మనమూ మారాలి
- అప్పుడే మనతో జెన్‌జీలు కలిసివస్తారు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో కిమిడి కళావెంకట్రావు



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లోఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావ్ తన అనుభవాలను పంచుకున్నారు. కాలం మారేకొద్దీ జనరేషన్స్ మారుతుంటాయి. జనరేషన్‌తోపాటు మనం కూడా మారాలి.. అప్పుడే జెన్‌జీలు కూడా మనతో కలిసి వస్తుంటారు. నేను 1983,85,89లో గెలిచాను. గెలిచిన తర్వాత అనేక పదవులు నన్ను వరించాయి. హోంమంత్రిగా కూడా పని చేశాను. 1989లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మండల కేంద్రంలో సమస్యలపై తహసీల్దార్ వద్దకు వెళితే అదేంటండి మీరు హోం మంత్రిగా చేశారు.. అందరితో కలివిడిగా ఉంటారు అక్కడకు వెళ్లడమేంటని కొందరు అడిగారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలపైనే దృష్టి ఉండాలి. ఇప్పుడు కూడా అదేవిధంగా వెళతా ను. పార్టీ ఫస్ట్. అంతకన్నా ముఖ్యం నాయకత్వం. నాయకుడు ఏది చెబితే అది ఫైనల్. నాయకుడు ఏది చెబితే అది చేయడం మన బాధ్యత అని తెలిపారు.

# అభివృద్ధితోనే గెలుస్తామంటే సరికాదు



- ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించుకోవాలి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం టీడీపీ కాంక్లేవ్‌లో గంటా శ్రీనివాసరావు తన అనుభ వాలను ఇలా పంచుకున్నారు. మొన్న అసెంబ్లీలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎలక్షన్‌లో కంటిన్యూగా గెలవడానికి ఏమైనా ఫార్ములా ఉంటే చెప్పు అని అడిగారు. డెవలప్‌మెంట్ ఒక్కటే చేస్తే గెలుస్తా మనుకుంటే 1999-2004లో దబెస్ట్‌గా డెవలప్‌మెంట్ చేశాం. అయినా 2004 ఎన్నికల్లో ఓడిపోయాం. ఎక్కడ హైటెక్ సిటీ కట్టామో.. అక్కడే ఓడిపోయాం. అలాగే 2014-2019 వరకు కూడా చాలా మంచి డెవలప్‌మెంట్ ఇచ్చినప్పటికీ ఓడిపోయాం. డబ్బుల ప్రభావమనుకుంటే ఇటీవల తమిళనాడులో (టీవీకే) విజయ్ గవర్నమెంట్ వచ్చింది. ఆ రెండు పార్టీలతో పోల్చుకుంటే డీఎంకే అధిక మోతాదులో డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ ఆ పార్టీ ఓడిపోయింది. అంతిమంగా నియోజకవర్గం మారి గెలుస్తున్నావని చాలామంది అన్నారు. నియోజకవర్గం మారి చాలా మంది ఓడి పోయిన వారూ ఉన్నారు. నేను రెండవసారి భీమిలిలో పోటీ చేసి గెలిచాను. నమ్మకాన్ని పెంపొందించుకుంటూ ప్రజలకు భరోసాని స్తే తప్పకుండా విజయం సాధిస్తాం.

# నా నియోజకవర్గం-నా బాధ్యతగా పనిచేయాలి

- పీ4-స్వర్ణాంధ్ర విజన్‌లో భాగస్వాములను చేయాలి
- యువతకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు అందించాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): పీ4 కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాల సాధనకు ప్రజలను భాగస్వాములను చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు.చిన్నవారి నుంచి యువత వరకు భాగస్వాములను చేస్తే విజన్-2047 లక్ష్యాలు సాధించగలమని తెలిపారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పీ4-స్వర్ణాంధ్ర విజన్ 2047పై ప్రజంటేషన్ ఇచ్చారు. 2047 నాటికి ప్రతి గ్రామం, పల్లె, మండలం, జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు పీ4 విధానాన్ని తీసుకొచ్చారు. పీ4 ద్వారా యువతను సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే తన గ్రామాన్ని మోడల్ గ్రామంగా, మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దాలి. 'నా నియోజ కవర్గం-నా విజన్, నా యాక్షన్ ప్లాన్-నా బాధ్యత' అనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, పరిశ్రమ లు, వ్యవసాయం, మౌలికవసతుల్లో నియోజకవర్గాలను అభివృద్ధిచేయాలి. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రతినెల అభివృద్ధి ప్రగతిని విడుదల చేస్తూ ప్రజలకు జవాబు దారీతనంతో పనిచేయాలి. ప్రజల అర్జీలు స్వీకరించడం మాత్రమేకాదు..దిశా నిర్దేశం చేస్తూ శాఖలను సమన్వయంచేసి సమస్యలకు పరిష్కారంచూపాలని సూచించారు.

## ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అభివృద్ధికి కొలమానం

2029నాటికి జీడీపీ రూ.66వేల కోట్ల లక్ష్యంతో రాష్ట్ర అభివృద్ధికి కార్యాచరణ రూపొందించుకోవాలి. రైతుల పంటలను కేవలం ముడి ఉత్పత్తులుగా విక్రయించకుండా.. ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ ద్వారా విలువ జోడించి రైతుల ఆదాయం పెంచాలి. సమావేశాల సంఖ్య కాదు.. ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అస లైన అభివృద్ధి కొలమానం. డేటా, నిరంతర సమీక్షల ఆధారంగా నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచిం చారు. పీ4లో భాగంగా విద్యార్థులు, యువతకు శిక్షణ, ఇంటర్న్ షిప్‌లు అందించాలని ప్రతిపాదించారు. బీఎస్సీ, బీటెక్, ఈసీఈ, ట్రిపుల్‌ఈ విద్యార్థులకు అదనపు సాంకేతిక శిక్షణతో ఉపాధి అవ కాశాలు పెంచాలని సూచించారు. కంపెనీల భాగస్వామ్యంతో శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, స్టైపెండ్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సంజీవని ఆరోగ్య ప్రాజెక్ట్ ద్వారా ఆరోగ్య పరీక్షలు, డిజిటల్ ఆరోగ్య పర్యవేక్షణపై వివరాలు నమోదు చేయాలని సూచించారు. సుమారు 85 లక్షల మంది ఆరోగ్య ప్రమాదం ఉన్న వ్యక్తులను గుర్తించి నిరంతర పర్యవేక్షించాలని తెలిపారు. పీ4-విజన్ 2047తో ప్రజల భాగ స్వామ్యం, కేపీఐలతో అభివృద్ధి పర్యవేక్షణ, యువతకు అవకా శాలు, మెరుగైన ఆరోగ్య సేవలే లక్ష్యమని వెల్లడించారు.

# మెగా డీఎస్సీపై గొడ్డలిపార్టీ దుష్ప్రచారం

- విజేతలను అవమానించేలా జగన్ నిందలు
- మంత్రి మండిపల్లి మండిపాటు



అమరావతి (చైతన్యరథం): ఏళ్ల తరబడి కఠోర దీక్షతో శ్రమించి టీచర్ ఉద్యోగం సాధించిన మెగా డీఎస్సీ అభ్యర్థుల కష్టాన్ని, విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ అభ్యర్థులను సతాయించడం, వారిపై బురదజల్లడం వైసీపీ నేతలు మానుకోవాలని హితవు పలికారు. 2018లో డీఎస్సీ రాసి ఉద్యోగం రాకపోయినా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో చదివి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని మంత్రి విమర్శించారు. రాత్రీ పగలు తేడా లేకుండా చదివి, ఎన్నో త్యాగాలు చేసి యువత ఉద్యోగాలు సాధించిందన్నారు. పట్టుదలతో ఉద్యోగం సాధించిన వారి విజయాన్ని రాజకీయాల కోసం అవమానించడం సరికాదన్నారు.

అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ లిస్ట్ వరకు మెగా డీఎస్సీ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. మెరిట్, అర్హత ఆధారంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై బురదజల్లడం మానుకోవాలన్నారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలకు తావులేదన్నారు. ఉద్యోగం సాధించిన అభ్యర్థుల విజయాన్ని ప్రశ్నించడం ఏళ్ల తరబడి వారు పడిన కష్టాన్ని అవమానించడమే అన్నారు. యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం వైసీపీకి తగదని హెచ్చరించారు. వైసీపీ రాజకీయాల కోసం అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దని.. వారి భవిష్యత్తుతో ఆటలాడొద్దన్నారు. మెగా డీఎస్సీ విజేతల ఆవేదనను జగన్ అర్థం చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

## సంక్షేమాన్ని మాటల్లోనే కాదు...

# గణాంకాల్లో కూడా చూపిస్తున్నాం

- 90 శాతం హామీలు అమలు చేశాం
- అన్ని వర్గాలకు అండగా నిలిచాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రసంగం



మంగళగిరి(చైతన్యరథం): ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకు న్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటు న్నామని, ప్రతి కుటుంబానికి అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, బీసీలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, దివ్యాంగులు.. ఇలా ప్రతివర్గానికీ అండగా నిలుస్తున్నామన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యా లయంలో సోమవారం నుంచి ప్రారంభమైన తెలుగు దేశం లీడర్ షిప్ కాంక్లేవ్‌లో మంత్రి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకా లను వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో రెండేళ్లలో 90శాతం అమలు చేశామని, మాటల్లో కాకుండా గణాంకాల్లో కూడా చూపిస్తున్నా మని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబె ట్టుకుంటనేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచామని తెలిపారు. 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనిలో భాగంగా రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. పేదలందరికీ విద్యా హక్కు కల్పించడంలో భాగంగా తల్లికి వందనం పథకంలో భాగంగా ఏటా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం రెండేళ్లలో రూ.20,090 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోనే తల్లికి వందనం కింద 32,969 మంది విద్యార్థులకు రూ.49.45 కోట్లు అందించామని, ప్రతి విద్యార్థి చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

### 90 శాతం హామీలు అమలు చేశాం

అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. రెండేళ్లలో 46 లక్షల మంది రైతులకు రూ.14,664 కోట్లు పెట్టుబడి సాయంగా అందించామన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమన్నారు. 31.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగో లు చేసి రూ.1,100 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టామని, ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఇందుకోసం రూ.3,218 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మహిళల వంటింటి భారం తగ్గించే దుకు దీపం-2 పథకంలో 4.57 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం రూ.3,800 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పెనుకొండలో దీపం-2 పథకం కింద 5.74 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించా మని, ఇందుకోసం రూ.49.25 కోట్ల సబ్సిడీని అందజేశామని తెలిపారు.

### బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యం

బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించామని, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నా మని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు బీసీల రాజకీయ సాధికారతే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల కోసం ముందుకు సాగుతున్నామన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. దాని వల్ల 16,800 రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

### బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 బీసీ కులాల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేస్తూ బీసీ ప్రొటెక్షన్ యాక్ట్-2026 తీసుకు రావడానికి చర్యలు చేపట్టామని వివరించారు. బీసీల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 50 ఏళ్లు పైబడిన 1,30,796 మంది మత్స్యకారులకు రూ.505 కోట్ల మేర పింఛన్లు అందించా మని తెలిపారు. వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. చేనేత కార్మికులకు కూడా అండగా నిలిచామని, 50 ఏళ్లు పైబడిన 85,940 మంది చేనేత కార్మికులకు రూ.844 కోట్ల పింఛన్లు అందించామని తెలిపారు. 62,541 నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నా మని తెలిపారు. నేతన్నల సేవలో పథకం కింద మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తు న్నామని వివరించారు. దివ్యాంగుల సంక్షేమంలోనూ కూటమి ప్రభుత్వం ముందుం దని తెలిపారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. దివ్యాంగుల ఆత్మ గౌరవం కోసం 1,750 మందికి మూడు చక్రాల వాహనాలు అందించాం.. ఇందుకోసం రూ.18.47 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పేదల సంక్షేమానికే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తాం దని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని తెలిపారు.

# స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

- వెంకయ్యనాయుడు వ్యక్తి కాదు, ఓ వ్యవస్థ
- ఆయన ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న స్వర్ణభారత్ ట్రస్ట్
- 25 ఏళ్లుగా కొనసాగుతున్న సేవా ప్రస్థానం
- రజతోత్సవ వేడుకల్లో ట్రస్ట్ సేవలను కొనియాడిన మంత్రి నారాయణ



వెంకటాచలం/నెల్లూరు (చైతన్యరథం): సమాజ సేవే లక్ష్యంగా గత 25 ఏళ్లుగా స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ వేడుకల్లో సోమవారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడులతో కలిసి మంత్రి నారాయణ వేదిక పంచుకున్నారు. అంతకు ముందు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న యోగి ఆదిత్యనాథ్‌కు మంత్రి నారాయణ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్షర విద్యాలయం ప్రాంగణంలోని సోమా స్కిల్ సెంటర్‌ను యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి సందర్శించి, విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 25 ఏళ్లుగా సేవా ప్రస్థానం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మానసపుత్రికగా స్వర్ణభారత్ ట్రస్ట్ 2001లో ప్రారంభమైందని మంత్రి నారాయణ తెలిపారు. సమాజానికి, జన్మనిచ్చిన ప్రాంతానికి తన వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పంతో ఏర్పాటైన ఈ సంస్థ నేడు లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. నెల్లూరుతో పాటు విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలను విస్తరించి ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకువస్తోందని పేర్కొన్నారు. వెంకయ్యనాయుడు స్నేహితుడు కామినేని వెంకటేశ్వర్లు ఛైర్మన్‌గా, ఆయన కుమార్తె శ్రీమతి దీపా వెంకట్ మేనేజింగ్ ట్రస్టీగా సేవలు అందిస్తున్నారని తెలిపారు.

### పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు. గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించాలి. అన్న దాతలు ఆధునిక వ్యవసాయ విధానాలతో ఆర్థికంగా బలపడాలి. పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి. మహిళలు సాధికారత సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యాలతో ట్రస్ట్ ముందుకు సాగడం అభినందనీయ మని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం పొందకుండా, విదేశాల నుంచి ఎటువంటి సాయం తీసుకోకుండా 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలను కొనసాగించడం స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రత్యేకత అని చెప్పారు.

### విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత సైబర్ గ్రామీణ్ శిక్షణ కేంద్రం, గ్రామీణ ఆరోగ్య సేవా కేంద్రం, ఉచిత దంత వైద్యశాల, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో గ్రామీణ కంటి వైద్య కేంద్రం, పశువైద్యశాల వంటి సేవలు అందుతున్నాయని మంత్రి వివరించారు. అదేవిధంగా సీబీఎస్ఈ విధానంలో అక్షర విద్యాలయం, రాష్ట్ర సిలబస్ ఆధారంగా స్వర్ణభారతి విద్యామందిర్, వృద్ధాశ్రమం, పారిశ్రామిక ప్రముఖులు, నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సమాజంలోని వివిధ వర్గాలకు సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు.

### వెంకయ్యనాయుడు ఓ వ్యక్తి కాదు-ఓ వ్యవస్థ

వెంకయ్యనాయుడు కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక వ్యవస్థ అని మంత్రి నారాయణ కొనియాడారు. తెలుగుజాతి గర్వించదగ్గ జాతీయ నాయకుడిగా, విలువలకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన నిలిచారని అన్నారు. రాజకీయ వారసత్వం లేకుండా సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవైన భారత ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వెంకయ్యనాయుడు జీవితం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

25 ఏళ్లుగా నిరంతరం సేవలందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు, సిబ్బంది, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగించి సమాజాభివృద్ధిలో స్వర్ణభారత్ ట్రస్ట్ మరింత కీలక పాత్ర పోషించాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.

చైతన్యరథం

## ఎన్నిసార్లు వివరణ ఇచ్చినా...

# మెగా డీఎస్సీపై అదే దుష్ప్రచారం

- టెట్ అర్హతలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవం
- స్పోర్ట్స్ కోటాలో పారదర్శకంగా పోస్టుల ఎంపిక
- ఉద్యోగాలు రాని అభ్యర్థులను కావాలనే రెచ్చగొడుతున్నారు
- స్పోర్ట్స్ డీఎస్సీ అభ్యర్థులపై వచ్చిన ఆరోపణలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ వివరణ
- కేసుల వారీగా సమగ్రంగా వివరించిన అధికారులు

అమరావతి (చైతన్యరథం): గత ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీపై ఎన్నిసార్లు వివరణలు ఇచ్చినా కొందరు ఇంకా దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో పోస్టుల ఎంపిక పారదర్శకంగా జరిగినట్లు వెల్లడించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా నిర్వహించిన మెగా డీఎస్సీ–2025లో కొందరు అభ్యర్థుల టెట్ అర్హతలు, కుల ధ్రువీకరణ, క్రీడా సర్టిఫికెట్ల ప్రామాణికతపై వివిధ మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలలో ఏమాత్రం వాస్తవాలు కావన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులు, నిబంధనలు, సంబంధిత సంస్థల ధ్రువీకరణల ఆధారంగా కేసుల వారీగా వారు వివరణ ఇచ్చారు.

జూడో గురించి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. పోస్టులు రానివారి వద్దకు వెళ్లి కావాలనే ఆరోపణలు చేయిస్తున్నారు. క్రీడా సంఘాల గురించి గతంలోనే స్పష్టంగా చెప్పాం. జూడో కోటా ఎంపిక చేసినవారిపై పిటిషన్ వేశారు. డీవోపీటీ చెప్పినదాన్నే మేం అమలు చేశాం. ఎలాంటి మార్పులుచేయలేదు. జూడో సంఘం ఇచ్చిన ప్రతి ధ్రువపత్రాన్ని పరిశీలించాం. హైకోర్టు ఆదేశాలు పాటించామని గతంలోనే స్పష్టం చేశాం. ఒకే టోర్నీలో ఆడిన భార్యాభర్తలనూ పరిగణనలోకి తీసుకున్నాం. చదువుకున్నప్పుడే పోటీల్లో పాల్గొనాలనే నిబంధనలు ఏమీ లేవు. కర్ణాటకలో చదువుకుంటున్నా ఏపీ నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. జిల్లాల పరిధిలో ఆడాలంటే ఆయా క్రీడాసంఘాలు ధ్రువీకరించాలి. బాక్సింగ్లో ఏపీకి పేరు తెచ్చిన అప్పలరాజుపై దుష్ప్రచారం చేస్తున్నారు. కొనద పద్మజ వయసుపైనాతప్పుడు ప్రచారం జరుగుతోందని శాప్ ఎండీ భరణి అన్నారు.

ఒకసారి టెట్ రాస్తే చాలు.. జీవితాంతం అమల్లో ఉంటుందని తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు అర్హత మార్కులు వేర్వేరుగా ఉంటాయన్నారు. టెట్‌కు 20 శాతం వెయిటేజ్ ఉంటుందన్నారు. 1 నుంచి 8వ తరగతి బోధించే అందరికీ టెట్ తప్పనిసరి అని పేర్కొన్నారు. పీజీటీ ప్రిన్సిపల్‌కు టెట్ నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అభ్యర్థులపై వచ్చిన ప్రతి ఆరోపణనూ పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు అందరికీ టెట్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ–2025లో టెట్, విద్యార్హతలు, కేటగిరీ, క్రీడా అర్హతలను సంబంధిత నిబంధనలు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణల ఆధారంగా కేసు వారీగా పరిశీలించామని తెలిపారు. అభ్యర్థులు పొందుపర్చిన ఏదైనా సర్టిఫికెట్ నకిలీదని, అర్హత నిబంధనలకు విరుద్ధమని నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని, అదే సమయంలో కేవలం ఆరోపణల ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రతి కేసును అధికారిక ఆధారాల ప్రాతిపదికన నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నామని స్పష్టంచేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అధికారిక ఆధారాల పరిశీలనకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వారు పేర్కొన్నారు. టెట్ అర్హతపై స్పష్టమైన నిబంధనలను, ఆరోపణలకు గురైన అభ్యర్థులకు సంబంధించిన విషయాలను తమీమ్ అన్సారియా వివరించారు.

### టెట్ అర్హతపై స్పష్టమైన నిబంధనలు...

భారత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో 1–8 తరగతుల ఉపాధ్యాయ నియామకాలకు టెట్‌ను ముఖ్యమైన అర్హతగా నిర్దేశించిందన్నారు.




ఆంధ్రప్రదేశ్‌లో టెట్ అమలుకు 16.04.2011న జీవో 51 ద్వారా మార్గదర్శకాలు జారీ అయ్యాయన్నారు. టెట్ ఉత్తీర్ణత ప్రమాణాలు ఓసీ/ఈడబ్ల్యూఎస్ 60% (90/150 మార్కులు), బీసీలకు 50% (75/150), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మాజీ సైనికులకు 40% (60/150)గా ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ స్కోరుకు 20%, టీఆర్‌టీ రాత పరీక్షకు 80% వెయిటేజీ ఆధారంగా మెరిట్ రూపొందుతుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), ఫిజికల్ డైరెక్టర్, పీజీటీ ప్రిన్సిపాల్ పోస్టులకు ప్రత్యేక టెట్ అర్హత వర్తించదన్నారు.

### టెట్ ఆరోపణలపై కేసుల వారీగా వాస్తవాలు...

*1. ఈడిగ ప్రభాకర్ – కర్నూలు*

స్పోర్ట్స్ డీఎస్సీ–2025లో ఎస్టీజీ పోస్టుకు దరఖాస్తు చేసి, హాకీ విభాగంలో స్పోర్ట్స్ కోటాద్వారా ఎంపికైన ఈడిగ ప్రభాకర్‌పై నిర్దేశిత టెట్ మార్కులు లేవనే ఆరోపణ వచ్చిందన్నారు. అయితే ఈ అభ్యర్థి టెట్ పరీక్షలకు హాజరయినట్లు, 2018లో పేపర్–2 బీలో 77 మార్కులు సాధించినట్లు రికార్డుల్లో ఉందన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ కొనసాగుతోంది. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారమన్నారు.

*2. జంపాల ఉష –కర్నూలు*

బీసీ–ఏ కేటగిరీకి చెందిన జంపాల ఉషపై కూడా నిర్దేశిత టెట్ అర్హత లేదనే ఆరోపణ వచ్చిందన్నారు. అయితే 2011–2017 మధ్య లాంగ్వేజ్ టీచర్ కోసం ప్రత్యేక పేపర్–2 ఉండేది కాదన్నారు. అభ్యర్థులు మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్ విభాగాల్లో పేపర్–2 పరీక్ష రాసేవారన్నారు. బీసీ అభ్యర్థులకు అప్పట్లో 50 శాతం, అంటే 75/150 మార్కులు ఉత్తీర్ణత ప్రమాణంగా ఉండేదన్నారు. జంపాల ఉష 2012 జనవరి, 2012 మేలో వరుసగా 79,80 మార్కులు, 2017లో 76 మార్కులు సాధించారన్నారు. అందువల్ల అప్పటి నిబంధనల ప్రకారం ఆమె టెట్ అర్హతను సంతృప్తి పరిచినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

*3. మిరియాల గాయత్రి సాయిశ్రీ – తూర్పుగోదావరి ఎస్ఏ– తెలుగు*

ఓసీ కేటగిరీకి చెందిన మిరియాల గాయత్రి సాయి శ్రీపై టెట్ అర్హత లేదనే ఆరోపణ నిర్ధారణ కాలేదన్నారు. ఓసీ అభ్యర్థులకు 90/150 మార్కులు కనీస అర్హత కాగా, ఆమె ఏపీటెట్ –2024 పేపర్–2ఏ, ఎస్ఏ– తెలుగులో 97.89 మార్కులు సాధించారన్నారు. అందువల్ల ఆమె టెట్ అర్హతను సంతృప్తి పరిచినట్లు నిర్ధారించబడిందన్నారు. అనంతరం స్పోర్ట్స్ కోటా కింద ఎస్ఏ– తెలుగు పోస్టుకు ఎంపికై తూర్పుగోదావరి జిల్లాలో నియమితులయ్యారన్నారు.

*4. ప్రగడ కళ్యాణి – విశాఖపట్నం*

బీసీ–ఏ కేటగిరీకి చెందిన ప్రగడ కళ్యాణిపై కూడా టెట్ అర్హతపై ఆరోపణ వచ్చిందన్నారు. బీసీ అభ్యర్థులకు 75/150 మార్కులు కనీసఅర్హత కాగా, ఆమె ఏపీ టెట్–2018 పేపర్–2ఏ, సోషల్ స్టడీస్‌లో 75మార్కులు సాధించారని తెలిపారు. అందువల్ల ఆమె నిర్దేశిత టెట్ అర్హతను సరిగ్గాసాధించినట్లు రికార్డుల ఆధారంగా నిర్ధారించబడిందని తెలిపారు. ఆమె స్పోర్ట్స్ కోటా కింద ఎస్ఏ–సోషల్ స్టడీస్ పోస్టుకు ఎంపికై విశాఖపట్నం జిల్లాలో నియమితులయ్యారన్నారు.

*5. టెట్ అర్హత కలిగిన ఇతర అభ్యర్థులు*

అదే విధంగా టెట్ అర్హత కలిగిన షేక్ నయాబ్ రసూల్, జక్కుల ఉదయలక్ష్మి, తాడిమర్రి మహమ్మద్ రఫీ, దేవరకొండ పవన్‌కుమార్, తొగట చరణ్‌రాజా తదితర అభ్యర్థుల విరాలను పరిశీలించగా సంబంధిత టెట్ పేపర్లలో నిర్దేశిత మార్కులు సాధించినట్లు అధి కారిక రికార్డులు వెల్లడిస్తున్నాయన్నారు. వీరిలో షేక్ నయాబ్‌రసూల్(ఏపీటెట్ పేపర్–1ఏ,2022) 82.57, జక్కుల ఉదయలక్ష్మి (2024) 94.28, తాడిమర్రి మహమ్మద్ రఫీ (2022) 89.22, దేవర కొండ పవన్ కుమార్ (2017) 77, తొగట చరణ్ రాజా (2024) 106 మార్కులు సాధించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని ఆమె తెలిపారు.

*6. వి.చక్రపాణి రెడ్డి–చిత్తూరు*

ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీకి చెందిన వి.చక్రపాణి రెడ్డిపై కూడా టెట్‌ర్హత లేదనే ఆరోపణవచ్చిందన్నారు. ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 40శాతం, అంటే 60/150 మార్కులు కనీసఅర్హత అని,ఆయన ఏపీటెట్ –2024 పేపర్–2ఏ, సోషల్ స్టడీస్‌లో 79.47మార్కులు సాధించారన్నారు. అదనంగా సీటీఈటీ పేపర్–2ఏ, లో 65మార్కులు సాధించడం జరిగిందన్నారు. అందువల్ల టెట్ అర్హత విషయంలో వచ్చిన ఆరోపణ నిర్ధారణ కాలేదన్నారు.. అనంతరం ఆయన స్పోర్ట్స్ కోటా కింద ఎస్ఏ–సోషల్ స్టడీస్ పోస్టుకు ఎంపికై కుప్పం పరిధిలో నియమితులయ్యారు.

క్రీడా కోటా అభ్యర్థులపై ఆరోపణలకు సంబంధించి శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి భరణి వివరణ ఇస్తూ...స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 08.08.2025 నుంచి 14.08.2025 వరకు తాత్కాలిక స్పోర్ట్స్ కోటా లిస్ట్‌ను ప్రచురించి, గ్రీవెన్స్ రీడ్రెస్సల్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆమె తెలిపారు. అనంతరం కూడా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించామన్నారు. స్పోర్ట్స్ డీఎస్సీకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 69 రిట్ పిటిషన్లు దాఖలైనప్పటికీ, అవి ఏపీ స్టేట్ జూడోఅసోసియేషన్ జారీచేసిన జూడో సర్టిఫికెట్లు నకిలీవి లేదా అసలైనవి కావనే అంశానికి సంబంధించినవి కావని ఆమె స్పష్టం చేశారు.

ఈ ఏడాది జూలై 23న దాఖలైన ఒక పిల్ మేరకు ప్రస్తుతం స్టేట్ జూడో అసోసియేషన్ జారీ చేసిన సర్టిఫికెట్ల ప్రామాణికత అంశం హైకోర్టు పరిశీలనలో ఉందన్నారు. 2017నుంచి విజిలెన్స్ శాఖకు ఫిర్యాదులు అందినట్లు ఆ పిల్‌లో పేర్కొన్నారన్నారు.

ఈ నేపథ్యంలో విజిలెన్స్ శాఖను విచారణ పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందన్నారు. కాబట్టి ఈ అంశంపై తుది నిర్ణయం విచారణ ఫలితాల ఆధారంగానే ఉంటుందని ఆమె తెలిపారు.

### జూడో సర్టిఫికెట్లపై నిబంధనలు...

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రీడాకారుల నియామకాల్లో సంబంధిత క్రీడా విభాగానికి చెందిన అధికారిక సంస్థల ద్వారా జారీచేసిన ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేషనల్‌లెవల్ కాంపిటీషన్స్‌కు సంబంధిత నేషనల్ ఫెడరేషన్ లేదా స్టేట్ అసోసియేషన్, ఇంటర్–యూనివర్శిటీ కాంపిటీషన్స్‌కు సంబంధిత విశ్వవిద్యాలయం, స్కూల్‌గేమ్స్‌కు సంబంధిత విద్యాశాఖ/క్రీడా అధికారి, ఖేలో ఇండియా గేమ్స్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో నియమిత అధికారి ధ్రువీకరణలు జారీ చేసే అధికారం ఉందన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం వచ్చిన సర్టిఫికెట్లను నియామక ప్రక్రియలో పరిశీలించడం జరిగిందన్నారు.

### ఒకే మండలానికి చెందిన జూడో క్రీడాకారులపై ఆరోపణ

21మంది అభ్యర్థులు ఒకే క్రీడావిభాగమైన Judo కు చెందినవారని, ఒకే మండలానికి చెందినవారని, వారిలో ఏడుగురు ఒకే కుటుంబానికి చెందినవారని ఆరోపణలు వచ్చాయన్నారు. సంబంధిత క్రీడాసర్టిఫికెట్ల ప్రామాణికతపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తై వాస్తవాలు నిర్ధారణ అయిన తర్వాతే తదుపరి చర్యలుతీసుకుంటామని ఆమె తెలిపారు. అలాగే ఒక క్రీడాకారుడు తన స్వస్థల జిల్లాలోనే తప్పనిసరిగా పోటీ చేయాలనే నిబంధన లేదని ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ తన లేఖలో స్పష్టం చేసిందన్నారు. క్రీడాకారుడు తాను ప్రస్తుతం చదువుతున్న లేదా పనిచేస్తున్న జిల్లాను కూడా ప్రాతినిధ్యం వహించవచ్చని అసోసియేషన్ పేర్కొందన్నారు.

### నొస్సం కరిష్మా - షేక్ ఇమామ్ హుస్సేన్

భర్త,భార్య ఇద్దరూ స్పోర్ట్స్ కోటాకింద ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారని, వారి జూడో సర్టిఫికెట్ల ప్రామాణికతపై సందేహాలున్నాయని ఆరోపణలు వచ్చాయన్నారు. ఇద్దరూ 11–13 నవంబర్ 2014లో విజయవాడలో జరిగిన సీనియర్‌ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో టోర్నమెంట్‌లో రెండో స్థానం సాధించినట్లు రికార్డుల్లో ఉందన్నారు. ఇద్దరూ భార్యాభర్తలు అయినప్పటికీ,వారు పురుషులు, మహిళల వేర్వేరు విభాగాల్లో, వేర్వేరు బరువుకేటగిరీల్లో పోటీచేసినందున వారి క్రీడా ప్రతిభను విడివిడిగా పరిగణించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అలాగే క్రీడా పోటీలో పాల్గొనడానికి తప్పనిసరిగా విద్యాసంస్థలో నమోదు అయి ఉండాలనే నిబంధన లేదని ఆమె తెలిపారు. 2014లో షేక్ ఇమామ్ హుస్సేన్ కర్ణాటకలో బీఈడీ చదువుతున్నప్పటికీ, తన నేటివిటీ ఆధారంగా కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆంధ్రప్రదేశ్ తరపున పోటీ చేసినట్లు ఆమె వివరించారు.

### పెద్ద అప్పలరాజు - బాక్సింగ్ సర్టిఫికెట్ వివాదం

పెద్ద అప్పలరాజు విషయంలో మొదట తప్పుగా తన సోదరుడి స్పోర్ట్స్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు ఆరోపణ వచ్చిందన్నారు. అయితే దరఖాస్తులలో తప్పులను సరిచేసుకునేందుకు చివరిదశలో అదనపు సమయం ఇవ్వబడిన సమయంలో, అభ్యర్థి తన నేషనల్ ఛాంపియన్ షిప్ సర్టిఫికెట్‌ను బ్యాక్‌అప్ సర్టిఫికెట్‌గా అప్‌లోడ్ చేశారన్నారు. ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలోకూడా అదే సర్టిఫికెట్‌ను సమర్పించారన్నారు. 2023లో గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్ రికార్డుల్లో 'పాండా'గా పేరు నమోదైన అంశంపై కూడా ఆమె స్పష్టత ఇచ్చారు. అసలు సర్టిఫికెట్‌లో అభ్యర్థి పేరు 'పెద్ద అప్పలరాజు' గానే ఉందని ఆమె తెలిపారు.

### కొనద పద్మజ - అథ్లెటిక్స్ సర్టిఫికెట్

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొనద పద్మజ విషయంలో 2021లో ఏపీ సీనియర్ ఇంటర్–డిస్ట్రిక్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్స్‌లో పాల్గొని రెండో స్థానం సాధించిన విషయంపై, ఆమె వయస్సు మరియు గత క్రీడా రికార్డులపై సందేహాలు వ్యక్తమయ్యాయన్నారు.

అయితే అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులు, సంబంధిత అథ్లెటిక్స్ అసోసియేషన్ సమర్పించిన అథెంటిఫికేషన్ ఫారం–2 ఆధారంగా ఆమె క్రీడా విజయాన్ని చెల్లుబాటు అయ్యేదిగా పరిగణించినట్లు ఆమె తెలిపారు. 19.04.2025న జారీ అయిన జీవో 4లో వర్తించే నిబంధనల ప్రకారం ఆమెను పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు.

### సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట్లపై వివరణ

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట్స్‌పై కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, ముఖ్యంగా ఫారం–2ను సంబంధిత అసోసియేషన్ అధ్యక్షుడు జారీ చేయగలరా అనే అంశంపై సందేహాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పంపినలేఖలో,క్రీడాకారుల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో కూన రవికుమార్‌కు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్‌తరపున స్పోర్ట్స్‌సర్టిఫికెట్లను వెరిఫై చేయడానికి అధికారం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషను 2026లోశాప్‌గుర్తించినట్లు కూడా ఆమె వివరించారు.

### ఓసీ-ఈడబ్ల్యూఎస్ కేటగిరీపై వచ్చిన ఆరోపణలు

ఓసీ–ఈడబ్ల్యూఎస్ కేటగిరీపై ఆరోపణలు ఎదురైన అభ్యర్థుల విషయంలో, సంబంధిత సమర్థ అధికారి జారీ చేసిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఆధారంగా నియామకం జరిగినట్లు ఆమె తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో నిర్ణయం వ్యక్తిగత ప్రకటనల ఆధారంగా కాకుండా సమర్థ అధికారి జారీ చేసిన అధికారిక ధ్రువీకరణ పత్రాల ఆధారంగా తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అధికారిక ఆధారాల పరిశీలనకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, విచారణలో ఏదైనా అక్రమం నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తమీమ్ అన్సారియా, భరణి స్పష్టం చేశారు.

# ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

- ఢిల్లీలోని ఏపీ భవన్లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- తెలుగుప్రజలందరికీ అత్యుత్తమ నాణ్యతతో కూడిన సరుకులు
- అందుబాటులో కేఎన్ఎం, బీపీటీ వంటి రకరకాల బియ్యం వెరైటీలు
- ఎన్‌సీసీఎఫ్ ద్వారా సబ్సిడీ ధరలతో 64 రకాల నిత్యావసర సరుకులు



న్యూఢిల్లీ (చైతన్యరథం): దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు.

రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీఎఫ్) ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ధరల నియంత్రణపై చర్చ

ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్‌ని ఏపీ పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కలిసి చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు,ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో కేంద్ర ప్రభుత్వసంస్థల సహకారాన్ని మరింత విస్తృతం చేస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ముందుకు వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### కేంద్ర కార్యదర్శితో భేటీ

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా, కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం, సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఈ భేటీలో నిర్ణయించారు.

## టీచర్లను అవమానించింది జగనే

- మద్యం దుకాణాల వద్ద నిలబెట్టింది మర్చిపోయారా?
- కూటమి ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ
- అసెంబ్లీకి రాకుండా ప్రెస్‌మీట్లతో జగన్ అసత్య ప్రచారం
- ఎంపీ చింతకాయల విజయ్

అమరావతి (చైతన్యరథం): ఉపాధ్యాయులపై జగన్‌కు ఏమాత్రం గౌరవం లేదని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో దేవుళ్ల లాంటి గురువులను వైన్ షాపుల వద్ద క్యూ లైన్లకు కాపలాగా నిలబెట్టి అవమానించారని విమర్శించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విజయ్ మాట్లాడుతూ డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య కనీస తేడా కూడా తెలియని వ్యక్తి వైఎస్ జగన్ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారన్నారు. ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 16వేల పోస్టులతో మెగా డీఎస్సీకి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని నిరుద్యోగుల పట్ల మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. చట్టసభలకు వచ్చే దమ్ములేని జగన్.. ప్రెస్ మీట్లు పెట్టి డీఎస్సీపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కుప్పంలో పాఠాలు చెబుతున్న మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడిని సాక్షి రిపోర్టర్‌తో బెదిరించడం దారుణం అన్నారు. బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి చేయాలని చూస్తే.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకమై వైసీపీని భూస్థాపితం చేస్తారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ.. ఎక్కడైతే ఓడారో అక్కడే గెలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సమర్థుడు నారా లోకేష్ అని విజయ్ కొనియాడారు.



# లక్ష్యాల మేరకు తాగునీటి ప్రాజెక్టుల పనులు

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి జేజేఎం - అమరజీవి జలధారలు
- పవన్ ప్రత్యేక శ్రద్ధతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- శరవేగంగా సాగుతున్న రూ.2,370 కోట్ల భారీ ప్రాజెక్టు పనులు
- 18 మండలాలు, 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యం
- దాదాపు 25 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత



అమరావతి (చైతన్యరథం): అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులు వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పూర్తికావాల్సిన పనులపై సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా వేగంగా నిర్మాణం పూర్తి చేసి, గడువులోపు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల కింద రూ.2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందాలి. ప్రతి గొంతు దాహార్తి తీరాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ సంకల్పాన్ని అమరజీవి జలధారలుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళుతున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ.7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద నిర్మాణం చేపట్టిన ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, అందులో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, తదితర 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

# సైనికుల త్యాగాలను కించపరిచేలా జగన్ వైఖరి

- ఎక్స్-ఆర్మీ టీచర్‌పై సాక్షి మీడియా దౌర్జన్యం గర్హనీయం
- స్కూలు పిల్లల ముందే అవమానం దారుణం, పూర్తి బాధ్యత జగన్ రెడ్డిదే
- మెగా డీఎస్సీపై అసత్య ప్రచారం సహించేది లేదు
- ఎంపీ చింతకాయల విజయ్ ధ్వజం



అమరావతి (చైతన్యరథం): దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, ప్రశాంతంగా జీవించగలుగుతున్నారంటే దానికి ప్రధాన కారణం సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపలా కాస్తున్న వీర జవాన్లేనని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ స్పష్టం చేశారు. అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో సైనికులు దేశ రక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలో కూడా వారు కనబరుస్తున్న గుండెధైర్యం వెలకట్టలేనిది. దేశ సరిహద్దులను కాపాడే సైనికుల వల్లే మనమంతా ప్రశాంతంగా జీవిస్తున్నాం. అలాంటి వీర జవాన్ల పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు గానీ, ఆయన పార్టీకి గానీ కనీస గౌరవం, నమ్మకం లేవని తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విజయ్ మాట్లాడుతూ.. కుటుంబాలకు దూరంగా, ఎముకలు కొరికే చలిలో పహారా కాసే సైనికులను చూసి యావత్ దేశం గర్విస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ సైనికుల త్యాగాలను కొనియాడుతూ దేశభక్తిని చాటుకుంటారు. అవినీతి రాజకీయాలు చేసుకునే నాయకులు సైతం ఈరోజు సురక్షితంగా ఉన్నారంటే అది సరిహద్దుల్లో జవాన్లు చేసే ప్రాణత్యాగాల చలవే. గురుపూజోత్సవం రోజున గురువులను పూజించాల్సింది పోయి, కుప్పం ప్రభుత్వ పాఠశాలలో ఒక ఎక్స్-ఆర్మీ ఉపాధ్యాయుడిపై జగన్ అనుకూల సాక్షి మీడియా ప్రతినిధి వ్యవహరించిన తీరు అత్యంత హేయమైనది. పవిత్రమైన గురు పూజోత్సవం నాడే పిల్లల ముందు ఒక టీచర్ కాలర్ పట్టుకోవడం క్షమించరాని నేరం. తాను దేశం కోసం పనిచేసిన ఎక్స్-ఆర్మీ జవానునని, స్పోర్ట్స్ కోటా ద్వారా చట్టబద్ధంగా ఉద్యోగం సాధించానని ఆ ఉపాధ్యాయుడు మొరపెట్టుకున్నా వినకుండా దౌర్జన్యానికి దిగారు. సర్టిఫికెట్లు చూపించాలంటూ, ఎవరికి లంచం ఇచ్చావంటూ బెదిరించి, విద్యార్థుల ముందే ఆయన్ను మానసికంగా కుంగదీసే కుట్ర చేశారు. పాఠశాల గదిలోకి చొరబడి దేశాన్ని కాపాడిన ఒక సైనికుడి కాలర్ పట్టుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ ఘటనతో జగన్ మీడియా నైతికత పూర్తిగా పతనమైందని, దీనికి జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించాలని విజయ్ డిమాండ్ చేశారు.

### జగన్ దిగజారుడు రాజకీయం

యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి నారా లోకేష్16,000 పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీని పట్టాలెక్కిస్తే, ఓర్వలేక వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన సొంత మీడియా సాక్షి ద్వారా ఉపాధ్యాయులపై విషం చిమ్ముతున్నారని ఎంపీ విజయ్ మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని 'జీరో సీఎం' జగన్ అని ఎద్దేవా చేశారు. గణేష్ అనే సాక్షి విలేకరి ఏకంగా ప్రభుత్వ పాఠశాల గదిలోకి చొరబడి, విద్యార్థుల ముందే దేశం కోసం పనిచేసిన ఎక్స్-ఆర్మీ ఉపాధ్యాయుడిపై దౌర్జన్యం చేసి బెదిరింపులకు దిగడం హేయమైన చర్య. ఇలాంటి దిగజారుడు రాజకీయ నాయకులు, మీడియా ఈ సమాజానికి అవసరమా అని ప్రశ్నించారు. జాతీయ పతాకం అన్నా, అశోక చక్రం అన్నా కనీస అవగాహన, గౌరవం లేని వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. కనీసం జనగణమన పాడటం కూడా రాని జగన్‌కు దేశభక్తిలో ఒక్క శాతం కూడా లేదని, సైనికులంటే అసలే గౌరవం లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, పాఠశాలల బాగు కోసం ఇచ్చిన మాట ప్రకారం నారా లోకేష్ మెగా డీఎస్సీ ద్వారా 16 వేలపైగా ఉద్యోగాలు భర్తీ చేయడంతో జగన్‌కు వెన్నులో వణుకు మొదలైంది. ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయలేక, జాబ్ క్యాలెండర్ ఇవ్వలేక, ఒక్క డీఎస్సీ కూడా తీయలేక 'జీరో సీఎం'గా మిగిలిన జగన్‌కు ఈ మెగా డీఎస్సీ చూసి కడుపుమంట మొదలైంది. గతంలో డాక్టర్ సుధాకర్ లాంటి ఫ్రంట్‌లైన్ వారియర్‌ను మానసికంగా వేధించి బలితీసుకున్న చరిత్ర జగన్‌ది. ఇప్పుడు అదే తరహాలో ఉపాధ్యాయులపై పడ్డారు. భార్యాభర్తలిద్దరికీ ఉద్యోగాలు రాకూడదా? ప్రైవేట్ స్కూల్లో పనిచేసే వారి పేర్లతో ఫేక్ ఆడియో రికార్డింగ్‌లు సృష్టించి తప్పుడు ప్రచారాలు చేయడం సాక్షి దిగజారుడుతనానికి నిదర్శనం. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వారు ఉపాధ్యాయ నియామకాలపై అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటని విజయ్ ధ్వజమెత్తారు.

### బీసీలు, మైనారిటీల జోలికొస్తే సహించేది లేదు

పబ్లిక్ సర్వీస్ ఎగ్జామ్స్ ఎలా నిర్వహించాలో కూడా తెలియని జగన్ రెడ్డి, రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా నాశనం చేశారని విజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస విద్యార్హత, వ్యక్తిత్వం, దేశభక్తి లేని జగన్.. సైనికులను, ఉపాధ్యాయులను కించపరుస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టుల పురోగతి తెలియని జగన్ రాష్ట్రాన్ని సున్నా స్థాయికి తీసుకొచ్చారు. ఆయన చేసిన విధ్వంసాన్ని జెన్-జీ, జెన్-ఆల్ఫాతో సహా ప్రతితరం నిశితంగా గమనించాలి. ప్రతిదానికీ సీబీఐ ఎంక్వైరీ అంటున్న జగన్.. సీబీఐ వాళ్లే పులివెందుల వస్తే ఎవరు లోపలికి వెళ్తారో గుర్తుంచుకుంటే మంచిది. గతంలో సీబీఐ అధికారులనే బెదిరించిన చరిత్ర వైఎస్సార్ సీపీది. ఒక ఐఏఎస్, ఒక ఐఎఫ్ఎస్ స్థాయి మహిళా అధికారులు డీఎస్సీ ప్రక్రియను ఎంత పారదర్శకంగా నిర్వహించారో ప్రజలందరికీ వివరించారు. దీనిపై కోర్టుకు వెళ్లినా మొట్టికాయలు వేసి వెనక్కి పంపినా జగన్‌కు బుద్ధి రాలేదు. బీసీలు, ఎస్సీలు, మైనారిటీలకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తుంటే జగన్ ఓర్వలేక పోతున్నారు. కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం వేచి చూస్తూ, గత ప్రభుత్వంలో ఒక్క నోటిఫికేషన్ రాక రూ. 10 వేల ప్రైవేట్ జీతంతో బతికిన ఎంతోమంది నిరుపేదలకు, మైనారిటీలకు ఈరోజు ఉద్యోగాలు వచ్చాయి. తల్లిదండ్రులు లేని నిరుపేద అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కి నారా లోకేష్‌ను దేవుడిలా చూసుకుంటున్నారు. మంగళగిరిలో రికార్డు మెజారిటీతో గెలిచి, నిరంతరం రాష్ట్ర ప్రజల బాగు కోసం, పెట్టుబడుల సాధన కోసం, జాబ్ క్యాలెండర్ల అమలు కోసం శ్రమిస్తున్న లోకేష్‌పై విమర్శలు సిగ్గుచేటు. చిత్తశుద్ధి, విజన్ ఉంటే అభివృద్ధిపై చర్చించాలి తప్ప ఇలా ఉపాధ్యాయుల పొట్ట కొట్టేలా కుట్రలు చేయడం తగదు. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలోకి చొరబడి ఎక్స్-ఆర్మీ సైనికుల జోలికి వచ్చినా, బీసీ, మైనారిటీ ఉద్యోగులను వేధించినా సహించే ప్రసక్తే లేదు. ఇకనైనా ఈ దిగజారుడు చేష్టలు మానకపోతే ప్రజలే మిమ్మల్ని రాజకీయంగా భూస్థాపితం చేస్తారని ఎంపీ విజయ్ హెచ్చరించారు.

# కార్యకర్తే సుప్రీం.. కార్యకర్త నిర్ణయమే ఫైనల్

- జెండా మోసే వారికి పార్టీలో సముచిత స్థానం
- ఎంతోమందికి ఉన్నత పదవుల్లో అవకాశం దక్కింది
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు
- రాజకీయ, ఆర్థిక సాధికారత అంశంపై ప్రసంగం



మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే సుప్రీం..కార్యకర్త నిర్ణయమే ఫైనల్ అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రాజకీయ, ఆర్థిక సాధికారత అంశంపై ఆయన ప్రసంగించారు. పార్టీ జెండా మోసే కార్యకర్తలను పల్లకీలో కూర్చోబెట్టడమే చంద్రబాబు ప్రధాన సంకల్పమని తెలిపారు. ఆసక్తి, సమర్థత, హోదా, గౌరవం ఆధారంగా కార్యకర్తలను నాలుగు విభాగాలుగా విభజించి పదవులు, ప్రోత్సాహం అందిస్తున్నారని చెప్పారు. బూర్గుపల్లి శేషారావు, ఐతాబత్తుల ఆనందరావు లాంటి ఎందరో సామాన్య గ్రామస్థాయి కార్యకర్తల ను ఎమ్మెల్యేలుగా తీర్చిదిద్దిన ఘనత టీడీపీది. మండల స్థాయి నుంచి మంత్రిగా ఎదిగిన నిమ్మల రామానాయుడు, విద్యారంగాల నుంచి వచ్చిన నారాయణ, పెమ్మసాని చంద్రశేఖర్‌లకు సముచిత స్థానం కల్పించారు. యూనిట్ ఇన్‌ఛార్జ్ స్థాయి నుంచి అంగన్ వాడీ విభాగం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన రమాదేవిని ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. టీడీపీ యాప్, ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నేరుగా కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ తీసుకుని నిర్ణయాలు అమలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్తను స్వయంగా గుర్తిస్తూ లోకేష్ సందేశాలు పంపుతున్నారు. చంద్రయ్య లాంటి సాధారణ కార్యకర్త మరణిస్తే స్వయంగా పాడె మోసి అసెంబ్లీని సైతం కదిలించి కుటుంబానికి ఉద్యోగం కల్పించిన చరిత్ర చంద్ర బాబుది. 2014 నుంచి ఇప్పటివరకు 6,800 కార్యకర్తల కుటుంబాలకు రూ.174 కోట్ల ఇన్సూరెన్స్ పరిహారం అందించిన ఏకైక పార్టీ టీడీపీ. ఒక పూట ఆకలి తీర్చడం కాదు.. వ్యాపారాలు, స్వయం ఉపాధి కల్పించి కార్యకర్తల కుటుంబాలను ఆర్థికంగా సుస్థిరం చేయడమే పార్టీ లక్ష్యం. పీఎంఈజీపీ, ముద్ర వంటి లోన్లు, ప్రాజెక్ట్ రిపోర్టుల తయారీలో నిపుణుల సలహాలతో కార్య కర్తలకు వ్యాపార తోడ్పాటునందిస్తుంది. 44 ఏళ్లుగా నిరంతర నాయకత్వ నిర్మాణంతో ముందుకుసాగుతున్న తెలుగుదేశం పార్టీని భావితరాలకు అందిద్దామని పిలుపునిచ్చారు.

# హజ్ యాత్రికులకు విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్

## - కేంద్ర మంత్రికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ వినతి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ యాత్రికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు, హజ్ యాత్రకు సంబంధించిన విమాన ఛార్జీలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులుఎదుర్కొంటున్న అధిక విమాన ఛార్జీల భారం, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ అవసరం, ప్రయాణ సౌకర్యాలు తదితర అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. విజయవాడ నుంచి హజ్ యాత్రికులకు ఎంబార్కేషన్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రయాణ సమయం, ఖర్చు తగ్గడంతోపాటు రాష్ట్రంలోని హజ్ యాత్రికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని హాజీ షేక్ హసన్ బాషా వివరించారు. ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికుల సంక్షేమం, సౌకర్యాల కోసం రాష్ట్ర హజ్‌కమిటీ నిరంతరం కృషి చేస్తుందని హాజీ షేక్ హసన్ బాషా తెలిపారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం

- డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి
- ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా వేయని గొడ్డలిపార్టీ
- నేడు పారదర్శకంగా 16 వేలకు పైగా టీచర్ పోస్టు భర్తీ
- ఓర్వలేక జగన్ రెడ్డి విషపు మాటలు, సాక్షి మీడియాలో అసత్య కథనాలు
- అమాయకులను బలిచేసేలా పూటకో తప్పుడు మాట
- మాజీ సైనికుడు చక్రపాణి రెడ్డిపై కుప్పంలో వైసీపీ శ్రేణులు, సాక్షి ప్రతినిధుల దౌర్జన్యం దుర్మార్గం
- డీఎస్సీలో ఉద్యోగమే రాని రామకృష్ణ పేరిట అసత్య ప్రచారం
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజం

అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో విఫలమైన వైసీపీ ప్రభుత్వం, అభివృద్ధి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపి వేయడంతోపాటు, పోలవరం వంటి రాష్ట్రానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టుల పనులను కూడా ముందుకు తీసుకెళ్లలేకపోయారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు పెద్ద ఎత్తున రాకపోగా, అభివృద్ధి వేగం పూర్తిగా మందగించిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తమ తీర్పును అత్యంత స్పష్టంగా ఇచ్చారని కోటంరెడ్డి అన్నారు. వైసీపీని చిత్తుగా ఓడించి కేవలం 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేయడమే కాకుండా, కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారని తెలిపారు. మరోవైపు రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాట పట్టించాలనే నమ్మకంతో ప్రజలు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ఘన విజయాన్ని అందించారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం అమరావతి, పోలవరం సహా కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. దేశంలోనే ఇతర రాష్ట్రాలు అసూయపడే రీతిలో నేడు ఏపీకి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. రాబోయే 5-10 ఏళ్లలో విద్యార్థులు, యువత భవిష్యత్తు మహోద్భుతంగా మారబోతోంది. పారిశ్రామికంగా, ఉద్యోగాల కల్పనలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవనుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు.

### ఓర్వలేకనే విషప్రచారం

ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని జగన్మోహన్ రెడ్డికి అసలు డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా కూడా తెలియదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 148 రోజుల్లోనే, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకాన్ని డీఎస్సీ ఫైల్‌పై చేశారు. కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసింది. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు లేకుండా జరిగిన ఈ నియామకాలపై అందరూ ప్రశంసలు కురిపిస్తుంటే, ఓర్వలేని వైసీపీ దీన్ని 'దగా డీఎస్సీ' అంటూ విషం చిమ్ముతోంది. నిజానికి ఇది ప్రజా డీఎస్సీ, యువ డీఎస్సీ. ఇలాంటి పవిత్ర ప్రక్రియపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వైసీపీయే అసలైన దగాకోరు పార్టీ. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదు, పెట్టుబడులు రాకూడదనే ఏకైక దురుద్దేశంతో వైసీపీ అలజడులు రేపేందుకు ప్రయత్నిస్తోంది. అబద్ధాల పునాదులపై నడిచే సాక్షి పత్రిక, సాక్షి టీవీని అడ్డం పెట్టుకుని తప్పుడు కథనాలు ప్రసారం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి 15 రోజులకోసారి బెంగళూరు నుంచి తాడేపల్లికి రావడం, ప్రెస్‌మీట్ పెట్టి నోటికొచ్చినట్లు మాట్లాడి వెళ్లిపోవడం, ఆయన కింద ఉండే నేతలు దానికి వంతపాడటం అలవాటుగా మారింది. ప్రజాస్వామ్యంలో మంచి పనులు చేస్తే అభినందించాలి, లోపాలుంటే నిలదీయాలి. కానీ ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రతిష్టను బజారున పడేసేలా వైఎస్సార్‌సీపీ వ్యవహరిస్తుండటం అత్యంత బాధాకరం. ఈ కుట్రపూరిత ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని ఎమ్మెల్యే కోటంరెడ్డి కోరారు.

### మాజీ సైనికుడిపై వైసీపీ, సాక్షి గూండాయిజం

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి జాతిని రక్షించిన ఒక మాజీ సైనికుడిపై వైసీపీ నాయకులు, సాక్షి మీడియా ప్రతినిధులు సాగించిన దౌర్జన్యం అత్యంత హేయమైన చర్య. రాజకీయ దురుద్దేశంతో సైనికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే స్థాయికి వైఎస్సార్‌సీపీ దిగజారిపోయిందని మండిపడ్డారు. యావత్ దేశం సెల్యూట్ చేసే సైనిక సమాజానికి చెందిన చక్రపాణి రెడ్డి అనే మాజీ జవాన్‌పై ఇంతటి దాష్టీకానికి పాల్పడటం



క్షమించరాని నేరం. చక్రపాణి రెడ్డి నిబంధనల ప్రకారం ఎక్స్-సర్వీస్‌మెన్, స్పోర్ట్స్, ఈడబ్ల్యూఎస్ కోటాలో అత్యంత పారదర్శకంగా టీచర్ ఉద్యోగం సాధించారు. ఆయనకు వచ్చిన మెడల్స్, సర్టిఫికెట్లు అన్నీ పక్కాగా ఉన్నాయి. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో సాక్షి మీడియా ప్రతినిధులు కుప్పంలో చక్రపాణి రెడ్డి వద్దకు వెళ్లి, "నువ్వు సైనికుడివే కాదు.. నీ సర్టిఫికెట్లు దొంగవి" అంటూ బెదిరింపులకు దిగి దౌర్జన్యం చేయడం దుర్మార్గం. సర్టిఫికెట్లపై అనుమానాలు ఉంటే పోలీసులకో, జిల్లా కలెక్టర్‌కో ఫిర్యాదు చేయాలి తప్ప, విచారణ చేయడానికి సాక్షి టీవీ, వైసీపీ నేతలేమైనా దర్యాప్తు అధికారులా? అధికారం పోయినా ఇంకా గూండాయిజం చేస్తామంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు. మాజీ సైనికుడిపై దాడికి దిగి, బెదిరింపులకు పాల్పడిన వైసీపీ శ్రేణులు, సాక్షి ప్రతినిధులపై కఠిన సెక్షన్లతో నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి. వారిపై రౌడీషీట్లు తెరిచి, పీడీ యాక్ట్ కింద జైలుకు పంపాలని ఒక శాసన సభ్యుడిగా డిమాండ్ చేస్తున్నాను. తమ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఒక్క టీచర్ ఉద్యోగం ఇవ్వని జగన్మోహన్ రెడ్డి, నేడు కూటమి ప్రభుత్వం వేలాది ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేక విషం చిమ్ముతున్నారు. ఇకనైనా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకుని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను, యువత భవిష్యత్తును నాశనం చేసే నీచ రాజకీయాలు మానుకోవాలని కోటంరెడ్డి హితవు పలికారు.

### అబద్ధాల బండారం బట్టబయలు

మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు మేలు జరుగుతుంటే ఓర్వలేని వైసీపీ, సాక్షి మీడియా పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నాయి. వాస్తవాలతో ఏమాత్రం సంబంధం లేకుండా నిరాధార ఆరోపణలతో రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేముల రామకృష్ణ అనే అభ్యర్థి తప్పుడు సర్టిఫికెట్లతో అక్రమ మార్గంలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ సాధించారంటూ వైసీపీ, సాక్షి మీడియా దుష్ప్రచారం చేశాయి. తీరా ఆ రామకృష్ణ స్వయంగా మీడియా ముందుకు వచ్చి వాస్తవాలు వెల్లడించడంతో బండారం బయటపడింది. తాను పరీక్ష రాసిన మాట వాస్తవమే అయినా, సరిగ్గా ప్రిపేర్ కాకపోవడంతో అర్హత సాధించలేదని, తనకు అసలు ప్రభుత్వ ఉద్యోగమే రాలేదని రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ టీచర్ ఉద్యోగం చేసుకుంటూ మళ్లీ ప్రిపేర్ అవుతున్నానని చెప్పారు. తాను ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నట్లు నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్ విసరడం వైసీపీ నిరాధార ఆరోపణలకు చెంపపెట్టు. నిరుద్యోగులకు ఉపాధి దక్కకూడదనే దురుద్దేశంతో జగన్మోహన్ రెడ్డి ప్రోద్బలంతోనే మెగా డీఎస్సీ జరగకుండా హైకోర్టులో ఏకంగా 335 కేసులు వేయించారు. అయితే న్యాయస్థానం ఆ పిటిషన్లను కొట్టివేయడమే కాకుండా పిటిషనర్లకు తీవ్రస్థాయిలో చివాట్లు పెట్టింది. ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలనుకునే గోబెల్స్ సిద్ధాంతాన్ని జగన్మోహన్ రెడ్డి నమ్ముకున్నారు. కానీ నేడు సోషల్ మీడియా, డిజిటల్ మాధ్యమాల ద్వారా సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతోందని, ప్రజల్లో చైతన్యం పెరిగిందని గుర్తుంచుకోవాలి. మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా ఆధారాలు, వాస్తవాలతో హుందాగా మాట్లాడటం నేర్చుకోవాలి. ప్రజలు ఆయన ప్రెస్‌మీట్లు, అవాస్తవ ప్రకటనలు చూసి నవ్వుకుంటున్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి మిగిలిన ఆ 11 సీట్లు కూడా దక్కకుండా చేస్తారని కోటంరెడ్డి హెచ్చరించారు.

### ఒక్కసారి ప్రెస్‌మీట్ పెడితే లక్ష ఓట్లు గల్లంతు

జగన్మోహన్‌రెడ్డి తన హోదాకు తగినట్లు హుందాగా, వాస్తవాలతో మాట్లాడటం నేర్చుకోవాలని, లేనిపక్షంలో వైసీపీకి మిగిలిన ఆ కాస్త ఆదరణ కూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై బురదజల్లే యత్నాల్లో భాగంగా చేసిన ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలని ఆధారాలతో సహా ఆయన బట్టబయలు చేశారు. జగన్మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చి ఒక ప్రెస్‌మీట్ పెడితే చాలు.. పార్టీకి కనీసం ఒక లక్ష ఓట్లు నష్టం జరుగుతోందని వైసీపీ నాయకులే స్వయంగా అంతర్గతంగా వాపోతున్నారు. గతంలో ఆయన నాయకత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో, హితవు కోరి చెబుతున్నానని, ఇప్పటికైనా అసత్యాలు మాట్లాడటం మానుకోవాలని కోటంరెడ్డి సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని డీఎస్సీల ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాలు అందబోతున్నాయని, వైసీపీ చేస్తున్న తప్పుడు, విష ప్రచారాలను ప్రజలెవరూ నమ్మవద్దని కోటంరెడ్డి పిలుపునిచ్చారు.

## 43వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 1,30,402 ఇళ్లను సందర్శించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తంగా 1.06 కోట్ల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చడం, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 43వ రోజు సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది.

43వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 1,30,402 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు.



కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1.06 కోట్ల ఇళ్లు సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు.

రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా, ప్రజా భాగస్వామ్యంతో విస్తృతంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు.

# మెగా డీఎస్సీపై విషం కక్కుతున్న వైసీపీ

- ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం
- తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- యువత భవిష్యత్తుపై కుట్రలు, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి
- కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నవశకంలోకి అడుగుపెట్టి, అన్ని రంగాల్లోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కడప శాసనసభ్యురాలు రెడ్డెప్పగారి మాధవిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని ఆమె మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు పనులు పరుగులు తీస్తున్నాయి, రాజధాని అమరావతి నిర్మాణం వేగవంతమయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. భారీ ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే, యువతకు భవిష్యత్తు దక్కుతుంటే చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు అడ్డంకులు సృష్టించాలని చూస్తున్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ దాకా వెళ్లి రాష్ట్రాన్ని భయపెట్టే యత్నాలు చేసినా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పనితీరుపై నమ్మకంతో ముందుకు వస్తున్నారు. అమరావతిని, పోలవరాన్ని, పెట్టుబడులను గానీ ఆపే సత్తా వైకాపాకు లేదని ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు.

## రాజకీయ ఉనికిపై భయంతోనే..

భవిష్యత్తులో తమకు రాజకీయ ఉనికి ఉండదన్న భయంతో డీఎస్సీ పరీక్షల మీద వైకాపా అసత్య ఆరోపణలు చేస్తోంది. 1995కు ముందు ఇంటర్వ్యూల పేరుతో అవకతవకలు జరిగే పద్ధతిని రద్దు చేసి, ప్రతిభ ఆధారంగా నియామకాలు జరగాలని 1998లో పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తెచ్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడుది. రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన 10 డీఎస్సీలలో 7 డీఎస్సీలను తెలుగుదేశం ప్రభుత్వమే విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న సుమారు 1.80 లక్షల మంది ఉపాధ్యాయుల్లో దాదాపు 70 శాతం మంది టీడీపీ హయాంలోనే మెరిట్ ఆధారంగా ఎంపికైనవారే. గతంలోలాగే మెగా డీఎస్సీ 2025ని కూడా ఎంతో పారదర్శకంగా, నిక్కచ్చిగా నిర్వహించాం. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవని బయటి ప్రపంచానికి చిత్రీకరించేందుకు వైకాపా దిగజారుడు రాజకీయాలు చేస్తోంది. గంజాయి బ్యాచ్‌లను, రోడ్డు ప్రమాదాల్లో పేదల ప్రాణాలు తీసే నేరగాళ్లను పరామర్శిస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? 'పేటీఎం బ్యాచ్'లను అడ్డం పెట్టుకుని ముఖ్యమంత్రిపై, మంత్రి నారా లోకేష్‌పై సొంత మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేయిస్తున్నారు. ప్రజలను ఎల్లకాలం మభ్యపెట్టలేరని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అబద్ధాలతో అడ్డుకోలేరని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ప్రజలే వైకాపాకు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

## హాయ్‌ల్యాండ్ పాపాలు దాచలేకే ఈ డైవర్షన్ డ్రామాలు

ఐదేళ్ల తమ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా తీయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ఈరోజు పారదర్శకంగా పూర్తయిన మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మాధవిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పరీక్షల్లో చేసిన ఘోరమైన అక్రమాలు సీఐడీ విచారణలో బయటపడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎస్సీపై నిరాధారమైన వైసీపీ రాద్ధాంతం చేస్తోందని ఆమె మండిపడ్డారు. ఐదేళ్లలో వైసీపీ ఒక్క పరీక్ష పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదు. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని కించపరుస్తూ స్కూళ్లలో బాత్‌రూమ్‌ల ఫోటోలు తీయించారు, మద్యం షాపుల ముందు క్యూలైన్లలో నిలబెట్టి మరీ డ్యూటీలు వేయించిన ఘనత వైసీపీదే. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే చేశారు. కేవలం 148 రోజుల్లోనే నోటిఫికేషన్ నుంచి పరీక్షలు, కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, రిజర్వేషన్లు, స్పోర్ట్స్-మిలిటరీ కోటాల అమలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వరకు అన్నీ పూర్తి చేసి 16 వేల మందికి పైగా నిరుద్యోగులకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందించారు. తద్వారా లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో సాగిన భారీ కుంభకోణంపై సీఐడీ విచారణ జరుగుతోంది. హైదరాబాద్‌లోని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి ఆన్సర్ షీట్లు ట్యాంపరింగ్ చేయడమే కాకుండా, కోర్టు మొట్టికాయలు వేసినా హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో సరైన సెక్యూరిటీ లేకుండా దాదాపు 60 రోజులు ఉంచారు. ఇళ్లలోని డ్రైవర్లు, అటెండర్లతో పేపర్లు దిద్దించి 160 మందికి పైగా గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తును నాశనం చేసిన పాపం వైసీపీది. ఈ దారుణాలు బయటపడుతుండటంతోనే ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు కూతలు కూస్తున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి నియామకాలు ఆపడానికి వైసీపీ దాదాపు 300 కేసులు వేయగా, కోర్టులు మొట్టికాయలు వేశాయి. చివరికి ఆ పార్టీ ఎమ్మెల్సీకే న్యాయస్థానం హెచ్చరికలు జారీ చేసింది. మొదట పేపర్ లీక్ అన్నారని, తర్వాత అధికారులు కుమ్మక్కయ్యారని, ఇప్పుడు స్పోర్ట్స్ కోటా అంటూ ఒక్కోసారి ఒక్కో మాట మారుస్తూ వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. మీడియా ముందుకు తీసుకొచ్చి వీడియోలు పెట్టిస్తున్న వ్యక్తులంతా బోగస్ అభ్యర్థులని తేలిపోతోంది. ఎంతో కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు చేస్తూ గౌరవంగా బతుకుతున్న టీచర్లపై వైసీపీ నాయకులు, వారి అనుకూల మీడియా విచక్షణారహితంగా వేధింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒకరి వ్యక్తిగత వివరాలను ప్రశ్నించడానికి, వారిపై దాడి చేయడానికి వీరికి ఏ అధికారముంది? ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ పర్యవేక్షణలో, గ్రీవెన్స్ సెల్ ద్వారా ప్రతి అభ్యంతరం పరిష్కరించి నూటికి నూరు శాతం పారదర్శకంగా పూర్తి చేసిన డీఎస్సీపై ప్రజల్లో తప్పుడు అపోహలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, వైసీపీ చేస్తున్న ఈ తప్పుడు డ్రామాలను ప్రజలంతా నిశితంగా గమనిస్తున్నారని మాధవిరెడ్డి హెచ్చరించారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి

మెగా డీఎస్సీపై లేనిపోని అపోహలు సృష్టిస్తూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు వైసీపీ తీవ్రస్థాయిలో దిగజారి ప్రవర్తిస్తోందని మాధవిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా బోగస్ వ్యక్తులతో వీడియోలు సృష్టించి ప్రభుత్వాన్ని, వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తున్న వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో పోటీ పరీక్షలు రాయాలనుకుంటున్న యువతను మానసికంగా కుంగదీయడమే లక్ష్యంగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోంది. రేపు 2029 ఎన్నికల్లో ఒకవేళ వైకాపా వస్తే తమ భవిష్యత్తు ఏమవుతుందోనని డీఎస్సీ రాసిన అభ్యర్థులు, యావత్ ప్రజానీకం ఇప్పటికే స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఇలాంటి విధ్వంసకర ఆలోచనలు ఉన్న పార్టీ రాష్ట్రానికి అవసరమా అని ప్రజలే రేపటి ఎన్నికల్లో నిలదీయడం ఖాయం. ఎవరెవరికో డబ్బులు ఇచ్చి కెమెరాల ముందుకు తీసుకువచ్చి అసత్యాలు మాట్లాడే సంస్కృతికి వైసీపీ తెరతీసింది. అసలు ఉద్యోగం రాని వ్యక్తికి జాబ్ వచ్చిందని, ఎవరో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి మార్కులు వేశారని, ఎవరో తనను సంప్రదించారని ఏ సంబంధం లేని కథలను ప్రచారం చేస్తున్నారు. రాధిక అనే అమ్మాయి ఒకరి పేరు ప్రస్తావిస్తూ ఈడబ్ల్యూఎస్ కోటాలో అక్రమంగా ఉద్యోగం వచ్చిందని ఎలాంటి నిబద్ధత, ప్రాథమిక ఆధారాలు లేకుండా వీడియోలు వదలడం ఎంతవరకు సమంజసం? నిజానిజాలు సరిచూసుకోకుండా, కనీస ఆధారాలు లేని ఇలాంటి కల్పిత కథనాలను ప్రసారం చేస్తున్న మీడియా సంస్థలకు, వాటి వెనుక ఉండి నడిపిస్తున్న వైసీపీ నాయకులకు అసలు ఇంగితజ్ఞానం ఉందా అని ప్రశ్నిస్తున్నాం. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. ఆడ, మగ అనే తేడా లేకుండా నిరాధార ఆరోపణలతో వ్యవస్థలను అస్థిరపరుస్తున్న వ్యక్తులపై తక్షణమే కేసులు నమోదు చేయాలి. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతూ, పారదర్శకంగా జరిగిన నియామక ప్రక్రియపై విషం చిమ్ముతున్న కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టే వరకు కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయదని మాధవిరెడ్డి స్పష్టం చేశారు.

## అబద్ధాలు బట్టబయలు

మెగా డీఎస్సీపై పనిగట్టుకుని చేస్తున్న గోబెల్స్ ప్రచారం బట్టబయలవుతోందని, అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేసినంత మాత్రాన అది నిజం అయిపోదని మాధవిరెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో వేముల రామకృష్ణ అనే వ్యక్తి ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడని, ఫేక్ ఐడీలతో అక్రమంగా మార్కులు వేయించుకుని జాబ్ కొట్టాడని ఒక అమ్మాయి స్క్రిప్ట్ ప్రకారం మాట్లాడిన వీడియోలను సదరు మీడియా సంస్థ ప్రసారం చేసింది. తీరా చూస్తే స్వయంగా ఆ వ్యక్తే మీడియా ముందుకు వచ్చి "నేనే వేముల రామకృష్ణని, నేను అసలు డీఎస్సీలోనే సెలెక్ట్ కాలేదు, నేను టీచర్ ఉద్యోగమే చేయట్లేదు" అని స్పష్టం చేశారు. అసలు ఉద్యోగమే రాని వ్యక్తి పేరును తెరపైకి తెచ్చి ఇంతటి దారుణమైన అబద్ధాలను ప్రచారం చేస్తారా? గత ఐదేళ్ల వైకాపా పాలనలో "జగన్ మామయ్య లేకపోతే బతకలేం, చచ్చిపోతాం" అంటూ కెమెరాల ముందుకు వచ్చి కన్నీళ్లు పెట్టుకున్న పేటీఎం బ్యాచ్ డ్రామాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు అధికారం పోయేసరికి అదే పేటీఎం బ్యాచ్‌తో డబ్బులు ఇచ్చి కుట్రపూరితంగా వీడియోలు చేయిస్తూ కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. ఈ అసత్యాలను ప్రసారం చేస్తున్న టీవీ ఛానెల్‌ను ఆ పార్టీకి చెందిన సలహాదారులే భారీగా పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేశారన్న వార్తలు సోషల్ మీడియాలో, పత్రికల్లో పెద్ద ఎత్తున వస్తున్నాయి. బాధిత వ్యక్తే స్వయంగా తనకు ఉద్యోగం రాలేదని మొరపెట్టుకుంటున్నా, ఇంకా ఫేక్ న్యూస్‌ను ప్రసారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న మీడియా తీరు అత్యంత గర్హనీయం. ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చేందుకు, ప్రజలను మభ్యపెట్టేందుకు సాగిస్తున్న ఈ దుష్ప్రచారాలను ప్రజలు, నిరుద్యోగులు గమనిస్తున్నారని, తప్పుడు వీడియోల వెనుక ఉన్న అసలు సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే వరకు ఉపేక్షించేది లేదని మాధవిరెడ్డి హెచ్చరించారు.

## ఓర్వలేకపోతున్న వైసీపీ

మెగా డీఎస్సీలో ప్రతిభతో ఎంపికై విధుల్లో చేరిన పేద, మధ్యతరగతి వర్గాల అభ్యర్థులపై బురదజల్లుతూ ఫేక్ వీడియోలతో కుట్రలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై మాధవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో ప్రభుత్వం మరోమారు ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించాలన్న పట్టుదలతో చదువుకుంటున్న నిరుద్యోగ యువత మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఇలాంటి ఫేక్ వీడియోలు మళ్లీ ప్రసారం చేయడానికి భయపడేలా చట్టాలు, శిక్షలు ఉండాలి. ఉద్యోగాలు సాధించిన వారికి అసలు టెట్ అర్హతే లేదని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఉదాహరణకు కళ్యాణి అనే అభ్యర్థి 2018లోనే టెట్ క్వాలిఫైయింగ్ మార్కులు 75 సాధించారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల వైసీపీ పాలనలో డీఎస్సీ వేయకపోవడంతో కూలి పనులు చేసుకునేవారు, ఆటో కార్మికుల కుటుంబాలు తినితినక పిల్లల కోచింగ్‌ల కోసం అప్పులు చేసి ఎదురుచూశాయి. కూటమి ప్రభుత్వం రాగానే తొలి సంతకంతో 148 రోజుల్లో 16 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసి ఆ కుటుంబాల్లో ఆనందం నింపితే, ఆ ఆనందాన్ని ఓర్వలేక వైకాపా విషం చిమ్ముతోంది. ఒకే కేటగిరీ కింద లేదా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన టీచర్లు ఒకే పాఠశాలలో పనిచేయకూడదనే నిబంధన ఎక్కడా లేదు. కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన కర్ణాటక సరిహద్దు మండలాలైన కౌతాళం, హోలహర్వి, హోళగుంద, కోసిగి ప్రాంతాల్లో తీవ్ర ఉపాధ్యాయ కొరత ఉంది. అందుకే అక్కడ స్కూళ్లలో విద్యార్థుల చదువు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ప్రాధాన్యతనిచ్చి, స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఎస్జీటీలను ఆ వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించడం జరిగింది. వెనుకబడిన రాయలసీమ, కర్నూలు, కడప ప్రాంతాల పిల్లలు ఉద్యోగాలు సాధించి నిలదొక్కుకోవడం వైసీపీకి ఇష్టం లేదా? వీరంతా ఎప్పటికీ పేదరికంలోనే ఉంటూ కేవలం బటన్లు నొక్కితే వచ్చే దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడి బతకాలా? గతంలో 2006 డీఎస్సీ పరీక్షల సమయంలో కడప జిల్లాలో పేపర్లు ట్యాంపరింగ్ చేసి అవకతవకలకు పాల్పడటంతో ఫలితాలు రెండేళ్లు ఆలస్యమై, కోర్టు కేసులు, క్రిమినల్ కేసులతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం కేవలం 148 రోజుల్లోనే ఏ కోర్టు వివాదాలు లేకుండా, బడుగు, బలహీన వర్గాలకు, వెనుకబడిన ప్రాంతాల వారికి న్యాయం చేస్తూ పారదర్శకంగా నియామకాలు పూర్తి చేసింది. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతూ, వెనుకబడిన జిల్లాల యువత ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్న వైకాపా కుట్రలను ప్రజలంతా స్పష్టంగా గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలతో వ్యవస్థలను భ్రష్టు పట్టించాలని చూస్తే చట్టం ఊరుకోదని ఎమ్మెల్యే మాధవిరెడ్డి హెచ్చరించారు.

# యువత భవిష్యత్తుతో జగన్ చెలగాటం

- పారదర్శక మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు
- పేటీఎం బ్యాచ్‌తో సొంత మీడియాలో ఫేక్ వీడియోలు
- అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాబోయే డీఎస్సీని అడ్డుకునే కుట్ర
- గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏ మంచి పని చేసినా అడ్డుకోవడం, తప్పుడు ప్రచారం చేయడమే పనిగా జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీలు పెట్టుకున్నాయని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి మండిపడ్డారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై కూడా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎక్కడా లోసుగులు లేకుండా డీఎస్సిని 148 రోజుల్లో నిర్వహించాం. దాదాపు 16 వేల ఉద్యోగాలను రికార్డ్ టైంలో భర్తీ చేస్తే... ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని, ఒక్క డీఎస్సీ కూడా పెట్టలేని జగన్ రెడ్డి నేడు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీని అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. జాబ్ క్యాలెండర్, ఇళ్ల పట్టాలు, పేదలకు ఇళ్లు వంటి అనేక హామీలు ఇచ్చి జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తే... మేం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఏటా డీఎస్సీ నిర్వహించేలా ప్రణాళికలు రచించాం. యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే మెగా డీఎస్సీ నిర్వహించాం. 2026 మే నుంచి గొడ్డలి పార్టీ ఒక తమాషా ప్రారంభించింది. హై కోర్టుకు పోవడం పిల్ వేయడం, కోర్టు కొట్టేయడం, వైసీపీ నాయకులకు చివాట్లు పెట్టడం షరా మామూలుగా మారింది. ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వంపై డిక్టేటర్ షిప్ అంటూ సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు చెప్పింది కూడా అర్థం చేసుకోలేని అజ్ఞానులు వైసీపీలో కొనసాగుతున్నారు. రాజకీయం చేయాలంటే చాలా అంశాలు ఉన్నాయి. కానీ మన పిల్లల భవిష్యత్‌పై జగన్ రెడ్డి దాడి చేస్తున్నాడు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఎలాంటి తప్పు జరగలేదని చెబుతున్నా కూడా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. సీబీఐ విచారణ దేనికి వేస్తారో కూడా తెలియని అసమర్థుడు జగన్ అని ఎమ్మెల్యే మాధవి దుయ్యబట్టారు.



### జగన్ రాజకీయమే ఫేక్

జగన్ రెడ్డి రాజకీయ జీవితమే ఒక ఫేక్. అందుకే ఆయనకు ప్రతిదీ ఫేక్ లా కనిపిస్తుంది. తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రభుత్వంచూస్తూ ఊరుకుంటుందా? కర్నూలు జిల్లాకు చెందిన భార్య, భర్తలు కరిష్మా, షేక్ ఇమామ్‌లపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఒక్క ఆధారం కూడా లేకుండానే డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చదువుతున్నప్పుడు మాత్రమే స్పోర్ట్ సర్టిఫికేట్ తెచ్చుకోవాలని ఏ రూల్ ప్రకారం ఉందో గొడ్డలి పార్టీ నాయకులు సమాధానం చెప్పాలి. భార్య ఒక కేటగిరి, భర్త మరో కేటగిరిలో ప్రతిభచాటారు. ఉద్యోగాలు తెచ్చుకున్నారు. భార్యాభర్తలు ఉద్యోగాలు పొందకూడదనే రూల్ ఎక్కడైనా ఉందా. పారదర్శకంగా ఉద్యోగాలు సాధించిన యువత జీవితాలతో గొడ్డలి పార్టీ రాజకీయం చేస్తోంది. దేశంలో 60 ఏళ్ల వయసు ఉన్న వాళ్లు కూడా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటుతున్నారు. గోల్డ్ మెడల్ సాధిస్తున్నారు. 41 ఏళ్ల కొరడా పద్మజా స్పోర్ట్స్ లో ప్రతిభ చాటిన మహిళ. అథ్లెటిక్ లో మెడల్ సాధించి ఉద్యోగం సాధిస్తే 41 ఏళ్లకి స్పోర్ట్స్ కోటా ఏమిటని మాట్లాడే గొడ్డలి పార్టీ నాయకులకు సిగ్గుండాలి. నిజాయితీగా ఉద్యోగాలు సాధించిన వారి పట్ల వైసీపీ ఎందుకు ఇంత విషపూరిత రాజకీయాలు చేస్తోంది.

రేపు భవిష్యత్‌లో జరగబోయే మరో డీఎస్సీని అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. ప్రతి ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి లోకేష్ ప్రకటించారు. రాబోయే డీఎస్సీ నియామకాలను తప్పుబట్టి యువతకు ఉద్యోగాలు సాధించకుండా అడ్డుకునే కుట్రకు జగన్ తెర తీశాడు. యువత అంతా మరో డీఎస్సీ కోసం సిద్ధమవుతుంటే... దానిని అడ్డుకునేందుకు జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లతో ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష పత్రాలు దిద్దించారు. గ్రూప్ 1 తప్పిదాలపై జగన్ రెడ్డి రాజీనామా చేసి రాజకీయాలు వదిలేస్తాడా అనేది సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పాలి. సొంత పార్టీ నాయకులతో డీఎస్సీ పరీక్షలు రాయించి, వారిచేతనే నేడు తప్పుడు ఆరోపణలు చేస్తూ డ్రామాలు ఆడుతున్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో సానుభూతి రాకపోగా... ఇంకా కిందికి పడిపోతారు. యువత జీవితాలతో ఆడుకోవద్దని జగన్ రెడ్డిని కోరుతున్నాం. ప్రతి ఏటా నిర్వహించే డీఎస్సీలో యువత ఉద్యోగాలు సాధిస్తారు. కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు, లోకేష్‌ల విధానాలపై మాట్లాడే అర్హత జగన్ కు లేదు. ప్రజలు జగన్ రెడ్డిని అన్ని విధాలుగూ ఛీ కొడుతున్నారని ఎమ్మెలే మాధవి ధ్వజమెత్తారు.

## 913 ఆశా పోస్టుల భర్తీకి ఆమోదం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 1,294 పోస్టుల భర్తీ

అమరావతి (చైతన్యరథం): ప్రజల ముంగిటకు వైద్య సేవలు చేరవ చేయడంలో కీలకంగా వ్యవహరించే ఆశా ( సామాజిక ఆరోగ్య కార్యకర్త-అక్రిడేటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) కార్యకర్తల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీటి భర్తీతో రాష్ట్రంలోని ఆశా పోస్టులన్నీ భర్తీ అయినట్లవుతుందని పేర్కొన్నారు. జీరో వెకెన్సీ విధానంలో ఈ పోస్టుల భర్తీ చేపడుతున్నామని తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల్లో 1,294 ఆశా పోస్టులను భర్తీ చేశామని, తాజా 913 పోస్టులతో కలిపితే మొత్తం 2,207 పోస్టులు భర్తీ చేసినట్లవుతుందని మంత్రి తెలిపారు. తాజా ఖాళీల్లో 673 గ్రామీణ, 64 గిరిజన, 176 పట్టణ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు.

### డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా...

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీ జరగనుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళల్లో పదో తరగతి కనీస అర్హత కలిగి, 25-45 ఏళ్ల మధ్య వయసున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నియమ నిబంధనలను అనుసరించి ఈ నెల 30వ తేదీ నాటికి నియామకాల జాబితాను పంపించాలని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు.




### జిల్లాల వారీగా పోస్టుల వివరాలు

జిల్లాల వారీగా చూస్తే...అనకాపల్లిలో 77, కర్నూలులో 65, తూర్పుగోదావరిలో 44, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 43, పార్వతీపురం మన్యంలో 43, పశ్చిమగోదావరిలో 42, అన్నమయ్యలో 41, ప్రకాశంలో 38, వైఎస్సార్ కడపలో 38, కృష్ణాలో 37, విశాఖపట్నంలో 33, చిత్తూరులో 32, కోనసీమలో 32, పల్నాడులో 31, విజయనగరంలో 31, కాకినాడలో 29, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరులో 29, ఏలూరులో 27, అనంతపురంలో 26, మార్కాపురంలో 25, శ్రీ సత్యసాయి జిల్లాలో 22, శ్రీకాకుళంలో 22, గుంటూరులో 21, నంద్యాలలో 21, పోలవరంలో 21, తిరుపతిలో 21, ఎన్టీఆర్ జిల్లాలో 15, బాపట్లలో 7 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

### నెలకు రూ 10,000 వేతనం

ఒక్కో ఆశా కార్యకర్తకు నెలకు రూ.10 వేల చొప్పున వేతనం లభిస్తుంది. ఇందులో రూ.8,320 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ద్వారా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి ఏడాది ఆశా కార్యకర్తలకు వేతనాల రూపంలో రూ.513 కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.426.84 కోట్ల వరకు భరిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

## ఏపీ వక్ఫ్‌బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

- త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- కొత్త వ్యవస్థను ప్రారంభించడమే కాదు.. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి
- వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారిక ప్రారంభానికి ముందే సిబ్బందిని కొత్త వ్యవస్థ వినియోగానికి సిద్ధం చేస్తున్నామని, తద్వారా పరిపాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బంది లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఈఈ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ తోటకు ఓటమి భయం పట్టుకుంది

- అందుకే మున్సిపల్ ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు
- మీ భయాన్ని నిజం చేసే బాధ్యత నాది : ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట (చైతన్యరథం): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ఓటమి భయం పట్టుకుందని, అందుకే మున్సిపల్ ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమరావతి నుంచి ఫోన్ ద్వారా మీడియాతో మాట్లాడుతూ... త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ మండపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌తో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని తెలిపారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేదని, మున్సిపల్ ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన అంశాలతో దాఖలైన ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించకుండానే కొట్టివేసిందన్నారు. ఇటీవల మండపేటలో పెద్దకాలువ వద్ద ఒక వివాదాన్ని తెరపైకి తెచ్చి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదన్నారు. లబ్ధిదారులకు న్యాయం చేసిన తర్వాతే అక్కడ అభివృద్ధి పనులు చేపట్టామనే విషయాన్ని పట్టణ ప్రజలంతా గమనించారని, దీంతో రాజకీయంగా ఏదో సాధించాలనుకుని వారే అడ్డంగా బుక్కయ్యారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తుండటంతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకి ఓటమి భయం మరింత పెరిగిందన్నారు. మండపేటలో జరుగుతున్న అభివృద్ధిని చూసి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో దారుణ పరాభవం తప్పదనే భయంతోనే ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వేగుళ్ల మండిపడ్డారు. త్వరలోనే వారి భయాన్ని నిజం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ మెజారిటీతో విజయం సాధించి, వారి భయాన్ని అక్షరాలా నిజం చేసి చూపిస్తామని వేగుళ్ల స్పష్టం చేశారు.

# కోటి మట్టి గాజులతో మహాగణపతి... 89 అడుగుల అద్భుత రూపం





విశాఖపట్నం (చైతన్యరథం): వినాయక చవితి పండుగ వేళ సాగరతీరం విశాఖ సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. ఎన్నో రకాల రూపాల్లో గణనాథులు కొలువుదీరుతున్న వేళ.. గాజువాకలో ఏర్పాటవుతున్న మహాగణపతి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. అక్షరాలా కోటి మట్టి గాజులతో, ఏకంగా 89 అడుగుల ఎత్తులో రూపుదిద్దుకుంటున్న శ్రీ దివ్య కంకణ అలంకార మహాగణపతి భక్తులకు కనువిందు చేసేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాడు.

దేశవ్యాప్తంగా వినాయక చవితి సందడి మొదలైంది. వాడ వాడలా వినాయక పందిళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. విశాఖలోనూ గణనాథులకు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎక్కడ ఎలా ఉన్నా.. గాజువాకలో కొలువుదీరే మహాగణపతి ప్రత్యేకతే వేరు. కోటి మట్టి గాజులతో శ్రీదివ్య కంకణ అలంకార మహాగణపతి రూపుదిద్దుకుంటున్నాడు. గాజువాకలో కోటి గాజులతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దివ్య కంకణ అలంకార మహా గణపతి రూపంలో వినాయకుడు కొలువు దీరనున్నాడు. ఇందుకోసం కోటి మట్టి గాజులతో మహాగణపతిని అలంకరిస్తున్నారు. పర్యావరణహితంగా 89 అడుగుల్లో రూపుదిద్దుకుంటున్న ఈ కంకణ అలంకార మహా గణపతికి.. తుది మెరుగులు దిద్దుతున్నారు. వినాయక చవితి నుంచి అక్టోబర్ 4కు 21 రోజులపాటు భక్తులకు దర్శనమిస్తారు ఈ కంకణ అలంకార మహాగణపతి.

**ఫిరోజాబాద్ నుంచి మట్టి గాజులు**

శ్రీ దివ్య కంకణ అలంకార మహా గణపతి కోసం కోటి మట్టి గాజులను యూపీ నుంచి తెప్పించారు. మట్టి గాజులకు ప్రసిద్ధి చెందిన ఫిరోజాబాద్ నుంచి రంగు రంగుల గాజులను తెచ్చి అలంకరిస్తున్నారు. ఆకుపచ్చ, గులాబీ, పసుపు, మెరూన్ రంగుల గాజులను వినియోగిస్తున్నారు. ఇందుకోసం కళాకారులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కళాకారుడు ఆరిపాక కృష్ణ ఆధ్వర్యంలో 89 అడుగుల మహాగణపతిని అందంగా తీర్చిదిద్దుతున్నారు.

**పర్యావరణహితంగా..**

కంకణ అలంకార మహాగణపతి పర్యావరణహితంగా రూపుదిద్దుకోవడం విశేషం. మట్టి, కొబ్బరి పీచు, వెదురు బొంగులను వినియోగిస్తున్నారు. తల భాగం, రెండు హస్తాలు, రెండు పాదాలు మట్టి, కొబ్బరి పీచు సహజ సిద్ధ రంగులతో తీర్చిదిద్దుతున్నామని నిర్వాహకులు గణేష్ కుమార్ తెలిపారు. మిగిలిన భాగమంతా మట్టి గాజులతో అలంకరిస్తున్నట్లు చెప్పారు. ఇక కిరీటం, ఆభరణాలు కోల్‌కత్తా నుంచి తెప్పించారు. కోటికిపైగా గాజులను ఉపయోగించి.. శ్రీ దివ్య కంకణ అలంకార మహా గణపతి విగ్రహం ఎత్తు 89 అడుగుల అయినా.. బేస్ నుంచి పై వరకు 109 అడుగులు పొడవు అవుతుంది. నిమజ్జనం కూడా ప్రతిష్టించిన చోటే చేస్తారు. 21 రోజుల పాటు పూజలు చేసి నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం సందర్భంగా అలంకరించిన కోటి మట్టి గాజులను భక్తులకు అందజేస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

# నర్సీపట్నంలో ఆకట్టుకున్న యువత ఫ్లాష్‌మాబ్.. 'జయహో బీసీ' సభకు ముస్తాబు



నర్సీపట్నం (చైతన్యరథం): పట్టణంలో జరగనున్న 'జయహో బీసీ' భారీ బహిరంగ సభను పురస్కరించుకుని స్థానిక యువత నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. సభ కోసం ప్రత్యేకంగా రూపొందించిన బీసీ పాటకు శ్రీకన్య కూడలి, పాల్ గాట్ సెంటర్ వద్ద యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో యువత చేసిన ఈ డ్యాన్సులు ప్రజల దృష్టిని ఆకర్షించడంతో పాటు, రాబోయే సభపై మరింత ఉత్సాహాన్ని, ఆసక్తిని రేకెత్తించాయి. మరోవైపు ఈ మహాసభ కోసం నర్సీపట్నం మొత్తం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పట్టణమంతా పచ్చ తోరణాలు, భారీ కటౌట్లతో అలంకరించారు. ముఖ్యంగా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేష్ చిత్రాలతో పాటు బీసీ సభ లోగోతో ఆకాశంలో ఏర్పాటు చేసిన భారీ బెలూన్లు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సభకు వచ్చే శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా పట్టణమంతా ఎటుచూసినా పండుగ వాతావరణం నెలకొంది. సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ జయహో బీసీ సభ అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని స్టేడియంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను ముమ్మరంగా పూర్తి చేస్తున్నారు.

# రాష్ట్ర రైతుల నీటి హక్కుల కోసం 'ఆళ్ళ' కృషి అభినందనీయం

- కె.ఎల్.యూనివర్సిటీ అల్యూమిని మీట్‌లో 'ఆళ్ళ' ను ఘనంగా సన్మానించిన కె.ఎల్.యు. యాజమాన్యం



గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాజెక్టుల్లో రైతుల నీటి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న కె.ఎల్.యు పూర్వ విద్యార్థి, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు కృషి అభినందనీయమని కె.ఎల్. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లోని కె.ఎల్ యూనివర్సిటీ బాచుపల్లి క్యాంపస్ లో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కె.ఎల్.యు అల్యూమిని మీట్ జరిగింది. సమావేశంలో సమాజం కోసం కృషిచేసిన పూర్వ విద్యార్థులు, అల్యూమిని సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి యాజమాన్యంలో రైతుల భాగస్వామ్యం కోసం విశేషంగా కృషి చేస్తున్న పూర్వ విద్యార్థి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావును కె.ఎల్.ఇ.ఎఫ్. ఉపాధ్యక్షురాలు కోనేరు నిఖిల, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ తదితరులు 'ఆళ్ళ'ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్ వర్మ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగంపై విశేష అనుభవం ఉన్న మా పూర్వ విద్యార్థి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఇంజనీరుగా, జల వనరుల రంగ నిపుణులుగా, ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాజెక్టుల్లోని నీటి హక్కులపై కృష్ణానది యాజమాన్య బోర్డు, కేంద్ర జలసంఘంతో సంప్రదింపులు జరుపుతూ నిత్యం కృషి చేస్తున్నారని, అలాగే నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు ఆరుతడి పంటలకు సాగునీరు రావటానికి విశేషంగా కృషి చేశారని, ఇలాంటి వ్యక్తులు మా కె.ఎల్.యు. అల్యూమిని సభ్యులుగా ఉండటం మాకెంతో గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో కె.ఎల్.యు. అల్యూమిని రిలేషన్స్ అధిపతి డాక్టర్ కె.పి.హెచ్ శ్రీకావ్య, యూనివర్సిటీ ప్రో-వైస్ ఛాన్సలర్ వెంకట్రామన్, అల్యూమిని సభ్యులు గొరిపర్తి వెంకటరమణ, పొట్లూరి శ్రీధర్, డాక్టర్ బద్రీనాథ్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సౌకర్యాల విస్తరణకు కట్టుబడి ఉన్నాం : ఎంపీ శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గం 10వ డివిజన్ విజయవాడ తూర్పు నియోజకవర్గం 10వ డివిజన్ పడమట పరిధిలోని మారుతి కోఆపరేటివ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమ్యూనిటీ హాల్‌ను స్థానిక శాసనసభ్యులు గద్దె రామమోహన్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... స్థానిక ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ భవనం స్థానిక ప్రజలకు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలు అందుబాటులో ఉండటం సమాజ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని ఎంపీ పేర్కొన్నారు. కమ్యూనిటీ హాళ్లు వంటి సౌకర్యాలు ప్రజలకు సామాజిక కార్యక్రమాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్‌లో ప్రజా సౌకర్యాల విస్తరణకు, మౌలిక వసతుల కల్పనకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజల సామాజిక అవసరాలకు ఉపయోగపడే ఇలాంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని ఎంపీ పేర్కొన్నారు.

# వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జీవీఎంసీ జోన్ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపుతున్నామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని 82వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. 82వ వార్డులో 41 అభివృద్ధి పనులకు రూ. 16.59 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. వార్డులోని విజయరామరాజుపేట, శ్రీరామ్ నగర్ కాలనీ, పెద్దరెల్లి వీధి, చవితిన వీధి, నర్సింగరావుపేట ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీలో రూ. 45 లక్షలతో కమ్యూనిటీ హాలు, పెదరెల్లి వీధిలో రూ. 75 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పరిశుభ్రత కోసం ఉమ్మడి నిబద్ధతను తెలిపే ఓ ఉద్యమం 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్'

●స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



విజయవాడ (చైతన్యరథం): స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ అనేవి కేవలం పోటీ కోసం కాదని, పరిశుభ్రత కోసం ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబించే ఓ ఉద్యమం అని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడ ప్రసాదంపాడులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో సోమవారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్- 2026కు సంబంధించి శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. ఆరోగ్యకరమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకోవడానికి పరిశుభ్రత అనేది మనం ప్రతిరోజూ కలిసి కట్టుగా అలవర్చుకునే ఒక అలవాటు అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పరిశుభ్రతపై స్వచ్ఛ ఆంధ్ర మిషన్(ఎస్ఏఎం) ఓ అంచనాను రూపొందిస్తోందని తెలిపారు. మన పని సంస్కృతిలో ఇది ఒక భాగమని, పరిశుభ్రతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి సంబంధించిన చర్య అన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండటం సుపరిపాలనకు సంకేతాలు మాత్రమే కాదని, ప్రజల పట్ల, పర్యావరణం పట్ల గౌరవానికి కూడా ఇది నిదర్శనమన్నారు.

**అక్టోబర్ 2న పురస్కారాలు**

"స్వచ్ఛ ఎంత అవసరమో పరిశుభ్రత కూడా అంతే అవసరం" అన్న మహాత్మా గాంధీ దార్శనికతను మనం గౌరవించే గొప్ప ప్రాముఖ్యత కలిగిన రోజు, 2026, అక్టోబర్ 2న ఈ పురస్కారాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అవార్డులు అందజేస్తారని చెప్పారు. దేశంలో మన రాష్ట్రమే ఈ అవార్డులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యంలో అత్యుత్తమ పనితీరును గుర్తించి, పురస్కారాలు అందిస్తారని చెప్పారు. సంస్థలు, పరిపాలనా విభాగాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతలో ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి, పరిశుభ్రతను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడం తమ లక్ష్యంగా పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీలు), గ్రామ పంచాయతీల నుండి పాఠశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల వరకు ప్రతి ఒక్క సంస్థను భాగస్వామిని చేస్తామన్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, హాస్టళ్లు, స్వచ్ఛంద సంస్థలు వంటి వాటి పనితీరుని స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్- 2026 అవార్డుల కోసం అంచనా వేయడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, సాక్ష్యాధారాలతో, నిష్పక్షపాతంగా ఈ అంచనా ప్రక్రియ ఉంటుందని తెలిపారు. వ్యర్థాలను, వాటి మూలం వద్దనే వేరు చేయడం, పరిశుభ్రమైన మరుగు దొడ్లు, చేతులు కడుక్కునే సౌకర్యాలు, ఆసుపత్రులలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడం, పౌరులు/ఉద్యోగుల అభిప్రాయ సేకరణ, స్వతంత్ర తృతీయ పక్ష ధృవీకరణ ఆధారంగా విశ్వసనీయతను నిర్ధారిస్తారని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్రను ఒక నిజమైన ప్రజా ఉద్యమంగా మార్చడానికి మనమందరం ఏకమవుదామని చైర్మన్ పట్టాభిరామ్ పిలుపు ఇచ్చారు. ప్రతి శాఖ, స్థానిక సంస్థ, ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. మనం కలిసికట్టుగా పరిశుభ్రమైన నగరాలను, ఆరోగ్యకరమైన గ్రామాలను, సుస్థిరమైన కార్యాలయాలను సృష్టించగలమన్న విశ్వాసాన్ని ప్రకటించారు.

## సమర్థవంతమైన నాయకత్వమే టీడీపీ బలం

●లీడర్షిప్ కాంక్లేవ్‌లో భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం

●స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేయడంపై దృష్టి

●కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక లీడర్షిప్ కాంక్లేవ్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ నాయకత్వ పనితీరును సమీక్షించడంతో పాటు, మరింత చురుకైన నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పనితీరును సమీక్షించుకోవడం, ప్రజల ఆకాంక్షలను మరింత లోతుగా అర్థం చేసుకోవడం, వర్తమాన పరిస్థితులను విశ్లేషించి భవిష్యత్ కార్యాచరణకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ కాంక్లేవ్ వేదికగా నిలిచింది. నాయకులు తమ పనితీరును స్వయంగా విశ్లేషించుకుని, ప్రజలకు మరింత చేరువగా పనిచేసేలా దిశానిర్దేశం చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా సాగింది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు నాయకత్వాన్ని సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై కూడా కాంక్లేవ్‌లో ప్రత్యేకంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**నాయకత్వం అంటే పదవి కాదు... బాధ్యత**

31 ఏళ్ల క్రితం తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు.. నాడు దేశవ్యాప్తంగా సీఈఓగా పేరొందిన నాయకుడి నుంచి నేడు రాష్ట్రానికి నీటిని అందించే 'వాటర్‌మ్యాన్'గా గుర్తింపు పొందే స్థాయికి ఎదిగారు. పరిపాలనలో సాంకేతికత, విజన్‌కు ప్రాధాన్యమిచ్చిన నాయకత్వం నుంచి.. సాగునీరు, తాగునీరు, నదుల అనుసంధానం, జల వనరుల అభివృద్ధిని ప్రజా సంక్షేమంతో ముడిపెట్టిన నాయకత్వం వరకు ఆయన ప్రస్థానం కొనసాగుతోంది. నాయకత్వం అంటే పదవి కాదు.. ప్రజల కోసం నిరంతరం పనిచేసే బాధ్యత. ఆ బాధ్యతను ఆచరణలో చూపించిన చంద్రబాబునాయుడు నాయకత్వంలో.. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు సమిష్టిగా ముందుకు సాగాలని లీడర్షిప్ కాంక్లేవ్ పిలుపునిచ్చింది.

## గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది : ఎమ్మెల్యే బుద్ధా ప్రసాద్



అవనిగడ్డ (చైతన్యరథం): గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం ఆముదార్లంకలో పల్లె పండుగలో భాగంగా రూ. 85.70 లక్షలతో 1.45 కిలోమీటర్ల మేర నూతనంగా నిర్మించిన ఏడు సీసీ రోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలతో ఏర్పాటు చేసిన పైపు లైన్లు తన కుమారుడు మండలి వెంకట్ కలిసి ఆయన ప్రారంభించారు.

## హజ్ యాత్రికుల ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రికి వినతి



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ యాత్రికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు, హజ్ యాత్రకు సంబంధించిన విమాన ఛార్జీలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికులు ఎదుర్కొంటున్న అధిక విమాన ఛార్జీల భారం, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ అవసరం, ప్రయాణ సౌకర్యాలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. విజయవాడ నుంచి హజ్ యాత్రికులకు ఎంబార్కేషన్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రయాణ సమయం, ఖర్చు తగ్గడంతో పాటు రాష్ట్రంలోని హజ్ యాత్రికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని హాజీ షేక్ హసన్ బాషా వివరించారు. ఆంధ్రప్రదేశ్ హజ్ యాత్రికుల సంక్షేమం, సౌకర్యాల కోసం రాష్ట్ర హజ్ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని హాజీ షేక్ హసన్ బాషా తెలిపారు.

## వినుకొండలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

●నడుములోతు వరకు చేరిన వరదనీరు... పలు ప్రాంతాలు జలమయం

వినుకొండ (చైతన్యరథం): గత కొన్ని రోజులుగా వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినుకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు సోమవారం సాయంత్రం కురిసిన ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ఊరటనిచ్చింది. అయితే గంటకు పైగా కురిసిన వర్షంతో పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్, చెక్‌పోస్ట్ సెంటర్, ఇసుకవాగు సెంటర్ ప్రాంతాల్లో వరదనీరు నడుములోతు వరకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడగా, కొన్ని వాహనాలు నీటిలోనే నిలిచిపోయాయి. ప్రధాన రహదారులపై భారీగా నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడగా, పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. ఈ వర్షంతో వరి, పత్తి, మిర్చి తదితర పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా లీడర్‌షిప్ కాంక్లేవ్... హాజరైన ఛీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొన్నారు. పార్టీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించడం, పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కూడా లీడర్‌షిప్ కాంక్లేవ్‌కు హాజరయ్యారు. పార్టీ నాయకత్వం సూచనలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం, కార్యకర్తలతో సమన్వయం పెంచుకోవడం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ కాన్క్లేవ్ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం శాసనసభ్యులు బొండా ఉమా పాల్గొన్నారు. పార్టీ నాయకత్వ పటిమను పెంపొందించడం, పార్టీ సిద్ధాంతాలు, ప్రజలతో మరింత సమర్థవంతంగా మమేకం కావడం, కార్యకర్తలతో సమన్వయం, పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై ఈ రెండు రోజుల శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

# బుచ్చిలో కూటమి జెండా ఎగరడం ఖాయం

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధీమా



కోవూరు (చైతన్యరథం): బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను నిర్మించామని, వంతెనల పనులు చేపట్టామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెల్లడించారు. సొంత నిధులతో కూడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారాయణ కేటాయించిన నిధుల్లో రూ.16 కోట్లతో త్వరలో రోడ్డు పనులు ప్రారంభించబోతున్నామని, అలాగే రూ.5 కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టనున్నామని వెల్లడించారు. 'బుచ్చిరెడ్డిపాళెంలో రోడ్డు లేదు.. కాలువ లేదు అనే మాట ఇక వినిపించకుండా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. మలిదేవి వంతెన పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి' అని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని కాజానగర్ ఉర్దూ పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 'కాజానగర్ ఉర్దూ పాఠశాల అభివృద్ధికి రూ.20 లక్షలతో స్థలం కొనిచ్చామన్నారు. త్వరలో అదనపు తరగతి గదులు నిర్మిస్తామని వెల్లడించారు. 9, 10 తరగతులు కూడా మైనారిటీ పిల్లలు చదువుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇంతకు ముందు ఎంతో మంది నాయకులు ఉన్నారు. ఎవరైనా ఆ బిడ్డల చదువును పట్టించుకున్నారా?' అని ప్రశ్నించారు. విద్యా అవకాశాలను మెరుగుపరచడం ద్వారా మైనారిటీ పిల్లల భవిష్యత్తుకు మరింత భరోసా కల్పిస్తామని అన్నారు.ఎన్నికల సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నాయకులు ఇంటింటి ప్రచారంలో అద్భుతంగా పనిచేశారని ఎమ్మెల్యే ప్రశంసించారు. 'ఇంటింటి ప్రచారంలో అనేక సమస్యలు మన దృష్టికి వచ్చాయన్నారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను గుర్తుపెట్టుకోవాలి. రాబోయే మూడేళ్లలో ఆ పనులన్నీ పూర్తి చేస్తామని ప్రజలకు నమ్మకం కలిగించాలి. మనం చేసినఅభివృద్ధిని మాత్రమే కాకుండా, చేయబోయే పనులను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలి' అని సూచించారు.ఇంత పెద్ద బుచ్చిరెడ్డిపాళెంలో అగ్నిమాపక కేంద్రం కూడా లేకపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫైర్ స్టేషన్‌ను నిర్మించామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా బుచ్చిరెడ్డిపాళెం ప్రజలకు బ్రహ్మాండమైన మున్సిపల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.స్థానిక ఎన్నికల్లో నాయకులు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. 'మనం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పండి. చేయబోయే పనులను వివరించండి. మమ్మల్ని గెలిపించమని ప్రజలను కోరండి. ఎవరైనా దిగజారుడు రాజకీయాలు చేసినా, మిమ్మల్ని రెచ్చగొట్టినా మనం మాత్రం నీతి, నిజాయతీతోనే ఎన్నికల్లో పనిచేయాలి' అని అన్నారు. అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇవ్వాలని కోరారు. 'ఇది జరిగి తీరుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. అందరం ఐక్యంగా పనిచేస్తే బుచ్చిరెడ్డిపాళెంలో కూటమి జెండా ఎగరడం ఖాయం' అని ధీమా వ్యక్తం చేశారు.



### యూటీఎఫ్ సహకారంతో క్రాంతినగర్ మున్సిపల్ స్కూల్లో

# అదనపు గదుల నిర్మాణం

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గం పరిధిలోని 37వ డివిజన్ క్రాంతినగర్ మున్సిపల్ స్కూల్‌లో నెల్లూరు యునైటెడ్ రౌండ్ టేబుల్ 324 ఫౌండేషన్ వారి సహకారంతో 35 లక్షల రూపాయలతో అదనపు గదుల నిర్మాణం టాయిలెట్స్ పునర్నిర్మాణ పనులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేసిన నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ వెంట ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, మంత్రి నారా లోకేష్ అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ అదనపు గదుల నిర్మాణానికి సహకరించిన నెల్లూరు యునైటెడ్ రౌండ్ టేబుల్ 324 ఫౌండేషన్ సభ్యులందరికీ నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కో క్లస్టర్ ఇంచార్జ్ విష్ణు ప్రియ, 37వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు టీ.ఎస్. శ్రీనాథ్, టిడిపి నాయకులు వడ్లమూడి రమేష్ చౌదరి, మిద్దె శ్రీనాథ్, కత్తి సురేష్, ఉన్నం మహేష్, వేణు గోపాల్, కిరణ్, విజయ్, సిన్నయ్య, సుధా తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో పనిచేయడమే లక్ష్యం

### లీడర్షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న సుగవాసి

రాజంపేట (చైతన్యరథం): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యం వహించిన సమావేశంలో అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మరింత చేరువగా పనిచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడం వంటి పలు ముఖ్యమైన అంశాలపై నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త, ప్రతి ప్రజాప్రతినిధి సమన్వయంతో పనిచేయాలి అనే సంకల్పంతో సమావేశం కొనసాగిందని సుగవాసి తెలిపారు.

# వైసీపీ అధిష్టానం మెప్పు కోసమే ఆపసోపాలు

### పర్వతరెడ్డిపై విరుచుకుపడిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతల తీరుపై విరుచుకుపడ్డారు. బ్రిడ్జి గేమ్ కి పేకాటకు తేడా తెలియని పార్టీ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇదే విధంగా యువనేత నారా లోకేష్ పై మాట్లాడితే త్వరలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఇంచార్జి పదవి కూడా పోతుందన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని పరిస్థితిలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. ఇదే విధంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా రావన్నారు. గత 5 ఏళ్ల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మెగా డీఎస్సీ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఇన్చార్జి పోతుందనే ఆత్రుతతోనే నారా లోకేష్‌పై పర్వత రెడ్డి విమర్శలకు దిగారన్నారు. మెగా డీఎస్సీని నిర్వహించిన ఘనత రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఓ పద్ధతి లేకుండా విమర్శలు చేయడం తగదన్నారు. ఇండిపెండెంట్‌గా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పర్వతరెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నుకూలంగామారిపోయాడన్నారు.




# సరికొత్త పెన్షన్ల పండుగకు శ్రీకారం

### చిత్తూరు టీడీపీ నేతల హర్షం

చిత్తూరు (చైతన్యరథం): రాష్ట్రం రాష్ట్రంలో కొత్తగా పెన్షన్ల పండగ ప్రారంభమైందని చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ 62 లక్షలు మందికి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు అందిస్తుండగా మళ్లీ మూడు లక్షల కొత్త పెన్షన్ ఇవ్వడానికి దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 7వ తేదీ నుండి ప్రారంభమైందని అన్నారు. ఇప్పటివరకు భారతదేశంలోని ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా అత్యధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రంగా పేరు పొందని అన్నారు. రాష్ట్రంలో ప్రతినెల 2694 కోట్ల రూపాయలు సామాజిక పెన్షన్ ఇస్తున్నటువంటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 73,508 కోట్లు కేవలం పెన్షన్లకి అందించిన చరిత్ర కూటమి ప్రభుత్వంది అని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత కార్మికులకు, మత్స్యకారులకు, డప్పు కళాకారులకు, చర్మకారులకు, కల్లుగీత కార్మికులకు ట్రాన్స్జెండ్ లకు పెన్షన్లు అందిస్తున్నటువంటి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే అని కొనియాడారు. అన్ని వర్గాలు అండగా నిలుస్తున్న ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్రంలో పెన్షన్లు ఇవ్వడం అనేది ఒక తంతుగా కాకుండా ఒక బాధ్యతగా నిర్వహిస్తున్నారు అని అన్నారు. గ్రామ ప్రజలు అందరూ కూడా తమ తమ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అన్ని అర్హతలు ఉండి పెన్షన్ లేని వారు ఈ రాష్ట్రంలో ఉండకూడదని లక్ష్యంతో మంత్రి పని చేస్తున్నారు అని అన్నారు. రాష్ట్ర జనాభాలో 13 శాతం మందికి సామాజిక భద్రత పెన్షన్లు అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గణతకి ఎక్కిందని అన్నారు. సమావేశంలో టీడీపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, పూతలపట్టు నియోజకవర్గం తెలుగు యువత నాయకుడు వినోద్ కుమార్, తెలుగు రైతు కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ లబ్ధి చేకూరాలి : కమిషనర్ విశ్వనాథ్



ప్రొద్దుటూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులు తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. నిరుపేదలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. ఈ నెల 16 వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. నిర్ణయించిన గడువులోపు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన 60 సంవత్సరాలు దాటిన వృద్ధులతో పాటు చేనేత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చర్మకారులు, దివ్యాంగులు, గీత కార్మికులు, మత్స్యకారులు, ట్రాన్స్‌జెండర్స్ తమకు సంబంధించిన అవసరమైన దస్త్రాలతో వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## తాగునీటికే సిద్ధాపురం జలాలు

### శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టీకరణ

ఈ ఏడాది సిద్ధాపురం చెరువు జలాల వినియోగం తాగునీటికేనని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువుకు జరుగుతున్న నీటి విడుదలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆయన్ని కలిసి పంటలను సాగుచేసేందుకునేందుకు నీటి విడుదల జరపాలని కోరగా ఎల్‌నినో పరిస్థితులను రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో విపత్తు వచ్చే ఏడాది జూలై వరకు ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో శ్రీశైల జలాశయం నుంచి వెలుగోడుకు చేరిన కృష్ణాజలాలను సిద్ధాపురం చెరువులోకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సిద్ధాపురం చెరువు నుంచి కాల్వల ద్వారా ఆయా గ్రామాల చెరువులకు, వాగులు, వంకలకు నీటి విడుదల చేస్తామని వివరించారు. ఈ నీటిని రైతులు ఎట్టి పరిస్థితుల్లో పంటల సాగు అవసరాలకు వాడవద్దని సూచించారు. కేవలం తాగునీటి అవసరాల కోసమే నీటిని విడుదల చేస్తున్నామన్న విషయాన్ని రైతులు గుర్తించుకోవాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకులు చేస్తున్న డ్రామాలను రైతులు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, రవీంద్రబాబు, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, మల్లికార్జునరెడ్డి, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.





## పోటెత్తిన సిరిగిరులు

### ఆది దంపతుల సాక్షాత్కారంతో పరవశించిన భక్తులు

శ్రీశైలం (చైతన్యరథం): ఆదిదంపతుల దర్శనం చేసుకున్న భక్తుల పరవశించిపోయారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తుల శివనామస్మరణతో క్షేత్ర పురవీధులు, క్యూలైన్లు కంపార్టుమెంట్లు మార్మోగిపోతూ ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉచిత శీఘ్ర అతిశీఘ్ర దర్శనాలు చేసుకునే భక్తులకు రాత్రి వరకు అలంకార దర్శనాలు మాత్రమే కల్పించారు. ఆన్‌లైన్‌లో అధికారిక వెబ్‌సైట్లు, మనమిత్ర వాట్సాప్ ద్వారా ముందుగా విడుదల చేసిన పరిమిత స్పర్శ దర్శనం టికెట్లు నమోదు చేసుకున్న భక్తులతో పాటు సిఫార్సు లేఖల ద్వారా వచ్చిన వీఐపీ బ్రేక్ స్పర్శ దర్శనం టికెట్లు కేటాయించిన వారికి కూడా రాత్రి 8 గంటల నుంచి ఆలయ ప్రవేశానికి అనుమతించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్న ప్రసాద భవనంలో శుచి శుభ్రతతో వండిన వంటకాలను వడ్డించారు. ఆర్జిత సేవా టికెట్లు, దర్శనం, లడ్డూ ప్రసాదాలు, కేశఖండన టికెట్లను దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే నమోదు చేసుకోవాలని ఈవో శ్రీనివాసరావు భక్తులను కోరారు.

## సత్తా చాటిన కర్నూలు కళాకారులు

కర్నూలు (చైతన్యరథం): కళాకారులు మరోసారి సత్తా చాటారు. 12 గంటల పాటు నిర్విరామంగా నృత్య ప్రదర్శనలు చేస్తూ సరికొత్త రికార్డు నెలకొల్పి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం, నటరాజ నృత్య కళామందిర్ సంయుక్త ఆధ్వర్యంలో 200 మంది నృత్య కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చిన్నారులు ఉత్సాహంగా ఈ నృత్య ప్రదర్శనలకు తరలి వచ్చి, అబ్బుర పరిచేలా ప్రదర్శనలు ఇచ్చారు. ఉదయం 9 గంటలకు మొదలైన నృత్య ప్రదర్శనలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి మాట్లాడుతూ కళాకారులుగా పుట్టడం, కళాకారులుగా జీవించడం పూర్వజన్మ సుకృతమని, కర్మ ఫలానుసారమే మానవ జన్మ అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు టీజీవీ కళాక్షేత్ర ప్రదర్శనలకు రావడం ఇది రెండోసారి అని గుర్తు చేశారు. గతంలోనూ వంద పాటలు, వంద నృత్యాలకు, రంగస్థల కళాకారులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించిందన్నారు. నృత్య పోటీల్లో పాల్గొన్న కళాకారులు, గురువులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గజల్ గాయకులు మహ్మద్ మియా, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ డాక్టర్ వెంకటాచారి, నృత్య గురువు ఎస్.కరీముల్లా, సభ్యులు ఆకోశ్‌కుమార్, సినీ నృత్య గురువు కేవీ సత్యనారాయణ, వ్యాఖ్యాత సునీత, మునిస్వామి, సంగా ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం... దిగజారుతున్న సాగు విస్తీర్ణం!



కర్నూలు (చైతన్యరథం): ఈ ఏడాది ఎల్‌నినో రైతన్నకు కన్నీరు తెప్పిస్తోంది. సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మొక్క గిటక బారి ఎదుగుదల లేకుండా పోతుంది. దీంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఎండవేడిమి రోజురోజుకు పెరిగిపోతుంది. ఆదివారం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. ఓ వైపు ఎండవేడిమి పెరగడం మరోవైపు వర్షాలు కురువపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఎమ్మిగనూరు డివిజన్‌లో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో ప్రతి ఏడాది ఖరీఫ్‌లో 1.70లక్షల ఎకరాలలో పంటలు సాగు కావాల్సి ఉంది. అయితే ఈ ఏడాది 1.20 లక్షల ఎకరాలకు మించి పంట సాగు కాలేదు. బీడు భూములుగా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూన్, జూలై, ఆగస్టులో 300 నుంచి 320 ఎంఎం వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈయేడాది కేవలం 150 ఎంఎం మాత్రమే నమోదు అయినట్లు అధికారులు తెలుపుతున్నారు.

### అప్పుల ఊబిలో అన్నదాత

పంట సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల ఖర్చు, పెరగడంతో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. అయితే దిగుబడి మాత్రం తగ్గిపోతోంది. ధర ఆశాజనకంగా ఉన్నప్పటికి దిగుబడి లేకపోవడంతో నష్టాల ఊబిలో రైతన్న కూరుకుపోవాల్సి వస్తుంది. పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అప్పులు చేయాల్సి రావడంతో రైతన్న తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే వచ్చే రబీలో సాగు పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూడటం తప్ప మరో దారి కనిపించడం లేదు.

### లక్ష ఎకరాలలో పత్తి సాగు

ఎమ్మిగనూరు డివిజన్‌లో ఎక్కువగా ఈ ఏడాది పత్తి పంటను సాగు చేశారు. డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో 1.70 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు కురువకపోవడంతో పంట సాగు శాతం తగ్గిపోయింది. దాదాపు 1.20లక్షల ఎకరాలలో మాత్రమే పత్తి, వేరుశనగ, కంది, మిరప పంటలను సాగు చేశారు. అందులో ఒక లక్ష ఎకరాలలో పత్తిపంటను సాగు చేశారు. అయితే సకాలంలో వ ర్షాలు కురియని కారణంగా పంట గిటక బారింది. ఎదుగు బొదుగు లేక పోవడంతో చెట్టు కు పత్తి కాయలు నాలుగు నుంచి పదిలోపే ఉన్నాయి. దీంతో పంట పూర్తి దెబ్బతిన్నట్లే అని రైతులు వాపోతున్నారు.

### అరకొరగా వరి సాగు..

డివిజన్‌లో బావులు, బోర్లు, ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు కింద ప్రతి ఏడాది పది వేల ఎకరాలలో వరి పంట సాగు అయ్యేది. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడం, ఎల్లెల్సీ, జీడీపీ ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడం బావులు బోర్లలు ఎండిపోయాయి. వరి పంట పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం డివిజన్‌లో వెయ్యి ఎకరాలను మించి వరి పంట సాగు కాలేదు. బావులు, బోర్లు అడుగంటిపోతున్నాయి.

## అరంగేట్రం అద్భుతం

**బోస్టన్‌లో అలరించిన సహస్ర నృత్యాభినయం**



**బోస్టన్:** విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పిల్లలకు వాటిని అలవర్చేలా ప్రోత్సహిస్తున్నారు పలువురు ప్రవాస భారతీయులు. ఈ క్రమంలో బోస్టన్‌లో నివాసముంటున్న 14 ఏళ్ల తెలుగు అమ్మాయి సహస్ర భరతనాట్యంలో అరంగేట్రం చేసి వీక్షకులను విశేషంగా అలరించింది. సహస్రకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు లలిత కళల పట్ల ఆసక్తి పెంపొందించారు ఆమె తల్లిదండ్రులు. ఆరో ఏట నుంచే భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న సహస్ర తాజాగా నిర్వహించిన అరంగేట్ర వేడుకలో తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. కేవలం నాట్యానికే పరిమితం కాకుండా మృదంగ వాయిద్యంలోనూ ప్రావీణ్యం సంపాదించిన ఈ మల్టీ టాలెంటెడ్ చిన్నారి, పురాణ పాత్రలతో ఏకపాత్రాభినయ ప్రదర్శనలు కూడా ఇచ్చి ప్రశంసలు అందుకుంది. అంతేకాక 'బాల లహరి' ప్రోగ్రాం ద్వారా అమెరికాలోని ఇతర చిన్నారులకు తెలుగు భాషను నేర్పిస్తూ మాతృభాషాభిమానాన్ని చాటుకుంటోంది.



## టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ చీఫ్ గురురాజా

**మంగళగిరి (చైతన్యరథం):** గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ పిల్లి గురురాజా సోమవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కేంద్ర కార్యాలయ మేనేజర్ పాటిబండ్ల శ్రీకాంత్, మీడియా కో-ఆర్డినేటర్ దారపునేని నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్ (ఎన్ఆర్ఐ టీడీపీ కో-ఆర్డినేషన్) బుచ్చిరాంప్రసాద్, 'తుడా' చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఎన్ఆర్ఐ టీడీపీ చాంబర్లో పలువురు పాత్రికేయులు, పార్టీ ప్రముఖులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9వ తేదీన ప్రమాణస్వీకారం అనంతరం గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తామని గురురాజా చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 160 దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐ టీడీపీ కుటుంబ సభ్యులందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారిని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే తన లక్ష్యమని చెప్పారు.







## ఇళయరాజా స్వరాల జల్లు



- శంకర నేత్రాలయ వైద్య సేవలపై అవగాహనకు ఫీనిక్స్‌లో 'రాజా 50' లైవ్ సింఫనీ
- సంగీత సాగరంలో ఓలలాడిన నాలుగు వేల మంది అభిమానులు

**ఫీనిక్స్ (అరిజోనా):** ప్రసిద్ధ నేత్ర వైద్య సంస్థ 'శంకర నేత్రాలయ' అందిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించే లక్ష్యంతో అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ నగరంలో 'రాజా 50' (Raja 50) పేరిట నిర్వహించిన ప్రత్యక్ష సంగీత కచేరీ సంగీతాభిమానులను విశేషంగా అలరించింది. భారతీయ సంగీత ప్రపంచంలో ఐదు దశాబ్దాలుగా చెరిపేయలేని ముద్ర వేసిన 'మ్యాస్ట్రో' ఇళయరాజా తన అద్భుత స్వరాలతో దాదాపు మూడు గంటల పాటు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా లైవ్ సింఫనీ:** అరిజోనా ఫైనాన్షియల్ థియేటర్‌లో జరిగిన ఈ భారీ సంగీత ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. దాదాపు 40 మంది సంగీత కళాకారులతో కూడిన బృందంతో కలిసి ఇళయరాజా వేదికను పంచుకున్నారు. కీబోర్డ్, డ్రమ్స్‌తో పాటు వివిధ రకాల వాద్య పరికరాలు



ఒకదానితో ఒకటి కలసి పాడుతున్న పాటలకు ఎలా జీవం పోస్తాయో ప్రత్యక్షంగా వినిపించడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అంతే కాకుండా పాటల రూపకల్పనలో ఏఏ వాద్య పరికరాలు ఎలాంటి పాత్ర పోషిస్తాయో ఇళయరాజా స్వయంగా ప్రేక్షకులకు వివరించడం సాధారణ కచేరీలకు భిన్నమైన అనుభూతి పంచింది.దాదాపు 4వేల మందికి పైగా సంగీతాభిమానులు హాజరయ్యారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు వివిధ భారతీయ ప్రాంతాలకు చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సంగీతానికి భాషా సరిహద్దులు లేవని మరోసారి రుజువైంది. పాత తరం అభిమానులతో పాటు నేటి యువత కూడా ఒకే వేదికపై ఇళయరాజా పాటలను ప్రత్యక్షంగా ఆస్వాదించారు. కార్య క్రమ విజయవంతానికి ఫీనిక్స్‌లోని పలు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సంఘాలు, సమూహ నాయకులు, స్పాన్సర్లు, వాలంటీర్లు, శంకర నేత్రాలయ శ్రేయోభిలాషులు సహాయం అందించారు. ఈ భారీ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను ఆది మోర్రెడ్డి, అనిల్ భరద్వాజ్, విజయ్ రాజ్, చెన్నారెడ్డి మద్దూరి, చిత్రప్రియ, సుబ్బా ఉప్పులూరి, జ్ఞాని మారుపాకుల, జెగ్గీ క్రిష్, డాక్టర్ కార్తీక్ రెడ్డి ధొనూర్, లక్ష్మి బొగ్గరపు, ప్రవీణ్ సామెల్, శరవ్ సుబ్రహ్మణ్యన్, సచ్చిదానంద ప్రభు, సతీష్ పంచాక్షరం, సతి శివం, శ్యామ్ బైరా, శ్రీజిత్ శ్రీనివాసన్, గుప్తా, శ్రీసుబ్రహ్మణ్యన్, వంశీ కృష్ణ ఇరువారమ్, ధీరజ్ రెడ్డి పోల సమర్థవంతంగా నిర్వహించారు.





## 15 సెకన్లలోనే ఇమిగ్రేషన్ క్లియరెన్స్

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో 'క్లిక్ అండ్ ట్రావెల్'**



**దుబాయ్:** విమానాశ్రయాల్లో ప్రయాణికుల రాకపోకలను వేగవంతం చేసేందుకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఇమిగ్రేషన్ ప్రక్రియను అత్యంత సులభతరం చేస్తూ అధికారికంగా 'క్లిక్ అండ్ ట్రావెల్' సేవలను ప్రారంభించింది. అధునాతన మొబైల్ పరికరాల సహాయంతో ఇమిగ్రేషన్ అధికారులు కేవలం 12 నుంచి 15 సెకన్ల వ్యవధిలోనే ఒక్కో ప్రయాణికుడి ప్రక్రియను పూర్తి చేస్తున్నారని అధికారులు వెల్లడించారు. ఈ నూతన వ్యవస్థలో బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్, ఫేషియల్ రికగ్నిషన్, ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్ రీడింగ్, ఆటోమేటెడ్ ప్రీ-స్క్రీనింగ్ టెక్నాలజీ ఉపయోగించారు. ప్రయాణికులు కేవలం ఇమిగ్రేషన్ కౌంటర్ల వద్దే వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఎయిర్‌పోర్ట్ హాల్స్‌లో సంచరించే పాస్‌పోర్ట్ అధికారులు మొబైల్ పరికరాల ద్వారా నేరుగా ప్రక్రియను పూర్తిచేసే వెసులుబాటు కల్పించారు. విమానాశ్రయంలో రద్దీ సమయాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికుల రాకపోకలను వేగవంతం చేసేందుకు ఇది ఎంతగానో తోడ్పడనుంది.

గత ఏడాది అక్టోబరులో టెర్మినల్-3లో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఈ సేవలను... ఈ ఏడాది మే నుంచి ఆగస్టు వరకు విమానాశ్రయంలోని అన్ని టెర్మినళ్లకు విస్తరించారు. రెండవ దశ ప్రయోగంలో భాగంగా ఇప్పటికే 31వేల మందికి పైగా ప్రయాణికులు ఈ సేవల ద్వారా వేగంగా ఇమిగ్రేషన్ పూర్తి చేసుకున్నారు. యుఏఈ పౌరులు, స్థానిక నివాసితులతో పాటు గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్ (సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ, ఒమన్, ఖతార్, బహ్రెయిన్) దేశాల పౌరులు, అంతర్జాతీయ పర్యాటకులు అందరూ ఈ 'క్లిక్ అండ్ ట్రావెల్' సేవలను ఉపయోగించుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# భవనం కూలిన ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి




దేశ రాజధాని ఢిల్లీలోని సత్యనికేతన్‌లో ఐదంతస్తుల భవనం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని పేర్కొన్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'సత్య నికేతన్‌లో హాస్టల్ భవనం కూలిన ఘటన తీవ్రంగా కలచివేసింది. తమ ఆప్తులను కోల్పోయిన వారికి నా సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని అన్నారు. ఘటనాస్థలిలో అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కాగా.. ఆదివారం మధ్యాహ్నం ఓ ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆరుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. 11 మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. ఇంకా పలువురు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ భవనం సుమారు 75 పడకల సామర్థ్యంతో పేయింగ్ గెస్ట్(పీజీ) వసతిగా వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన భవనం.. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ ఉంటున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ భవనం 40, 50 ఏళ్ల నాటిదని, కింది భాగంలో బేస్‌మెంట్‌తో పాటు పైన ఐదంతస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆ పనులకు, భవనం కూలిపోవడానికి మధ్య సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నట్టు స్పష్టం చేశారు.



# మహిళలను కించపరిస్తే మటాష్!

## తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టీకరణ

రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై ఎలాంటి నిందాపూర్వక, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే వివాదం చెలరేగిన నేపథ్యంలో, విజయ్ శాసనసభలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కఠినమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని సీఎం పేర్కొన్నారు.తన సినీ కెరీర్‌లోనూ, ప్రస్తుతం రాజకీయంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంలోనూ మహిళల పాత్ర కీలకమైనదని విజయ్ గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో, బయట కూడా అదే గౌరవాన్ని కొనసాగించాలని కోరారు. ఇటీవల కాలంలో తమిళనాడు రాజకీయాల్లో ద్వంద్వార్థాలు (డబుల్ మీనింగ్స్), అశ్లీల పదజాలంతో మాట్లాడే ధోరణి పెరిగిపోయిందని, మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. గతంలో ఇదే శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవమానానికి గురైన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి సంస్కృతిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

# ఉద్యోగం ఉన్నంత మాత్రాన వైకల్యం తక్కువైనట్లు కాదు

## రోడ్డు ప్రమాద కేసుల్లో సుప్రీంకోర్టు సంచలన తీర్పు



రోడ్డు ప్రమాద నష్టపరిహార కేసుల్లో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితుల సంపాదన సామర్థ్యాన్ని కేవలం వారు ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్నారనే కోణంలో అంచనా వేయరాదని స్పష్టం చేసింది. బహిరంగ, పోటీ మార్కెట్‌లో వారి వాస్తవ సంపాదన సామర్థ్యాన్ని బట్టే వైకల్యాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, వంద శాతం వైకల్యానికి గురైన ఓ మహిళకు పరిహారాన్ని గణనీయంగా పెంచింది. 7.5 శాతం వార్షిక వడ్డీతో కలిపి మొత్తం రూ.3,77,84,297 చెల్లించాలని ఆదేశించింది. 2011లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐబీఎం గ్రూప్ మేనేజర్ ప్రియాంక దాస్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా తీవ్రమైన ఆరోగ్య స మస్యలను ఎదుర్కొన్నారు. కానీ, ఆమె అదే సంస్థలో ఉద్యోగంలో కొనసాగుతుండడంతో కిందిస్థాయి ట్రై బ్యునల్ ఆమె వైకల్యాన్ని 60శాతంగా, హైకోర్టు 80 శాతంగా అంచనా వేశాయి. బీమా కంపెనీ మాత్రం ఆమె ఉద్యోగంలో కొనసాగుతున్నారన్న వాదనను తెరపైకి తెచ్చింది. అయితే, బాధితురాలి తరఫు వాదనలను పరిశీలించిన జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ ఎన్.వి.అంజరియాల ధర్మాసనం బీమా కంపెనీ వా దనను తోసిపుచ్చింది. బాధితురాలు కేవలం యాజమాన్యం కల్పించిన అసాధారణ వెసులుబాట్ల వల్ల మాత్రమే ఉద్యోగంలో నెట్టుకొస్తున్నారని పేర్కొంది. హైకోర్టు అంచనా వేసిన 80 శాతం వైకల్యాన్ని 100 శాతానికి సవరిస్తూ.. భవిష్యత్తు నష్టంతో పాటు వైద్య ఖర్చులు, అటెండెంట్ చార్జీలు, ఇతర నష్టపరిహారాలను కలిపి మొత్తం రూ.3,77,84,297 చెల్లించాలని తుది తీర్పు వెలువరించింది.

# మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం తాగి 12 మంది మృతి

మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఆదివారం కల్తీ మద్యం తాగిన 12 మంది మృతి చెందారు. 54 మంది అస్వస్థత పాలయ్యారు. ఈ మద్యం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పూర్ నుంచి సరఫరా అయినట్లు భావిస్తున్నారు. సాగర్ జిల్లా బందా తహసీల్‌లోని పలు గ్రామాల వారు శనివారం రాత్రి ఈ మద్యం తాగి అస్వస్థత పాలయ్యారని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఒకరు చెప్పారు. వారందరిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే 12 మంది మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఈ దుర్ఘటనపై విచారణకు ఆదేశించారు. అధికారులు ఘటన జరిగిన ప్రాంతంలోని 7 మద్యం షాపులను మూసివేసి, వాటిలోని మద్యం నమూనాలను పరీక్షకు పంపిం ది. ముగ్గురు ఎక్సైజ్ అధికారులను, ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. కల్తీ మద్యం ఘటనపై న్యాయ విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జితు పట్వారీ డిమాండ్ చేశారు.




# భార్యను చంపి, తలను ఫ్రిజ్‌లో పెట్టి పరారయిన కిరాతకుడు

అస్సాంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను హత్య చేశాడు. భార్య శవం నుంచి తలను వేరు చేసి ఫ్రిడ్జ్‌లో దాచాడు. పెళ్లైన కొన్ని నెలల్లోనే ఆ భర్త ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. గువహటికి చెందిన రియా తాలుక్‌దర్ అనే యువతికి కొన్ని నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో పెళ్లయింది. ఏమైందో ఏమో తెలీదు కానీ, వారం రోజుల క్రితం రియాను ఆమె భర్త చంపేశాడు. తర్వాత శవాన్ని ముక్కలుగా కోశాడు. తలను ఫ్రిడ్జ్‌లో దాచి ఇంటినుంచి పరారయ్యాడు. ఇంటి నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో సెప్టెంబర్ 6వ తేదీన పొరిగిళ్ల వారు పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంటి లోపల రియా శరీర భాగాలను గుర్తించారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న రియా భర్త కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

# నా భర్తను కాపాడండి : రష్యాలో భారతీయురాలి ఆక్రందన

## స్పందించిన భారత రాయబార కార్యాలయం, రంగంలోకి దిగిన అధికారులు



రష్యా రాజధాని మాస్కోలో తన భర్తను పోలీసులు అన్యాయంగా నిర్బంధించి, ఉక్రెయిన్ యుద్ధం కోసం రష్యన్ సైన్యంలో చేరాలంటూ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఓ భారతీయ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను రక్షించాలని కోరుతూ సదరు మహిళ సోషల్ మీడియా ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లకు విజ్ఞప్తి చేయగా, భారత విదేశాంగ శాఖ, మాస్కోలోని భారత రాయబార కార్యాలయం వెంటనే స్పందించాయి.

### బాధితురాలి ఆవేదన

చందన్ గుప్తా ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ వాసి. నోయిడాకు చెందిన ఒక కంపెనీ తరపున 'హైలీ క్వాలిఫైడ్ స్పెషలిస్ట్' వీసాపై ఆయన తన కుటుంబంతో (భార్య స్నేహా గుప్తా, 10 ఏళ్ల కుమారుడు) కలిసి మోస్కోలో నివసిస్తున్నారు. స్నేహా గుప్తా తెలిపిన వివరాల ప్రకారం, ఎలాంటి తప్పు చేయకపోయినా ఆదివారం మధ్యాహ్నం రష్యా పోలీసులు తన భర్తను అదుపులోకి తీసుకున్నారని, రష్యా సైన్యంలో సిబ్బంది కొరత కారణంగా తన భర్తతో పాటు మరికొందరు విదేశీయులను బలవంతంగా సైన్యంలో చేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. తమకు 10 ఏళ్ల కుమారుడు ఉన్నాడని, ఈ పరిస్థితుల్లో తమ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉందని, భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తన భర్తను సురక్షితంగా విడిపించాలని ఆమె ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

### అధికార వర్గాల స్పందన

భారత ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. చందన్ గుప్తా మాస్కోలోని 'ఫ్లెక్స్ ఫిల్మ్స్ రస్ ఎల్‌ఎల్‌సి' అనే సంస్థలో పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 5వ తేదీ రాత్రి 11:30 గంటల ప్రాంతంలో మాస్కోలోని రెడ్ స్క్వేర్ వద్ద చందన్ గుప్తా, ఆయన స్నేహితుడు ఆశిష్‌ను బహిరంగంగా మద్యం సేవించడం, ఆంబులెన్స్ అద్దాలు పగలగొట్టడం అనే ఆరోపణలపై పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ప్రస్తుతం వారిద్దరూ మాస్కోలోని 'బౌమాన్స్కాయా' పోలీస్ స్టేషన్‌లో ఉన్నారు. భారత రాయబార కార్యాలయం ఇప్పటికే రష్యా అధికారులతో మాట్లాడి వారి విడుదలకు చొరవ చూపుతోందని, కాన్సులర్ యాక్సెస్ (అధికారుల కలయిక) కోసం అభ్యర్థించిందని అధికారులు వెల్లడించారు.

### రష్యా సైన్యంలో భారతీయుల అంశం

ఉద్యోగాల పేరుతో భారతీయులను రష్యాకు తీసుకెళ్లి, ఆపై బలవంతంగా ఉక్రెయిన్ యుద్ధంలోకి దింపుతున్నారనే ఆందోళనలు ఇటీవల పెరిగిన సంగతి తెలిసిందే. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవలే విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు 227 మంది భారతీయ పౌరులు రష్యన్ సైన్యంలో చేరగా, వారిలో 139 మంది డిశ్చార్జ్ అయ్యారు. కాగా 51 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన భారతీయులను కూడా త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

## గంటలో 34 పోస్టులు..

# ట్రంప్ దూకుడు!




అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సోషల్ మీడియాలో తనదైన శైలిలో హల్‌చల్ చేశారు. గంట వ్యవధిలోనే ఏకంగా 34 పోస్టులు పెట్టి.. రాజకీయాల నుంచి భౌగోళిక హక్కుల వరకు, ఇరాన్ నుంచి చంద్రుడి వరకు వరుస వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమాలను హోరెత్తించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రూపొందించిన చిత్రాలు, ఆసక్తికర వ్యాఖ్యలతో కూడిన పోస్టులు వైరల్‌గా మారడంతో.. ట్రంప్ సోషల్ మీడియా యాక్టివిటీ మరోసారి చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ఇరాన్‌లోని కీలక చమురు ఎగుమతి కేంద్రం ఖర్గ్ ద్వీపాన్ని ఉద్దేశిస్తూ ఆయన చేసిన పోస్టులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఖర్గ్ ద్వీపాన్ని చూపిస్తూ 'బై బై ఖర్గ్' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్య.. ఇరాన్‌పై అమెరికా వైఖరి మరింత కఠినంగా మారుతోందన్న సంకేతాలుగా చర్చకు దారితీసింది. ఇరాన్ చమురు ఎగుమతుల్లో ఖర్గ్ ద్వీపానికి అత్యంత కీలక స్థానం ఉండటంతో.. ట్రంప్ పోస్టుకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. అంతేకాదు.. ఇరాన్ పటంపై తన ముఖం ప్రతిబింబించేలా రూపొందించిన ఏఐ చిత్రాన్ని కూడా ట్రంప్ పంచుకున్నారు. దీంతో ఆయన పోస్టులు రాజకీయ సందేశాలకే పరిమితం కాకుండా.. డిజిటల్ ప్రచారానికి కొత్త రూపాన్ని ఇస్తున్నాయన్న చర్చ మొదలైంది.

ఇంతటితో ఆగకుండా.. 'చంద్రుడు మాకే సొంతం' అన్న భావనను వ్యక్తం చేస్తూ మరో ఆసక్తికరమైన పోస్టును ట్రంప్ పెట్టారు. భూమిపై అమెరికా ఆధిపత్యాన్ని ప్రస్తావించే వ్యాఖ్యలకు భిన్నంగా.. అంతరిక్షం విషయంలోనూ అమెరికా ప్రాధాన్యాన్ని సూచించేలా ఈ పోస్టు ఉండటంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. మరోవైపు అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రాన్ని కూడా ట్రంప్ తన ఏఐ సృజనాత్మకతకు వేదికగా మార్చేశారు. 'న్యూ మెక్సికో' పేరుకు బదులుగా 'న్యూ అమెరికా' అని కనిపించేలా రాష్ట్ర సూచిక బోర్డును మార్చిన చిత్రాన్ని ఆయన షేర్ చేశారు. అయితే న్యూ మెక్సికో పేరును మార్చే ఎలాంటి అధికారిక ఉత్తర్వును ట్రంప్ జారీ చేయలేదు. దీంతో ఈ పోస్టు కూడా అధికారిక నిర్ణయం కాదని స్పష్టమైనప్పటికీ.. ట్రంప్ ప్రచార శైలిపై ఆసక్తికర చర్చకు దారితీసింది. ట్రంప్‌కు సోషల్ మీడియా కొత్తేమీ కాదు. ముఖ్యంగా ట్రూత్ సోషల్ ఆయన రాజకీయ సందేశాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రధాన వేదికగా మారింది. సంప్రదాయ మీడియా ద్వారా ప్రకటనలు చేయడం కంటే.. తనకు నచ్చిన సమయంలో, తనకు నచ్చిన భాషలో, నేరుగా పోస్టులు పెట్టడం ట్రంప్ శైలిగా మారింది. ఇప్పుడు ఏఐ సాంకేతికతను కూడా దీనికి జోడించడంతో ఆయన పోస్టులు మరింత దృశ్యపరంగా ఆకట్టుకునేలా మారుతున్నాయి. అయితే ఇలాంటి చిత్రాలు, వ్యాఖ్యలు వాస్తవ నిర్ణయాలా? రాజకీయ వ్యంగ్యమా? లేక ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ప్రచార వ్యూహమా? అన్నది ప్రతి సందర్భంలోనూ పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతోంది.

ట్రంప్ తాజాగా చేసిన పోస్టులను గత నిర్ణయాలతో కలిపి చూస్తే.. పేర్ల మార్పిడం, అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించే భాషను ఉపయోగించడం, సోషల్ మీడియాను రాజకీయ సందేశాల కోసం విస్తృతంగా వినియోగించడం ఆయన ప్రత్యేక శైలిగా కనిపిస్తోంది. గతంలో గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా పిలవాలని ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేయడం ఇందుకు ఉదాహరణ. ఇప్పుడు న్యూ మెక్సికోను 'న్యూ అమెరికా'గా చూపిస్తూ ఏఐ చిత్రం పంచుకోవడం.. అదే రాజకీయ బ్రాండింగ్ శైలికి కొనసాగింపుగా భావిస్తున్నారు. అయితే ఖర్గ్ ద్వీపం విషయంలో మాత్రం వ్యవహారం మరింత సున్నితమైనది. అది ఇరాన్ చమురు ఎగుమతులకు కీలక కేంద్రం కావడంతో.. ట్రంప్ 'బై బై ఖర్గ్' వ్యాఖ్య కేవలం సోషల్ మీడియా పోస్టుగా తీసిపారేయలేని విధంగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకవైపు ఇరాన్‌తో ఉద్రిక్తతలు.. మరోవైపు చమురు సరఫరాలపై ప్రపంచ మార్కెట్ల ఆందోళనలు.. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడి ప్రతి మాటకూ రాజకీయ, ఆర్థిక అర్థాలు వెతకడం సహజమే. ఇక ఏఐ చిత్రాల వినియోగం మరో కొత్త ప్రశ్నను ముందుకు తెస్తోంది. అధ్యక్షుడి ఖాతానుంచి వెలువడే ప్రతి చిత్రం నిజమైన సంఘటనను ప్రతిబింబిస్తుందా? లేక రాజకీయ సందేశాన్ని మరింత ప్రభావవంతంగా చూపించేందుకు రూపొందించిన డిజిటల్ దృశ్యమా? అనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. గంటలో 34 పోస్టులు.. అందులో కొన్ని వ్యంగ్యంగా, కొన్ని రాజకీయంగా, మరికొన్ని సంచలనాత్మకంగా.. ట్రంప్ సోషల్ మీడియా శైలి ఇప్పుడు కేవలం పోస్టుల పరంపర కాదు.. అది ఒక ప్రత్యేక రాజకీయ కమ్యూనికేషన్ వ్యూహంగా మారుతోంది. ప్రపంచం అమెరికా అధ్యక్షుడి ప్రతి మాటను గమనిస్తున్న వేళ.. ట్రంప్ మాత్రం సోషల్ మీడియా ద్వారా తనదైన 'డిజిటల్ దూకుడు' కొనసాగిస్తున్నారు.



## అదుపుతప్పిన కార్గో విమానం

### ఐదుగురి దుర్మరణం.. ఐదుగురికి గాయాలు

అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో.. అమెజాన్ కార్గో విమానం ప్రమాదానికి గురైంది. రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో విమానం పక్కకు దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రన్‌వేపై దిగిన తర్వాత ఆ విమానం సమీపంలో పార్క్ చేసిన కార్లవైపు దూసుకెళ్లిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బోయింగ్ 767-300 కార్గో విమానం ప్యూర్టోరికోలోని లూయిస్ మునోజ్ మారిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. అయితే ప్రమాద ఘటనపట్ల దర్యాప్తు చేపట్టినట్టు అమెజాన్ సంస్థ పేర్కొన్నది. స్థానిక అధికారులతో ఈఅంశంపై చర్చిస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది. క్రాష్ సైట్‌వద్ద దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ విమానాశ్రయంలో అన్ని విమానాలను గ్రౌండ్ చేస్తూ ఫెడరల్ ఏవియేషన్ శాఖ ఆదేశాలు ఇచ్చింది. అయితే చనిపోయిన వ్యక్తులు విమానంలో వారా లేక గ్రౌండ్‌పై ఉన్నవారు మృతిచెందారా?ఇంకా తెలియదు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే రెస్క్యూ బృందం అక్కడకు చేరుకున్నట్టు అధికారులు తెలిపారు. ఐదుగురిలో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్టు మియామి ఫైర్ చీఫ్ రాయిద్ జదల్లా తెలిపారు. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు ఈ ఘటనపట్ల దర్యాప్తు చేపట్టనున్నది. 200 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పారు. విమానం నుంచి ఫ్యూయల్ లీక్ అవుతున్నట్టు తెలుస్తోంది.

## దేశం కోసమైనా పిల్లల్ని కందాం

### ఏడుగురు పిల్లల జపాన్ తల్లి పిలుపు



జపాన్‌లో సంతానోత్పత్తి రేటు అంతకంతకూ పడిపోతుండటం అక్కడి ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో కోటో హాషిమోటో అనే జపాన్ మహిళ ఏకంగా 7వ బిడ్డకు జన్మనివ్వడం సంచలనంగా మారింది. దేశం కోసం పిల్లలను కనాలని కూడా ఆమె సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చింది. తాను ఏడో బిడ్డకు జన్మనిచ్చానని, జపాన్ పౌరుడిగా ప్రయాణం ప్రారంభించిన తన బిడ్డకు అందరి ఆశీస్సులు కావాలని ఆమె కోరింది. 'నేను 7వ బిడ్డకు జన్మనిచ్చాను. జపాన్ పౌరుడిగా ప్రయాణం ప్రారంభించిన నా బిడ్డకు మీ అందరి ఆశీస్సులు కావాలి. నా నిర్ణయానికి మద్దతిచ్చి ఇప్పటికే అండగా నిలబడిన మీ అందరికీ ధన్యవాదాలు. మన దేశం కీలక దశకు చేరుకుంది. జపాన్ మహిళలు పిల్లలను కనాలి. మనదేశ ఉత్థానపతనాలు మహిళల పైనే ఆధారపడి ఉన్నాయి' అని ఆమె పేర్కొంది. సంతానోత్పత్తి రేటు పెంచేందుకు ప్రభుత్వ చేపడుతున్న చర్యలపై కూడా ఆమె తన అభిప్రాయాలను పంచుకుంది. తోడు కోసం వెతుక్కుంటున్న వారి కోసం కాస్మెటిక్ సర్జరీపై కూడా ప్రభుత్వ నిధులు వెచ్చించాలని సూచించింది. ఇలాంటి చర్యలతో జనాల ఆకర్షణీయత పెరుగుతుందని చెప్పింది. ఫలితంగా పెళ్లిళ్లు చేసుకునే జంటల సంఖ్య పెరిగి సంతానోత్పత్తి రేటు కూడా పెరుగుతుందని వివరించింది. ఇలాంటి వ్యాఖ్యలు కాంట్రవర్సీకి దారితీసే అవకాశం ఉందని తెలిసినా తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా పంచుకుంటున్నట్టు ఆమె పేర్కొన్నది.

జపాన్ గణాంకాల ప్రకారం.. గత ఏడాది అక్కడ 6.71 లక్షల మంది జన్మించారు. అంతకుముందు ఏడాది 2025తో పోల్చిచూస్తే జననాల సంఖ్యలో 15 వేల మేర కోత పడింది. వార్షిక జననాల సంఖ్య తగ్గడం ఇది వరుసగా 7వసారి. 1899 తర్వాత అత్యంత తక్కువ జననాలు 2025లో నమోదయ్యాయి. ఓ దశ తరువాత జనాభా తగ్గుదలను నిలువరించడం దాదాపుగా అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంతానోత్పత్తి రేటు పెంచేందుకు అనేక దేశాల ప్రభుత్వాలు మహిళలకు పలురకాల ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి.

# యుద్ధ ఖర్చులకు పోర్న్ పన్ను..

## ఉక్రెయిన్‌లో సరికొత్త ప్రతిపాదన

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లకు పైగా కొనసాగుతున్న నేపథ్యంలో.. యుద్ధ వ్యయాల కోసం సొంతంగా ఆదాయం సమకూర్చుకునే మార్గాలపై ఉక్రెయిన్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పోర్నోగ్రఫీని చట్టబద్ధం చేసి.. అడల్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమపై పన్నులు విధించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవాలన్న ప్రతిపాదన తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ చట్టసభ్యుడు యారోస్లావ్ ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పోర్నోగ్రఫీని చట్టబద్ధం చేస్తే పన్నుల రూపంలో ఏటా సుమారు 25 మిలియన్ డాలర్ల ఆదాయం లభించవచ్చని.. ఆ మొత్తంతో దాదాపు 30 వేల డ్రోన్లను కొనుగోలు చేయవచ్చని ఆయన వాదిస్తున్నారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో పోర్నోగ్రఫీని సృష్టించడం, పంపిణీ చేయడం, అశ్లీల వీడియోలను కలిగి ఉండటం చట్టవిరుద్ధం. నేర తీవ్రతను బట్టి ఏడేళ్ల వరకు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది.

అయితే నిషేధం ఉన్నప్పటికీ దేశంలో అడల్ట్ కంటెంట్ పరిశ్రమ రహస్యంగా కొనసాగుతోంది. దీంతో ఈ రంగాన్ని పూర్తిగా నిషేధించడంకంటే.. చట్టబద్ధ పరిధిలోకి తీసుకువచ్చి పన్నుల ద్వారా ఆదాయం పొందడం మేలని ప్రతిపాదకులు చెబుతున్నారు.

ఈ అంశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని యారోస్లావ్ మరో కోణంలో ప్రస్తావించారు. కొంతకాలంగా ఉక్రెయిన్ అధికారులు అడల్ట్ కంటెంట్ క్రియేటర్ల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు. దీంతో క్రియేటర్లు విచిత్రమైన చట్టపరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పన్ను చెల్లించకపోతే పన్ను ఎగవేతపై చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుండగా.. పన్ను చెల్లించినప్పటికీ అశ్లీల కంటెంట్‌కు సంబంధించిన చట్టాలను ఉల్లంఘించిన నేరం ఎదుర్కొనే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అందుకే ఈ రంగాన్ని నియంత్రిత వ్యవస్థలోకి తీసుకువచ్చి.. పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా చట్టాన్ని మార్చాలని ప్రతిపాదించారు.

### యుద్ధ వేళ అవినీతి ఆరోపణలు

మరోవైపు రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌ను స్వదేశంలోని అవినీతి ఆరోపణలు కూడా ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగం, ఆయుధాల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్క ఏడాదిలోనే దాదాపు 1.2 బిలియన్ డాలర్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు కొనసాగుతుండగా.. ఇప్పటికే పలువురు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, ప్రభుత్వంలోని కీలక వ్యక్తులపై చర్యలు తీసుకున్నట్టు సమాచారం. రష్యాతో సుదీర్ఘ యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌పై ఆర్థిక భారం పెరుగుతున్న సమయంలో.. పన్నుల ద్వారా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించడం చర్చకు దారితీస్తోంది. అయితే పోర్నోగ్రఫీని చట్టబద్ధం చేసి యుద్ధానికి నిధులు సమకూర్చాలన్న ప్రతిపాదన మాత్రం ఆర్థిక అంశాన్ని దాటి సామాజిక, నైతిక కోణాల్లోనూ తీవ్ర చర్చకు తెరతీసే అవకాశం ఉంది.



# జపాన్‌లో టీమ్‌ఇండియా చారిత్రక పోరు..

**ప్రసారంపై ఉత్కంఠ**

**సెప్టెంబర్ 22న తొలి భారత్-జపాన్ టీ20..**

**'స్పోర్ట్ 75'కు శ్రీకారం..**

**ఆసియా క్రీడలకు ముందు కీలక సన్నాహకం**

ఆసియా క్రీడలకు ముందు టీమ్‌ఇండియా ఓ చారిత్రక మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 22న జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్-జపాన్ పురుషుల జట్లు తొలి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో తలపడనున్నాయి. 'ది సుజుకి కప్'గా నిర్వహించనున్న ఈ మ్యాచ్.. భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకలకు శ్రీకారం చుడుతుంది. 'స్పోర్ట్ 75' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోరు.. జపాన్‌లో క్రికెట్‌కు కొత్త అభిమానులను తీసుకురావడంతోపాటు, తూర్పు ఆసియాలో క్రీడా విస్తరణకు కీలక అడుగుగా భావిస్తున్నారు.



**ప్రసారంపై చిక్కులు..**

భారత్‌వంటి ప్రపంచ ఛాంపియన్ జట్టు ఆడుతున్నప్పటికీ, మ్యాచ్ ప్రసార వ్యవహారం జపాన్‌లో ఇంకా పూర్తిగా ఖరారు కాలేదన్నది ఆసక్తికర అంశం. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ప్రసార భాగస్వాముల కోసం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మ్యాచ్ నిర్వహణ, ప్రసార సదుపాయాలు, ఆసియా క్రీడల షెడ్యూల్‌వంటి అంశాలు జపాన్ నిర్వాహకులకు సవాలుగా మారుతున్నాయి. భారత్‌లో మాత్రం మ్యాచ్‌ను డిజిటల్/ టీవీ వేదికలపై ప్రసారం చేసే అవకాశాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రసార వివరాలు ఖరారైతే మరింత స్పష్టత రానుంది.

**ఆసియా క్రీడలకు ముందస్తు సన్నాహకం**

సెప్టెంబర్ 19నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి-నగోయాలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు నేరుగా క్వార్టర్‌ఫైనల్ దశలో బరిలోకి దిగనుంది. సెప్టెంబర్ 22న జపాన్‌తో జరిగే మ్యాచ్.. భారత ఆటగాళ్లకు జపాన్ వాతావరణం, పిచ్, పరిస్థితులకు అలవాటు పడేందుకు ఉపయోగపడనుంది. టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత్ ఆసియా క్రీడల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

**క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తం చేయడమే లక్ష్యం**

భారత్-జపాన్ మ్యాచ్‌ను కేవలం ఒక క్రికెట్ పోరుగా చూడలేమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. సంప్రదాయ క్రికెట్ దేశాల పరిధిని దాటి కొత్త ప్రాంతాలు, కొత్త అభిమానులు, కొత్త తరాలకు ఆటను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్-జపాన్ పోరు క్రికెట్‌ను 'గ్లోబల్ యాంబిషన్' నుంచి 'గ్లోబల్ రియాలిటీ' వైపు తీసుకెళ్లే ప్రయాణంలో ముఖ్యమైన అడుగని సైకియా అభిప్రాయపడ్డారు.

## కిషన్ 'డబుల్ ధమాకా'..



**ఈస్ట్ జోన్‌కు 708 పరుగుల కొండ!**

**270 పరుగులతో కెప్టెన్ విధ్వంసం..**

**కుషాగ్ర సెంచరీ..**

**సౌత్ బౌలర్లపై ఈస్ట్ జోన్ దండయాత్ర**

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ బ్యాటింగ్ విధ్వంసం సృష్టించింది. తొలి రోజు 385/4తో ముగించిన ఈస్ట్ జోన్.. రెండో రోజు కెప్టెన్ ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ 111 పరుగులతో బరిలోకి దిగిన కిషన్.. అద్భుతమైన నియంత్రణ, దూకుడుతో బ్యాటింగ్ చేసి 270 పరుగులు చేశాడు. 334 బంతులు ఎదుర్కొన్న అతడి ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. ఇది దులీప్ ట్రోఫీ ఫైనల్లో అత్యుత్తమ వ్యక్తిగత స్కోర్లలో ఒకటిగా నిలిచింది. కిషన్‌కు కుమార్ కుషాగ్ర అద్భుతంగా సహకరించాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేసి తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని నమోదు చేశాడు. కిషన్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఈస్ట్ జోన్‌ను 600 పరుగుల మార్కు దాటించాడు. తొలి రోజు అభిమన్యు ఈశ్వరన్ 72, శిఖర్ మోహన్ 85 పరుగులతో పునాది వేయగా, వైభవ్ సూర్యవంశీ 44 పరుగులు చేశాడు. కిషన్ 250 పరుగుల వద్ద కొద్దిసేపు రిటైర్డ్ హర్ట్ అయినా తిరిగి క్రీజులోకి వచ్చాడు. ట్రిపుల్ సెంచరీపై ఆశలు రేపిన అతడు చివరకు 270 పరుగుల వద్ద ఔటయ్యాడు. దాంతో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌటైంది. సౌత్ జోన్ తరపున త్రిపురాణ విజయ్ 4/180తో అత్యధిక వికెట్లు పడగొట్టాడు.

ఈ భారీ స్కోరుతో ఫైనల్లో ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యం సాధించింది. అంతేకాదు, దాదాపు రెండు రోజులపాటు సౌత్ జోన్ బౌలర్లను మైదానంలో పరుగులు పెట్టించిన ఈ ఇన్నింగ్స్.. కిషన్ రెడ్‌బాల్ క్రికెట్‌లో తన సత్తాను మరోసారి చాటింది.

## పాక్‌కు సేవ చేయాలనుంది

**కానీ, ..పీసీబీ అంటేనే భయం!**

**పర్యటన మధ్యలో కోచ్‌లపై వేటు**

**స్వదేశీ కోచ్‌లకు భద్రతేదంటూ**

**ముస్తాక్, మిస్బా మండిపాటు**

పాకిస్థాన్ క్రికెట్‌లో ఓటముల కంటే ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకుంటున్న నిర్ణయాలే ఎక్కువ చర్చకు దారితీస్తున్నాయి. ఇంగ్లాండ్‌తో తొలి రెండు టెస్టుల్లో ఘోర పరాజయాల తర్వాత పర్యటన ఇంకా ముగియకముందే పీసీబీ భారీ ప్రక్షాళనకు దిగింది. ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తప్పించింది. మిగిలిన చివరి టెస్టుకు మైక్ హెసన్, అష్లే నోఫ్కేలను కోచింగ్ బాధ్యతల్లోకి తీసుకొచ్చింది. ఈ హఠాత్ నిర్ణయాలపై పాక్ మాజీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో పాక్ మాజీ స్పిన్నర్ ముస్తాక్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన దేశానికి సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధమేనని, ముఖ్యంగా ఇలాంటి క్లిష్ట సమయంలో జట్టును తీర్చిదిద్దే సవాలును స్వీకరించేందుకు ఆసక్తిగా ఉన్నానని చెప్పాడు. అయితే పీసీబీ నుంచి సరైన మద్దతు, గౌరవం, ఉద్యోగ భద్రత ఉంటేనే అది సాధ్యమని స్పష్టం చేశాడు. "సొంత దేశం కోసం పనిచేయాలని ఎంతో ఆసక్తి ఉన్నా.. చిన్నచిన్న కారణాలతో లేదా భావోద్వేగ నిర్ణయాలతో ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితిలో భయం వేస్తుంది" అన్నది అతడి వ్యాఖ్యల సారాంశం. సర్ఫరాజ్, ఉమర్ గుల్‌లను పర్యటన మధ్యలోనే తొలగించిన తీరు తనను బాధించిందని ముస్తాక్ పేర్కొన్నాడు.

మరోవైపు, ఇటీవల పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ నుంచి తప్పుకున్న మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ కూడా పీసీబీ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. విదేశీ కోచ్‌లు, స్వదేశీ కోచ్‌ల పట్ల బోర్డు వ్యవహారశైలిలో తేడా ఉందని ఆరోపించాడు. ఓటమి ఎదురైనప్పుడు స్థానిక కోచ్‌లపైనే ఎక్కువ విమర్శలు పడుతున్నాయని, విదేశీ కోచ్‌లకు మాత్రం అధిక అధికారాలు ఇస్తున్నారని వ్యాఖ్యానించాడు. తరచూ ఆటగాళ్లు, కోచ్‌లను మార్చడం వల్ల సమస్యలు పరిష్కారం కావని, స్థిరత్వం, దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని మిస్బా అభిప్రాయపడ్డాడు.

అయితే పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ మాత్రం పీసీబీ చేపట్టిన మార్పుల్లో ఒక వ్యూహం ఉందని భావిస్తున్నాడు. ప్రస్తుత జట్టు నుంచి ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కొత్త తరం ఆటగాళ్లకు అవకాశం కల్పించడమే బోర్డు లక్ష్యమని పేర్కొన్నాడు. అయితే షహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, హారిస్ రౌఫ్‌లాంటి కీలక పేసర్ల విషయంలో మాత్రం పీసీబీ



అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించాడు. జట్టు పునర్నిర్మాణం అవసరమే అయినా.. కొత్త తరం ఆటగాళ్లపై వెంటనే భారీ అంచనాలు పెట్టకూడదని హెచ్చరించాడు.

మొత్తంగా పాకిస్థాన్ క్రికెట్‌లో ఇప్పుడు జట్టు పునర్నిర్మాణమా? లేక తొందరపాటు నిర్ణయాల పరంపరా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ముస్తాక్ చెప్పినట్లుగా మాజీ క్రికెటర్లకు తమ దేశం కోసం పనిచేసే నమ్మకం, భద్రత కల్పించగలిగితేనే పీసీబీ ఈ సంక్షోభం నుంచి దీర్ఘకాలిక పరిష్కారం వైపు అడుగులు వేయగలదన్న అభిప్రాయం బలపడుతోంది.

## షఫాలీకి సెండాఫ్.. ఫాతిమాకు జరిమానా!

**10 శాతం మ్యాచ్ ఫీజు కోత.. రెండో డీమెరిట్ పాయింట్ జమ**

మహిళల ఆసియా కప్‌లో భారత్‌తో మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా చేసిన సంబరాలు ఇప్పుడు ఆమెకే శిక్షను తెచ్చిపెట్టాయి. భారత ఓపెనర్ షఫాలీ వర్మను క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేసిన అనంతరం ఫాతిమా.. పెవిలియన్ వైపు చేయి చూపిస్తూ దూకుడుగా సెండాఫ్ ఇచ్చింది. ఈ చర్యను ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. అంతర్జాతీయ మ్యాచ్‌లో బ్యాటర్ ఔటైన తర్వాత అతడిని/ ఆమెను కించపరిచేలా లేదా ప్రతికూల స్పందనకు దారితీసేలా భాష, చర్యలు, సంజ్ఞలు చేయకూడదన్న ఐసీసీ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ఆర్టికల్ 2.5ను ఆమె ఉల్లంఘించినట్టు నిర్ధారించింది. దాంతో లెవల్-1 ఉల్లంఘన కింద ఫాతిమా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా, అదనంగా ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. ఈ డీమెరిట్ పాయింట్‌తో ఫాతిమా ఖాతాలో 24 నెలల వ్యవధిలో మొత్తం రెండు పాయింట్లు చేరాయి. గత ఏడాది ఆగస్టు 6న డబ్లిన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20లో అంపైర్ ఔటిచ్చినప్పటికీ క్రీజు వీడేందుకు నిరాకరించిన ఘటనలో ఆమెకు తొలి డీమెరిట్ పాయింట్ వచ్చింది. తాజా ఘటనలో తన తప్పును ఫాతిమా అంగీకరించి, మ్యాచ్ రిఫరీ సుప్రియా రాణి దాస్ ప్రతిపాదించిన



శిక్షను స్వీకరించింది. దీంతో ప్రత్యేక విచారణ అవసరం లేకుండానే చర్యలు పూర్తయ్యాయి.

భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఫాతిమా బౌలింగ్‌లో మాత్రం రాణించింది. షఫాలీతోపాటు భారత జట్టు మూడు వికెట్లు ఆమెనే పడగొట్టింది. షఫాలీ 6 బంతుల్లో 12 పరుగులు చేసి దూకుడుగా ఆడుతున్న సమయంలో ఫాతిమా బౌలింగ్‌లోనే వెనుదిరిగింది. అయితే పాకిస్థాన్ బ్యాటర్లు పూర్తిగా విఫలమై కేవలం 55 పరుగులకే ఆలౌటయ్యారు. భారత జట్టు 8.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 56 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల ఘన విజయం సాధించింది. ఇక ఫాతిమాకు తాజా చర్య భవిష్యత్‌లో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు వస్తే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. రెండు సస్పెన్షన్ పాయింట్లు వస్తే ఫార్మాట్‌ను బట్టి మ్యాచ్ నిషేధం ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఫాతిమా ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి.

## అనుకున్న డేట్‌కే 'ది ప్యారడైజ్'

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీని సెప్టెంబరు 24న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే, మరోసారి 'ది ప్యారడైజ్' వాయిదా పడొచ్చంటూ గత రెండు మూడు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు వైరల్ అవుతోంది. ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాలేదని, ఒక పాటను కూడా షూట్ చేయాల్సి ఉందని ఆ పోస్టుల సారాంశం. ఆ వార్తలన్నింటికీ చెక్ పెడుతూ మూవీ విడుదల విషయంలో ఎలాంటి మార్పూ లేదని చిత్ర బృందం మరోసారి ప్రకటించింది. ఇందుకు సంబంధించి సెప్టెంబరు 24న రిలీజ్ డేట్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేసింది. అంతేకాదు, 23 రాత్రి స్పెషల్ ప్రీమియర్లను కూడా ప్రదర్శించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. తెలుగుతోపాటు, ఇతర భాషల్లోనూ ఈ మూవీని విడుదల చేయనున్నారు. విజయవంతమైన 'దసరా' తర్వాత



కథానాయకుడు నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. ఇందులో నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మంచి టాక్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుంటే.. మూవీలో మోహన్ బాబు, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీరావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## చరిత్ర తిరగరాసిన 'స్పైడర్‌మ్యాన్'

హాలీవుడ్ చిత్రాలు భారత్‌లో వసూళ్ల వర్షం కురిపించడం కొత్తేం కాదు. ముఖ్యంగా 'అవెంజర్స్', 'అవతార్, 'స్పైడర్‌మ్యాన్' ఫ్రాంచైజీ చిత్రాలతోపాటు, దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ సినిమాలకూ మన దేశంలో పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. అందుకే ఇక్కడి స్టార్ల సినిమాలతో పోటీపడేలా వాటికి భారీ మొత్తంలో వసూళ్లు వస్తుంటాయి. అయితే ఇప్పటివరకూ ఏ హాలీవుడ్ చిత్రానికీ సాధ్యంకాని రీతిలో ఇండియన్ బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించింది 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే'. ఏకంగా రూ.500 కోట్లు కలెక్ట్ చేసి సత్తా చాటింది. భారత్‌లో ఈ మైలురాయిని అందుకున్న తొలి హాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమైన స్పైడర్‌మ్యాన్ పాత్రతో తెరకెక్కిన సినిమా జులై 30న భారీ అంచనాలతో విడుదలైంది. తొలిరోజు నుంచే కళ్లుచెదిరే వసూళ్లతో అదరగొట్టింది. తొలి వారంలోనే రూ.330 కోట్లకు పైగా వసూలు చేసింది. 39 రోజుల్లోనే రూ.500 కోట్ల మార్కును అధిగమించడం విశేషం. స్పైడర్‌మ్యాన్ పాత్రలో మరోసారి టామ్ హాలండ్ నటించిన చిత్రం ప్రపంచవ్యాప్త వసూళ్లలోనూ తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకూ రూ.22,600 కోట్లకు పైగా వసూలు చేసినట్లు హాలీవుడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

## త్రివిక్రమ్ ముందు పెద్ద ఛాలెంజే!




ఎన్టీఆర్ హీరోగా రాబోతున్న పాన్-ఇండియా మైథాలజికల్ యాక్షన్ ఎపిక్ 'గాడ్ ఆఫ్ వార్'. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ డ్రీమ్ ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమాలో ఎన్టీఆర్ కుమారస్వామి పాత్రలో కనిపించబోతున్నాడన్నది తెలిసిందే. మరోవైపు కుమారస్వామి పాత్రలో తమిళ హీరో ధనుష్ కూడా నటిస్తున్నాడు. ఈ జనరేషన్ హీరోలు దేవుడి పాత్రలో తానే దేవుణ్ణి అని నమ్మించాలంటే.. నడక, చూపు, హావభావాలు, మరియు మాడ్యులేషన్ ద్వారానే ఆ పాత్రలోని దైవత్వాన్ని ఆడియన్స్ ఫీల్ అయ్యేలా చేయాలి. అంటే కేవలం తమనటన ద్వారానే దైవత్వాన్ని బయటకుతీస్తేనే ఆ పాత్రను ప్రేక్షకులు ఓన్ చేసుకుంటారు. మరి 'ఎన్టీఆర్ - ధనుష్'లలో ఏహీరో దైవత్వాన్ని ఎక్కువ చూపిస్తారో? అంటూ ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. ఇలాంటి చిత్రాల్లో నటన పరంగా ఎన్టీఆర్‌కే ఎక్కువ మార్కులు పడతాయి. అయితే, ఎన్టీఆర్‌ను దేవుడిగా చూపించడం కంటే...ఆయన తెరపై కనిపించినప్పుడు ప్రేక్షకుడికి "ఇతను దేవుడే" అనే భావన కలిగించడమే త్రివిక్రమ్ ముందున్న అసలైన సవాల్. కాగా ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈచిత్రం అత్యంత భారీస్థాయిలో రూపొందుతోంది. ఇక నటీనటులు మరియు సాంకేతిక బృందానికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే రోజుల్లో వెల్లడి కానున్నాయి.

## 'సాయిబాబా'పై మరో సినిమా


సాయిబాబా జీవితకథ ఆధారంగా తెరకెక్కిన 'తేరా సాయి' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ ఆధ్యాత్మిక సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ప్రముఖ నటుడు సంజయ్ మిశ్రా సాయిబాబాగా కనిపించనున్నారు. పలాశ్ ముచ్చల్ దర్శకత్వం వహించిన సినిమా తెలుగు, తమిళం, మరాఠీ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఇందులో సంజయ్ మిశ్రాతోపాటు షాయాజీ షిండే, మనోజ్ జోషి, అవికా గోర్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు. ఇటీవల 'హనుమాన్ అంశ్' భారీ విజయాన్ని అందుకున్న సినీపోలిస్ ఇండియా దీని డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలను తీసుకుంది. గతంలో సాయి బాబా జీవిత చరిత్రఆధారంగాపలు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 1986లో వచ్చిన 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇళయరాజా అందించిన సంగీతం, బాబా భక్తి పాటలు ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో మారుమోగుతూనే ఉన్నాయి. బాబా పాత్రలో అగ్రకథానాయకుడు నాగార్జున నటించిన 'షిర్డీ సాయి' 2012లో విడుదలై విజయం సాధించింది.

## సెకెండ్ ఇన్నింగ్స్‌లో బిపాసా

స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన నటి బిపాసా బసు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు ఓ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న పీరియడికల్ క్రైమ్ థ్రిల్లర్ 'బారాబంకి'లో బిపాసా బసు కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. క్రైమ్, డ్రామా అంశాలతో రూపొందుతున్న సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతోందనేది ప్రస్తుతం ఆసక్తికరం. 'బారాబంకి' కథ 1984లో చోటుచేసుకున్న యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కనుందట. పీరియడిక్ బ్యాక్‌డ్రాప్‌లో క్రైమ్, డ్రామాను మిళితం చేస్తూ సినిమాను తెరకెక్కిస్తున్న నేపథ్యంలో.. హన్సల్ మెహతా మార్క్‌లో ఉండే రియలిస్టిక్ మేకింగ్ కనిపించనుందని సినీవర్గాల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. బిపాసాతోపాటు యువ నటులు సన్నీ కౌశల్, విశాల్ జేత్వా కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే బిపాసా పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం వెల్లడికాలేదు. కథలో ఆమె పాత్ర కీలక మలుపులకు కారణమవుతుందా? లేక కథను నడిపించే ప్రధాన పాత్రలో కనిపిస్తారా? అనేది కొద్దిరోజుల్లోనే క్లారిటీ రావొచ్చు. బిపాసా చివరిసారిగా 'అలోన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. ఇప్పుడు 'బారాబంకి'తో బిపాసా రీ-ఎంట్రీ ఇస్తున్నారనే వార్త ఆసక్తి పెంచుతోంది.



## అటాక్ స్టార్ట్ చేసిన 'రణబాలి'




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్‌లూ ప్రతి నాయకుడిగా నటిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలు షురూ చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబరు 9న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మూవీ విడుదలకు దాదాపు నెల రోజుల సమయం ఉండటంతో సినిమాను ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే టీజర్‌తో ఈకార్యక్రమాలను మొదలు పెట్టనుంది. ఇది 1854 -1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం సమకూరుస్తున్నారు.

## హనుమాన్ అంశ్.. రికార్డుల హల్‌చల్



పాన్ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన 'ధురంధర్', 'పుష్ప' చిత్రాలెక్కడ? హిందీలో తప్ప ఇంకే భాషలోనూ విడుదల కాని 'హనుమాన్ అంశ్ ఎక్కడ? అలాంటి ఓ చిన్న సినిమా పాన్ఇండియా సినిమాల రికార్డులు బద్దలు కొట్టడమా అని ఆశ్చర్యపోతున్నారు కదూ? నమ్మశక్యం కాని అలాంటి అద్భుతం ఇప్పుడు బాలీవుడ్‌లో ఆవిష్కృతమైంది. అయిదో వారాంతం వసూళ్ల విషయంలో 'ధురంధర్', 'పుష్ప'లను వెనక్కి నెట్టింది హనుమాన్ అంశ్. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 7న విడుదలైంది. తొలి రెండు వారాలు అంతగా ప్రభావం చూపించని 'హనుమాన్ అంశ్, పాజిటివ్ మౌత్ టాక్‌తో మూడోవారంనుంచి అనూహ్యంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. 31 రోజుల్లోనే రూ.100 కోట్ల మైలురాయిని చేరుకుంది. అయిదో వారాంతంలో ఈ మూవీ ఏకంగా రూ.45.60 కోట్లు కలెక్ట్ చేయడం విశేషం. దీంతో అయిదో వారాంతం వసూళ్లకు సంబంధించి ధురంధర్: పార్ట్ 1 (రూ.35.80 కోట్లు), ఛావా (రూ.22 కోట్లు), స్త్రీ-2 (రూ.16 కోట్లు), పుష్ప2: హిందీ వెర్షన్ (రూ.14 కోట్లు), ధురంధర్-2 (రూ.12.75 కోట్లు) చిత్రాలను వెనక్కినెట్టి 'హనుమాన్ అంశ్' తొలి స్థానంలో నిలిచినట్లు బాలీవుడ్ విశ్లేషకులు వెల్లడించారు. స్వదేశంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం సెప్టెంబరు 11న విదేశాల్లో విడుదల కానుంది.